నమస్తే తెలంగాణ
తాజా వార్తలు, ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ
జిల్లా టాబ్లాయిడ్ వార్తల కోసం
10, 11పేజీలు
చూడండి.

గురువారం 9.4.2020 • సంపుటి 9 • సంచిక 285 • వెల. రూ. 6.50 | కరీంనగర్ పేజీలు : 12 | విదియ

సూర్యోదయం: 6.02, సూర్యాస్తమయం: 6.26, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, కృష్ణపక్షం విదియ అ.రా 12.39 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: స్వాతి అ.రా 12.05 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: సాయంత్రం 4.29 నుంచి 5.53 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.48 నుంచి 3.20 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.07 నుంచి సాయంత్రం 4.47 వరకు, వర్జ్యం: ఉదయం 8.00 నుంచి 9.25 వరకు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

• మన కథానాయిక

## పెద్దపులికే భయపడలే!

- కరోనాకు భయపడుతనా?
- గర్భిణులు, శిశువులకు రోజూ నిరాటంకంగా పౌష్టికాహారం
- ఇబ్బందులున్నా.. డ్యూటీలోనే
- సిటిజెన్ హీరో, అంగన్‌వాడీ టీచర్ మడప రమణమ్మ

'అడవిలో పెద్దపులి తిరిగినప్పుడే డ్యూటీ చేసిన.. కరోనా పెద్దపులికంటే భయంకరమైంది కావొచ్చు. కానీ భయపడతమా ఏంది? ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించినా.. చిన్నపిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ ఆగిపోవద్దు కదా.. ఇంట్ల కూర్చుంటే అయితదా?' సిటిజెన్ హీరోగా ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌తో ప్రశంసలు అందుకొన్న అంగన్‌వాడీ టీచర్ రమణమ్మ ధైర్యమిది. విధినిర్వహణ పట్ల ఆమెకున్న నిబద్ధత ఇది. సమాజం పట్ల, పేద మహిళల పట్ల ఆమెకున్న జవాబుదారీతనం ఇది.



వాజేడు మండలం చింతూరులో ఓ మహిళకు గుడ్లు అందజేస్తున్న మడప రమణమ్మ

**వరంగల్ ప్రధాన ప్రతినిధి/వాజేడు-నమస్తే తెలంగాణ:** రమణమ్మ.. ఓ ఆదివాసీ కోయ మహిళ. ములుగు జిల్లా వాజేడు అటవీప్రాంతంలోని లక్ష్మీపురం నివాసి. అడవిలో పుట్టి.. అడవిలో పెరిగి.. అడవిబిడ్డలకు అండగా నిలువడంకోసం అంగన్‌వాడీ టీచర్‌గా పాతికేండ్లుగా వృత్తిజీవితాన్ని కొనసాగిస్తున్నారు. దట్టమైన అటవీప్రాంతంలో పెద్దపులుల వంటి క్రూరమృగాలు స్వేచ్ఛగా సంచరించే చోట వెరపు లేకుండా పనిచేసిన ధీర. ఇప్పుడు కరోనా మహమ్మారి ప్రపంచాన్నే వణికిస్తున్నది. రాష్ట్రప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. పాలు, కూరగాయలు, సరుకులు డెలివరీచేసే వాళ్లు కూడా ఇంటింటికి వెళ్లి పంపిణీచేయడం మానేశారు. ఇంటింటికి వెళ్తే ఎక్కడ కరోనా అంటుకుంటుందోనన్న ఆందోళన నెలకొన్నది. రమణమ్మ మాత్రం తన బాధ్యత మరచిపోలేదు. కరోనా తీవ్రత ఏ స్థాయిలో ఉన్నప్పటికీ.. పసిపిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా సమయానికి అందించాల్సిన పౌష్టికాహారం ఎలాగైనా అందించాల్సిందేనన్న కర్తవ్యదీక్షతో ఆమె కదిలింది. శిశు మరణాల నివారణకు కానీ, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి కానీ పౌష్టికాహారం అత్యవసరం. ఎలాంటిస్థితిలోనూ వాటిని ఆపడానికి వీలు లేదు. అందుకే రమణమ్మ తన స్కూటీపైనే పౌష్టికాహారాన్ని తీసుకెళ్లి ఇంటింటికీ చేరవేస్తున్నారు. స్కూటీ రమణమ్మగా పేరుతెచ్చుకొన్న ఆమె సేవలకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారక రామారావు ముగ్ధులయ్యారు. నిజమైన సిటిజన్ హీరోగా అభివర్ణిస్తూ కొనియాడారు. దీంతో

మిగతా 2వ పేజీలో



కరోనాపై పోరాటానికి కోటి రూపాయల విలువైన వైద్యసామగ్రిని విరాళంగా ఇస్తూ సంబంధిత పత్రాలను బుధవారం ప్రగతిభవన్‌లో మంత్రి కే తారకరామారావుకు అందజేస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సీఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల

## కేసులు యువతలో.. మరణాలు వృద్ధుల్లో

# కంత్రీ కరోనా

- యువజనం రహస్య వాహకులుగా మారే ముప్పు
- వారికి వ్యాధి ఉన్న సంగతి వారికే తెలియని స్థితి
- ప్రభావితమవుతున్న వృద్ధులు, దీర్ఘకాల రోగులు
- కరోనా వైరస్ వ్యాప్తి తీరుపై అధ్యయనాల్లో వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మేము యువకులం.. కరోనా మమ్మల్ని ఏమీ చేయదు అని అనుకునే యువత పారాహుషార్! కొందరి శరీరంలోని రోగనిరోధకశక్తి కరోనాతో పోరాడటం వల్ల వారు ఆ వ్యాధి వల్ల ప్రభావితం కాకపోవచ్చు. కానీ వారి మూలంగా వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు కరోనాకు గురై మృత్యువాత పడే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా, తెలంగాణలో కరోనాకు గురవుతున్న రోగులు, మృతులపై జరిపిన అధ్యయనాల్లో ఇదే విషయం వెల్లడవుతున్నది. కరోనా రోగుల్లో యువత అధిక సంఖ్యలో ఉండగా, మృతుల్లో వయోవృద్ధులు, దీర్ఘకాలిక రోగుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. చాలామందిలో వ్యాధి లక్షణాలు లేకపోయినప్పటికీ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అవుతున్నారు. యువత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమకు తెలియకుండానే ఇతరులకు వ్యాధి వ్యాప్తిచేసే ముప్పు ఉన్నట్టు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అందువల్ల యువత కరోనాపట్ల అలక్ష్యం చూపితే తీవ్రపరిణామాలకు దారితీసే ప్రమాదం పొంచి ఉన్నది.

**వ్యాధిగ్రస్థుల్లో 60శాతం మంది యువకులే**

రోగనిరోధకశక్తి ఉన్నవారు కరోనాను జయించినట్టు వార్తలు వెలువడటంతో యువత నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వాలు విధించిన లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా తిరుగుతున్నారు. వారి

మిగతా 2వ పేజీలో

## బహిరంగప్రదేశాల్లో ఉమ్మడం నిషేధం



- ఉత్తర్వులు జారీ.. తక్షణం అమల్లోకి
- అంటువ్యాధుల అడ్డుకట్టకు నిర్ణయం
- కరోనా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు
- సింగపూర్ తరహాలో అమలు..

3

## పదిహేను నిమిషాల్లోపే అంత్యక్రియలు

- ఒక్కశవం వెంట ఐదుగురికి అనుమతి
- స్పెయిన్‌లో జాతీయ విధానంగా అమలు

5

## ట్విట్టర్ విరాళం రూ.7,500 కోట్లు



కరోనాపై పోరులో సీఈవో జాక్ డోర్సీ ఉదారత

తన సంపదలో 28 శాతం సహాయంగా ప్రకటన

5

## నిర్మూలన ఇప్పట్లో అసాధ్యం

- కరోనాను జయించేందుకు వ్యాక్సిన్లే మార్గం
- వ్యక్తిగత శుభ్రత, దూరాన్ని పాటించడం ముఖ్యం
- వైరస్ బ్రేక్‌డౌన్‌కు లాక్‌డౌన్లు తప్పనిసరి
- 'నమస్తే తెలంగాణ'తో 'కిమ్స్' ఎండీ భాస్కర్‌రావు



కొవిడ్-19 వల్ల అమెరికా, యూరప్ దేశాల్లో ఉన్నంత నష్టం మన దేశంలో ఉండకపోవచ్చు. గతంలో కలరా లాంటి ఎన్నో భయంకర వ్యాధులను ఎదుర్కొన్న మన దేశంలో ముందుజాగ్రత్తగా బీసీజీ వ్యాక్సిన్లను తీసుకునే అలవాటున్నది. స్మాల్‌పాక్స్, చికెన్‌పాక్స్, పోలియో లాంటి వ్యాక్సిన్ల వినియోగంతో ఇక్కడి ప్రజల్లో తెలియకుండానే ఓ రకమైన వ్యాధినిరోధక శక్తి ఏర్పడుతుంది. పాశ్చాత్య దేశాల ప్రజలు ఇలాంటి ముందుజాగ్రత్తలు పాటించరు. పరిస్థితినిబట్టి అప్పటికప్పుడు ఔషధాలు వాడటమే తప్ప ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించకపోవడం, వారి ఆహార అలవాట్లు ప్రకృతికి దగ్గరగా లేకపోవడం అక్కడ ప్రధాన సమస్య.

3

# చిన్న జిల్లాలు పెద్ద మేలు



తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అర్జునగుట్ట వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ భారతీహోళికేరి

### కరోనాపై పోరుకు కలిసొచ్చిన జిల్లాల విభజన

- క్షేత్రస్థాయిలోనే 33 మంది కలెక్టర్లు, ఎస్పీలు.. నిమిషాల్లో వైరస్ అనుమానితుల గుర్తింపు
- లాక్‌డౌన్ అమలుపై ఎస్పీల నిరంతర పర్యవేక్షణలు.. ప్రతి చెక్‌పోస్టూ స్వయంగా తనిఖీ
- కూలీల క్యాంపుల్లో కలెక్టర్ల ప్రత్యక్ష పరిశీలన.. ఆయుధంగా మారిన సమగ్ర కుటుంబ సర్వే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటుచేసిన చిన్న జిల్లాలు కరోనాపై పోరుకు ఎంతో కలిసొస్తున్నాయి. కరోనా అనుమానితులను క్షణాల్లో గుర్తించి.. నిమిషాల్లోనే క్వారంటైన్ చేయడానికి అవకాశం ఏర్పడుతున్నది. పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో పది జిల్లాలను 33 జిల్లాలుగా విభజించారు. దీంతో 10 మంది కలెక్టర్లు, ఎస్పీల స్థానంలో 33 మంది కలెక్టర్లు, ఎస్పీలు వచ్చారు. కొన్నిజిల్లాలను కలిపి పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటుచేసినచోట ఐపీఎస్ అధికారుల సంఖ్య కూడా పెరిగింది. దీంతో క్షేత్రస్థాయిలోనే పటిష్ఠమైన ప్రభుత్వ యంత్రాంగం ఏర్పడింది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో సీఎం కేసీఆర్ చేయించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఏగ్రామంలో ఎవరున్నారనే జాబితా సిద్ధంగా ఉండటంతో ఏ చిన్న సంఘటన జరిగినా ప్రభుత్వయంత్రాగం క్షణాల్లో అక్కడ వాలిపోతున్నది. ఇప్పుడు కొవిడ్-19 నుంచి యావత్ రాష్ట్రాన్ని కాపాడేందుకు ఇదే ప్రధాన

మిగతా 4వ పేజీలో



## లాక్‌డౌన్ 14న ఎత్తివేయలేం

**సంకేతాలిచ్చిన ప్రధాని మోదీ**

- దేశంలో 'సామాజిక అత్యవసర' పరిస్థితులు
- కఠిన నిర్ణయాలు తప్పవు
- కరోనాకు ముందు, తర్వాత జీవితం ఒకేలా ఉండదు
- విపక్షాల ఫ్లోర్‌లీడర్లు, నేతలతో భేటీలో ప్రధాని వ్యాఖ్యలు

5

## రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం 14 వేల కోట్లు

- విడుదల చేసిన కేంద్రప్రభుత్వం

12

## అమెరికాకు క్లోరోక్విన్

- 2.9 కోట్ల డోసులు అందజేత
- మోదీది గొప్ప మనసు
- ప్రతీకార చర్య తప్పదన్న మర్నాడే ట్రంప్ మెచ్చుకోలు

5

## డబ్ల్యూహెచ్‌వోపై ట్రంప్ గుస్సా

- కరోనాపై హెచ్చరించలేదని ధ్వజం
- చైనాకు అనుకూలమని ఆరోపణ
- ఆరోగ్య సంస్థకు నిధుల నిలిపివేత

# అమెరిగన్స్!

- కరోనా మహమ్మారి విలయతాండవంతో ఆత్మరక్షణలో అమెరికన్లు
- ఒక్క మార్చి నెలలోనే 20 లక్షల తుపాకుల కొనుగోలు
- ఇప్పటికే అగ్రరాజ్యంలో ప్రతి వంద మందికి 120.5 తుపాకులు



**అక్కడ** గొడవల్లో మనుషులకంటే ముందు తుపాకులే మాట్లాడుతాయి! జనానికి కూడా ఎదుటివాడి నోటినుంచి వచ్చే మాటకంటే.. వాడి తుపాకీలోంచి వచ్చే తూటా అంటేనే భయమెక్కువ! వ్యవస్థపై విసుగెత్తినవాడైనా.. తనపైతనకే కోపం ఉన్నవాడైనా.. అక్కసునంతా వెళ్లగక్కేది తుపాకీ గొట్టాలద్వారానే! ఆఖరుకు ఆకలితో ఉన్నవాడు చేయిచాచేది కూడా తుపాకిని చూపించే! అందుకే అక్కడ తుపాకికి విలువెక్కువ! చాలా దేశాల్లో ప్రతి వందమందిలో 30 లేదా 40 మందికి తుపాకులుంటే.. అక్కడ మాత్రం సగటున వందమందికి 120.5 తుపాకులు ఉన్నాయంటే.. పరిస్థితి తీవ్రత అర్థమవుతున్నది! ప్రత్యేకించి సంక్షోభ సమయాల్లో ఆత్మరక్షణకు సైతం తుపాకులే అవసరమవుతున్నాయి. ఇప్పుడు మరీ భయానక పరిస్థితుల ఊబిలోకి అమెరికా వెళ్లిపోబోతున్నది. కరోనా మహమ్మారి లక్షల మంది అమెరికన్ల ప్రాణాలు తీస్తుందనే వార్తలు.. శవాలు గుట్టలు పడుతున్న వాస్తవాలు కండ్లముందు కనిపిస్తున్న నేపథ్యంలో మరింతమంది తుపాకులను ఆశ్రయిస్తున్నారు. రాబోయే ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై దోపిడీలు.. దారుణాలు జరిగే ఆస్కారమున్నదనే అనుమానంతో ముందుజాగ్రత్త చర్యగా పెద్దసంఖ్యలో తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. ఒక్క మార్చి నెలలోనే అమెరికన్లు ఖరీదు చేసిన తుపాకుల సంఖ్య ఎంతో తెలుసా? అక్షరాలా ఇరవై లక్షలు!

వివరాలు 5వ పేజీలో

## 14 లక్షల మందికి ఐటీ రిఫండ్స్

- ఆదాయం పన్నుశాఖ నిర్ణయం

12



ప్రపంచవ్యాప్తంగా
మొత్తం కేసులు: **14,91,470**
మరణాలు: **87,444**
కోలుకున్నవారు: **3,19,060**

| దేశం | కేసులు | మృతులు |
|---|---|---|
| అమెరికా | 4,18,410 | 14,240 |
| స్పెయిన్ | 1,46,690 | 14,673 |
| ఇటలీ | 1,39,422 | 17,669 |
| ఫ్రాన్స్ | 1,12,950 | 10,869 |
| జర్మనీ | 1,10,483 | 2,183 |

మొత్తం కేసులు: **5,689**
మృతులు: **181**
కోలుకున్నవారు: **506**

యాక్టివ్ కేసులు: **397** మృతులు: **11**
కోలుకున్నవారు: **45**

ఇంతచేసినా నువ్వెళ్లకపోతే వైరస్సా
తీగలమీద వేళ్లు కాదు.. నా కలంతో మీటుతా ఆ మోతను
వింటు వింటూనే నువ్వు సొమ్మసిల్లిపోవటమో
నిర్వేత్తి పడి చావటమో ఖాయం! ఇది నిజం!
- కందుకూరి శ్రీరాములు

లాక్‌డౌన్-డే 17

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 38.0°c | 24.1°c | మెదక్ | 39.3°c | 19.2°c |
| కరీంనగర్ | 38.0°c | 24.0°c | ఆదిలాబాద్ | 38.8°c | 23.2°c |
| వరంగల్ | 37.0°c | 24.0°c | నిజామాబాద్ | 39.0°c | 22.7°c |
| రంగారెడ్డి | 38.7°c | 18.9°c | మహబూబ్‌నగర్ | 36.6°c | 21.0°c |
| నల్లగొండ | 38.2°c | 23.8°c | ఖమ్మం | 38.0°c | 27.0°c |

# కరోనా కట్టడికి మేము సైతం..

- జైళ్లలో శానిటైజర్, మాస్కులతో కిట్లు • మార్కెట్‌లో జీసీసీ శానిటైజర్లు • మాస్కులు కుడుతున్న మహిళా సంఘాలు
- అత్యవసర సేవల్లో ఉన్నవారికి ఉచితం • ఇప్పటికే 4.63 లక్షల మాస్కులు సరఫరా • మహిళా సంఘాలకు మంత్రి కేటీఆర్ అభినందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ నియంత్రణకు ప్రభు త్వం సర్వ శక్తులు ఒడ్డుతున్నది. ప్రజలు కొవిడ్ బారిన పడ కుండా ఉండేందుకు తపిస్తున్నది. ఇందుకు మేము సైతం అంటూ మహిళా సంఘాలు, జైళ్లల్లో ఉన్న ఖైదీలు, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ముందుకొచ్చాయి. తమకు తోచిన రీతిలో సహాయసహకారాలు అందిస్తున్నాయి. సేవాభావంతో శానిటైజర్లు, మాస్కులు తయారుచేస్తూ తక్కువ ధరకే అందజేస్తున్నాయి. మహిళా సంఘా లు అత్యవసర సేవల్లో ఉన్న వైద్య, పోలీస్, పారిశుద్ధ్య సిబ్బందికి ఉచితంగా పంపిణీచేస్తున్నాయి.



చర్లపల్లి సెంట్రల్ జైలులో మాస్కులు తయారుచేస్తున్న ఖైదీలు

### జైళ్లశాఖ శానిటైజర్లు, మాస్కులు

తక్కువ ధరకు ప్రజలకు మాస్కులు అందించాలన్న లక్ష్యంతో శానిటైజర్లు, మాస్కులతో కూడిన కిట్ల తయారీపై చర్లపల్లి సెంట్రల్ జైలు ఖైదీలు దృష్టిపెట్టారు. ప్రతి కిట్‌లో రెండు లీటర్ల బ్లాక్ ఫినాయిల్ బాటిళ్లు, 300 ఎంఎల్ హ్యాండ్ శానిటైజర్లు రెండు, రెండు హ్యాండ్‌వాష్‌లు, రెండు సబ్బులు, ఖాదీతో చేసిన 12 మాస్కులతో పాటు ఇతర వస్తువులను ఉంచి రూ.900 చొప్పున విక్రయిస్తున్నట్టు జైళ్లశాఖ డీజీ రాజీవ్‌త్రివేది తెలిపారు. ఒకేచోట 15కు మించి కిట్లు ఆర్డర్‌చేస్తే మూడురోజుల్లో డెలివరీ చేస్తామని చెప్పారు. డిజిటల్ పేమెంట్ ద్వారా డబ్బు చెల్లించాలని సూచించారు. మాస్కులు నూలు వస్త్రంతో చేసినవి కావడంతో సబ్బుతో ఉతికి, డెటాయిల్‌లో ముంచి ఆరవేసుకుంటే మరలా వినియోగించుకునేందుకు వీలుంటుంది. హైదరాబాద్‌లో కావాల్సినవారు 9866092127, 9494632100 లో సంప్రదించాలని కోరారు. చంచల్‌గూడ జైలు తోపాటు జిల్లా జైళ్లలోని కర్మాగారాల్లో ప్రత్యేక వస్త్రంతో కూడిన మాస్కులు తయారు చేస్తున్నారు.

### పట్టణాల్లో సిద్ధమైన 2.5 లక్షల మాస్కులు

మున్సిపల్ ఉద్యోగులు, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసుల రక్షణకు అవసరమైన మాస్కుల తయారీ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక బృందాలకు అప్పగించింది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న బృందాలు తయారు చేసిన మాస్కులను ఒక్కోటి రూ.10-రూ.14 చొప్పున మున్సిపాలిటీలు కొనుగోలు చేసేందుకు పురపాలనశాఖ డైరెక్టర్ ఎన్ సత్యనారాయణ అనుమతులిచ్చారు. ఇప్పటికే 2.5 లక్షల మాస్కులు సిద్ధమవగా, 25 వేల మాస్కులను పారిశుద్ధ్య, ఆరోగ్య సిబ్బంది, 1.5 లక్షల మందికి అందజేశారు.

### శానిటైజర్ల తయారీలో కంపెనీలు

శానిటైజర్లు, మాస్కులు, మందుల తయారీని ఫార్మా కంపెనీలు వేగవంతం చేశాయి. మంత్రి కేటీఆర్ సూచన మేరకు ఉత్పత్తిని పెంచాయి. వీటిని దవాఖానలు, వైద్య సిబ్బంది, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, వివిధ ప్రభుత్వశాఖలకు అందివ్వనున్నారు. చాలా కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శానిటైజర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి.

## అందుబాటులో జీసీసీ శానిటైజర్లు




గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేవారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ద్వారా పలు వస్తువులను అందుబాటులోకి తెస్తున్నది. ఈ నేపథ్యంలోనే గిరి ప్రొడక్ట్ పేరిట జీసీసీ ద్వారా శానిటైజర్లను సిద్ధంచేశారు. మొత్తం 60 వేల బాటిళ్లు సిద్ధంచేయగా, 120 మిల్లీలీటర్ల బాటిల్ ధర రూ.50గా నిర్ణయించారు. సంక్షేమభవన్‌లోని ఉద్యోగులు వినియోగించేలా శానిటైజర్లు పంపిణీ చేసినట్టు గిరిజన సంక్షేమశాఖ జేడీ సర్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. అంగన్‌వాడీలకు 32 వేల బాటిళ్లను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు.

## మహిళా సంఘాల పెద్ద మనసు

**మాస్కుల** తయారీకి మహిళా సంఘాలు రంగంలోకి దిగాయి. ఒక్కో సంఘం నుంచి కొంతమంది మహిళలను ఎంపిక చేసి వారికి ముడి సరుకును సరఫరా చేస్తున్నారు. కొన్నిచోట్ల దాతలు కూడా ముందుకొచ్చి మహిళలకు ముడి సరుకు కొని ఇస్తున్నారు. దీంతో మహిళలు కష్టం, కూలీ ఆశించకుండా కుడుతున్నారు. అత్యవసర సేవల్లో ఉన్న సిబ్బందికి ఉచితంగా అందజేస్తున్నారు. రేషన్ దుకాణాలు, కూలీలకు కూడా ఉచితంగా ఇస్తున్నారు. కొన్నింటిని విక్రయిస్తున్నారు. ఒక్కో మాస్కు రూ.8 నుంచి రూ.10 వరకు విక్రయిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల వద్ద సిబ్బందికి కూడా ఉచితంగా అందజేయాలని ఆలోచిస్తున్నారు. రైతులకు మరింత తక్కువ ధరకు అమ్మాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు 4,63,878 సిద్ధం చేశారు. ఇంకా 13.56 లక్షల మాస్కులకు ఆర్డర్లు వచ్చాయి. ప్రస్తుతం జనగామ జిల్లాలో శానిటైజర్లు తయారు చేస్తున్నారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో తయారు చేయనున్నట్టు గ్రామీణాభివృద్ధిశాఖ వెల్లడించింది.

### ప్రశంసించిన మంత్రి కేటీఆర్

మహిళా సంఘాలు మాస్కులు తయారుచేయడం, అత్యవసర సేవల్లో ఉన్నవారికి ఉచితంగా పంపిణీచేయడం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా ప్రశంసించారు. మహిళా సంఘాల ఔన్నత్యాన్ని అభినందించారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ ట్విట్టర్‌లో పోస్టు చేయగా.. కేటీఆర్ స్పందించి ప్రశంసించారు.



కామారెడ్డి జిల్లా కమ్మర్‌పల్లిలో మాస్కులు కుడుతున్న మహిళా సంఘం సభ్యురాలు



## 2 కోట్ల మందికి బియ్యం పంపిణీ

- రెండు, మూడ్రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు
- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బియ్యాన్ని ఎనిమిది రోజుల్లో రికార్డుస్థాయిలో రెండు కోట్ల మందికి పంపిణీచేశామని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఈ నెల ఒకటి నుంచి ఇప్పటివరకు 63.34 లక్షల కుటుంబాలకు 2.51 లక్షల టన్నుల బియ్యాన్ని అందించామని, మరో 24.21 లక్షల కుటుంబాలకు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ నెల 4న 12 లక్షల మంది కార్డుదారులకు బియ్యం అందించామని తెలిపారు. రెండు, మూడ్రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేసే ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. గన్నీ సంచుల కొరతను అధిగమించేందుకు రైస్‌మిల్లర్లు, రేషన్ డీలర్లు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## రక్తదాతలూ స్పందించండి

- కరోనా బాధితులను కాపాడండి
- లాక్‌డౌన్ వేళ పాస్‌లు ఇస్తాం
- హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ




హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కరోనా బాధితుల కోసం రక్తదానంచేసి వారి ప్రాణాలు కాపాడాలని హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జే వెంకటి ప్రజలకు పిలుపునిచ్చారు. లాక్‌డౌన్‌తో రక్తదాన శిబిరాలు లేక ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల్లో రక్తం, కాంపోనెంట్స్ కొరత ఏర్పడే ప్రమాదం నెలకొన్నదని చెప్పారు. ప్రస్తుతం కొవిడ్-19 బాధితులతోపాటు తలసేమియా తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు రక్తం, కాంపోనెంట్స్ అవసరం ఎక్కువగా ఉం డే అవకాశం ఉన్నదని తెలిపారు. నారాయణగూడ ఐపీఎం బ్లడ్‌బ్యాంక్ ద్వారా రక్తాన్ని సేకరించాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించినట్టు పేర్కొన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో దాతలే స్వయంగా నారాయణగూడ ఐపీఎంకు వచ్చి రక్తదానం చేయాలని, ఇందుకు ముందుగానే తేదీ, సమయంతో కూడిన స్లాట్‌ను బుక్ చేసుకోవాలని కోరారు. వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక డోనర్ పాసులను జారీచేస్తామని తెలిపారు. రక్తం ఇవ్వాలనుకొనే దాతలు 84979 58597, 040-29569047 నంబర్లను సంప్రదించి స్లాట్‌ను బుక్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# పెద్దపులికే భయపడలే

మొదటిపేజీ తరువాయి...

రమణమ్మ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ స్ఫూర్తి ప్రదాత అయ్యారు.

### పెద్దపులి కన్నా భయంకరమైన కరోనా

'నేను 25 ఏండ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నాను. చింతూరులో రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఎనిమిదేండ్లుగా రెండు సెంటర్లను నేనే చూస్తున్నాను. రెండు సెంటర్లలో ఆయాలు కూడా లేరు. పై అధికారుల అనుమతి తీసుకొని నాకొచ్చే జీతంలో రూ.1500 పెట్టి ఒక ఆయాను తీసుకున్నా. పాతికేండ్ల కిందట నా జీతం రూ.350. అప్పుడు రోడ్లు లేవు. నేను చేరిన కొత్తలో చింతూరు, లక్ష్మీపురం, చెరుకూరు. ఇవన్నీ దట్టమైన అటవీగ్రామాలు. పెద్దపులి తిరుగుతున్న రోజులను గుర్తుచేసుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది. గుడ్డేలుగులు బాగా తిరిగేవి. వానాకాలం వస్తే రెండు వాగులను దాటుకొని పోయేది. ఇప్పుడు రోడ్లు పడ్డాయి. మాకూ జీతాలు పెరిగాయి. తెలంగాణ వచ్చిన తర్వాత రెండుసార్లు (రూ.7500, రూ.10500) సీఎం కేసీఆర్ జీతాలు పెంచినరు. అంతచిన్న జీతమొచ్చినప్పుడే అంతపెద్ద కష్టాలను ఎదుర్కొన్నాం. ఇప్పుడు చేయకుంటే ఎట్లా?'

### భయపడితే బాధ్యతెట్లా?

'కరోనా సోకొద్దంటే ఇండ్లల్లనే ఉండాలని ప్రభుత్వం చెప్తున్నది. మాకు ఇండ్లల్లో ఉండాలని ఉన్నది. కానీ మా కోసం ఎదురుచూసేటోళ్లు చాలామంది ఉన్నరు. ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం మీదనే ఆధారపడే కుటుంబాలకు సహాయం చేయకపోతే ఎట్లా? జాగ్రత్తలు తీసుకుంటున్నాం. లాక్‌డౌన్ వల్ల అందరూ ఇండ్లల్లో ఉంటున్నరు. స్కూటీమీద ఇంటింటికి వెళ్లి పౌష్టికాహారం ఇచ్చి వస్తున్న. చింతూరులో ఉన్న రెండు సెంటర్లలో 14 మంది ప్రీ స్కూల్ పిల్లలు. పది మంది హోం డెలివరీ పిల్లలు, వారి తల్లులు. ముగ్గురు బాలింతలు ఇలా మొత్తం 31 మందికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న. ఇది నేను రోజుచేసే పనే. కాకపోతే అప్పుడు వాళ్లంతా నా దగ్గరికి వచ్చి తీసుకెళ్లేవారు. ఇప్పుడు నేనే వాళ్ల దగ్గరికి వెళ్లి ఇస్తున్న. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సర్కారు సంకల్పం సన్నగిల్లకుండా నెరవేరాలి. అందుకే నేను నా డ్యూటీ తప్పకుండా చేస్తున్న. మారుమూల గిరిజన ప్రాంతంలో నేనుచేసే ఈ చిన్న పనిని గుర్తించి నన్ను పెద్దమనసుతో వెన్నుతట్టారు మంత్రి కేటీఆర్‌గారు. ఆయన పెద్ద మనసుకు నమస్కారాలు. వారి ప్రోత్సాహం ఎన్నటికీ మరచిపోలేను' అని రమణమ్మ ధన్యవాదాలు తెలిపారు.



చింతూరులో గుడ్లు అందజేస్తున్నరమణమ్మ

### స్కూటీ రమణమ్మ

రమణమ్మ. ఓ సాధారణ అంగన్‌వాడీ వర్కర్. తన పరిధిలోని వారందరికీ స్కూటీమీద తిరుగుతూ పౌష్టికాహారం పంపిణీచేస్తూ స్కూటీ రమణమ్మగా పేరు తెచ్చుకొన్నారు. ములుగు జిల్లా వాజేడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రమణమ్మది వ్యవసాయ కుటుంబం. కోయ గిరిజన కుటుంబానికి చెందిన ఆమె పదో తరగతి వరకు చదువుకున్నారు. పదో తరగతి పూర్తిచేసిన మూడేండ్లకు (1995)లో తమ గ్రామానికి సమీపంలోని చింతూరులో అంగన్‌వాడీ టీచర్‌గా చేరారు. చింతూరు ఏజెన్సీలోని దట్టమైన అటవీగ్రామం. చింతూరుకు మూడు కిలోమీటర్ల దూరంలోని చెరుకూరు గ్రామం వరకే రోడ్డు సౌకర్యం ఉండేది. ఇప్పుడంటే రోడ్డున్నది. అప్పట్లో చిన్నచిన్న పిల్లబాటలు, బండ్లబాటలే. ఆనాడు సైకిలే ప్రయాణసాధనం. ఎనిమిదేండ్ల క్రితం స్కూటీ కొనుక్కొని విధులు నిర్వర్తిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్ అయిన నాలుగేండ్లకు పూసూరు గ్రామానికి చెందిన బోదెబోయిన పాపారావుతో పెండ్లయింది. ఆమెకు ఒక కొడుకు. అతను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మన్నపేట సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు.

## ఫ్లయ్ దుబాయ్.. కార్గో రయ్‌రయ్

కరోనా ప్రభావిత దేశాలకు సరుకు రవాణా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొవిడ్-19 ప్రభావిత దేశాలకు ఫ్లయ్ దుబాయ్ సంస్థ సరుకు రవాణా సేవలు అందిస్తున్నది. ఔషధాలు, వైద్యారోగ్య పరికరాలు, విలువైన వస్తువులు, కొరియర్, విడిభాగాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఉత్తరాలు వంటివి అందజేయడం ఎంతో కీలకమని భావిస్తున్నది. అంతర్జాతీయ పౌరవిమానయాన నిబంధనలను అనుసరించి ప్రయాణికుల కోసం ఉపయోగించే ఆరు విమానాలతోపాటు మొత్తం 44 కార్గో విమానాలను వస్తు రవాణా కోసం వినియోగిస్తున్నది.




భారత్‌తోపాటు అజర్‌బైజన్, ఈజిప్టు, కువైట్, లెబనాన్, సౌదీ అరేబియా, సుడాన్ వంటి దేశాలకు దాదాపు 146 టన్నుల కార్గోను తరలిస్తున్నది. ప్రపంచ ఆరోగ్యసంస్థ, అంతర్జాతీయ విమానయాన నిబంధనలకు అనుగుణంగా కార్గోను పలు దేశాలకు రవాణా చేస్తున్నామని సంస్థ ఉపాధ్యక్షుడు మహ్మద్ హసన్ తెలిపారు.

## త్వరలో పోలీస్ ఫుడ్ యాప్

- అన్నార్తులను, దాతలను కలిపేలా సమన్వయం
- మూడ్రోజుల్లో సేవలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్నార్తులను, దాతలను కలిపేలా ఇప్పటికే ఒక వాట్సాప్ నంబర్ ఇచ్చిన తెలంగాణ పోలీసులు.. తాజాగా మరింత సాంకేతికతతో ఇరువురిని కలిపేలా పోలీస్ ఫుడ్‌యాప్‌ను రూపొందించారు. మూడ్రోజుల్లో యాప్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ యాప్‌లో మూడు క్యాటగిరీలవారు ఉంటారు. భోజనం లేదా రేషన్ అవసరం ఉన్నవారు, దాతలు, కో-ఆర్డినేటర్లు (వలంటీర్లు). ఇప్పటికే పోలీస్ వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇచ్చిన దాతలు, అన్నార్తులు.. భోజనం, సరుకులు చేరవేసేందుకు ముందుకొచ్చే వలంటీర్ల నంబర్లను ఈ యాప్‌లో రిజిస్టర్ చేస్తున్నారు. ఒక ప్రాంతంలోని దాతలు, అన్నార్తుల వివరాలు ఒకేచోటకు వచ్చేలా విభజిస్తున్నారు. ఇదంతా స్విగ్గీ యాప్ తరహాలోనే పనిచేస్తుంది. అయితే ఎక్కడా డబ్బు ప్రస్తావన ఉండదు అంతే.

## అత్యవసరాలకు ఆటంకాలు వద్దు

- సీఎస్‌లకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అత్యవసర వస్తువులు, ఔషధాల ఉత్పత్తి, సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా బుధవారం లేఖ రాశారు. ఈ విపత్తు సమయంలో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అడ్డగోలుగా ధరలు పెంచే ప్రమాదమున్నందున జాగ్రత్త వహించాలన్నారు. ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్-1955 ప్రకారం స్టాక్ పరిమితులను నిర్ణయించి, ధరలు అదుపులో ఉండేలా చూడాలని సూచించారు. డీలర్ల ఖాతాలను ఎప్పటికప్పుడు తనిఖీచేయడం ద్వారా అధిక ధరలకు కళ్లెం వేయాలని, చట్టాన్ని అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లాక్‌డౌన్ కారణంగా ఉత్పత్తి మందగించిందని, ఈ పరిస్థితుల్లో లాభాల కోసం వ్యాపారులు వస్తువులను నిల్వచేసి బ్లాక్ మార్కెట్ చేసే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.



కొదురుపాకలో కార్మికులకు అన్నం వడ్డిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## వలస కార్మికులకు నిత్యాన్నదానం

కొదురుపాకలో ఎంపీ సంతోష్‌కుమార్ ఔదార్యం

**బోయినపల్లి:** ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదన్న సీఎం కేసీఆర్ పిలుపునకు ఎంపీ సంతోష్‌కుమార్ స్పందించారు. లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయిన వలస కార్మికులకు నిత్యాన్నదానం చేసేందుకు ముందుకొచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని ఎంపీ స్వగ్రామం కొదురుపాకలో 200 మందికి సంతోష్‌కుమార్ చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం ప్రారంభించారు.

### ఎంపీ సంతోష్ సహాయకుల విరాళం

ఎంపీ సంతోష్‌కుమార్ వ్యక్తిగత సహాయకుడు శ్రీకాంత్, సెక్యూరిటీ సిబ్బంది సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. వారిని ఎంపీ అభినందించారు.

# 23 % తగ్గిన నేరాలు

- గస్తీ పెరుగడంతో నేరస్థుల్లో వణుకు
- రద్దీతగ్గినా పెరిగిన రోడ్డు ప్రమాదాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ కట్టడి కోసం విధించిన లాక్‌డౌన్‌తో రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం పట్టాయి. సాధారణ రోజులతో పోలిస్తే ప్రస్తుతం నేరాలు 23.63 శాతం తగ్గినట్టు స్పష్టమవుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా ఇండ్లకే పరిమితమవడం, గ్రామం నుంచి నగరం వరకు అడుగడుగునా పోలీసుల గస్తీ ముమ్మరం కావడంతో నేరస్థుల్లోనూ భయం మొదలైంది. ఫలితంగా హత్యలు, దోపిడీలు, దొంగతనాల్లాంటి అనేక నేరాలు గణనీయంగా తగ్గినట్టు పోలీస్‌శాఖ విడుదలచేసిన తాజా గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. లాక్‌డౌన్‌కు ముందు 21 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్నిరకాల నేరాలకు సంబంధించి మొత్తం 12,403 కేసులు నమోదవగా.. లాక్‌డౌన్ విధించిన మార్చి 22 నుంచి సోమవారం వరకు 6,766 కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ కేసుల సంఖ్య హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 1,618 నుంచి 853కు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,882 నుంచి 610కి, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 1,552 నుంచి 777కు తగ్గినట్టు తెలిపారు. లాక్‌డౌన్‌కు ముందు 21 రోజుల్లో 15 దోపిడీలు జరుగగా.. లాక్‌డౌన్ సమయంలో వీటిసంఖ్య నాలుగుకు తగ్గింది. అలాగే దొంగతనాల సంఖ్య 1,108 నుంచి 262కు, హత్యల సంఖ్య 32 నుంచి 10కి, కిడ్నాప్‌లు 210 నుంచి 29కి, హత్యాప్రయత్నాలు 88 నుంచి 24కు, మిస్సింగ్ కేసులు 1,237 నుంచి 414కు తగ్గినట్టు వివరించారు.






### పెరిగిన రోడ్డు ప్రమాదాలు

లాక్‌డౌన్ సమయంలో వాహనరాకపోకలు గణనీయంగా తగ్గినప్పటికీ రోడ్డు ప్రమాదాలు పెరుగడం ఆందోళన కలిగిస్తున్నది. ఏదో అత్యవసర పనులంటూ రోడ్లమీదకు వస్తున్న యువత.. ఖాళీగా ఉన్న రోడ్లపై మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు. లాక్‌డౌన్ విధించిన మార్చి 22 నుంచి ఏప్రిల్ 6 వరకు జరిగిన 199 రోడ్డు ప్రమాదాల్లో 71 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 128 మంది గాయపడ్డారు.

### లోకం పోకడ



# కంత్రీ కరోనా

మొదటిపేజీ తరువాయి...

నిర్లక్ష్యం ఇతరులకు ముప్పుగా పరిణమిస్తున్నది. స్వయంగా వారు వైరస్ బారిన పడటమే కాకుండా ఇతరులకు దానిని అంటిస్తున్నారు. ఈ అలసత్వంతో దేశంలో కరోనా మూడోదశకు దారితీయవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ఈ నెల 2వ తేదీ నాటికి కరోనా సోకినవారిలో 60 శాతం కంటే ఎక్కువమంది 20 నుంచి 49 ఏండ్లలోపు వారే ఉన్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. వీరిలో 73 శాతం మంది యువకులుండగా, 27 శాతం మంది యువతులున్నారు. అయితే వీరిలో చాలామందిలో కరోనా లక్షణాలు కనిపించకపోవడంతో వీరికారణంగా చాపకింద నీరులా వైరస్ విస్తరిస్తున్నది. వారి కారణంగా వయోవృద్ధులు, దీర్ఘకాలిక రోగులు వైరస్ బారినపడుతున్నారు. దేశంలో సంభవిస్తున్న మరణాల సంఖ్యలో వృద్ధులు, దీర్ఘకాలిక రోగులే అత్యధిక సంఖ్యలో ఉంటున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇటువంటి కేసులు తాజాగా నమోదైనట్టు ఆ జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డి తెలిపారు. ఇటీవల ఒక వ్యక్తి గొంతునొప్పితో నిజామాబాద్‌లోని జీజీహెచ్ దవాఖానకు వచ్చి చికిత్స అందించేలోపే మరణించాడని చెప్పారు. అతడు విదేశాలనుంచి రాలేదు, విదేశాలనుంచి వచ్చినవారిని కలువలేదన్నారు. 'ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చిన 16 మందికి పరీక్షలు చేశాం. వారిలో ఎటువంటి వ్యాధి లక్షణాలు లేవు. కానీ అందరికీ కరోనా పాజిటివ్ అని వెల్లడైంది. వీరందరూ యువకులే. వారికి దగ్గులేదు, తుమ్ము రాదు. కానీ వారి కారణంగా వైరస్ దీర్ఘకాలిక రోగులకు వెంటనే సోకుతుంది' అని కలెక్టర్ వివరించారు.

### మృతుల్లో మధుమేహం, బీపీ రోగులే అధికం

కరోనా వైరస్ మధుమేహం, రక్తపోటు, ఆస్తమా వంటి దీర్ఘకాల వ్యాధులున్నవారిని త్వరగా ప్రభావితం చేస్తున్నట్టు వైద్యనిపుణులు జరుపుతున్న అధ్యయనాల్లో వెల్లడైంది. కరోనాబారిన పడుతున్న ఈ రోగుల్లోనే మరణాల రేటు అధికంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా మృతుల్లో హృద్రోగ సమస్య ఉన్నవారు అత్యధికంగా ఉన్నారు. ఆ తరువాతి స్థానాల్లో మధుమేహం, శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్థులున్నారు. నాలుగోస్థానంలో అధిక రక్తపోటు, చివరిస్థానంలో క్యాన్సర్ రోగులు ఉన్నారు. భారత్‌లో సంభవిస్తున్న కరోనా మరణాల్లో మధుమేహం రోగులు మొదటిస్థానంలో ఉండగా, ఆ తరువాత రక్తపోటు, హృద్రోగులు, శ్వాసకోశ సంబంధిత రోగులు ఉన్నారు.

### 60 దాటినవారు జాగ్రత్త

కరోనా వయోధికులపై కూడా ఎక్కువ ప్రభావం చూపుతున్నది. భారత్‌లో సంభవిస్తున్న కరోనా మరణాల్లో 60, ఆపైన వయస్కులే అధికంగా ఉన్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. అదే పాశ్చాత్యదేశాల్లో 80, ఆపైన వయస్కులు కరోనా వల్ల మరణిస్తున్నారు. దేశంలో ఈ నెల ఆరో తేదీ వరకు నమోదైన 4,097 పాజిటివ్ కేసులు, 109 మరణాలపై జరిగిన అధ్యయనంలో.. మృతుల్లో 60, ఆపైన వయస్కులే ఎక్కువగా ఉన్నట్టు తేలింది. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో మృతుల సగటు వయస్సు 20 ఏండ్లు తక్కువగా ఉంది. ఇటలీ తదితర పాశ్చాత్య దేశాల్లో కూడా మృతుల సగటు వయస్సు 70 నుంచి 80 మధ్య ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా కరోనా పాజిటివ్ రోగులు, మృతుల వయో పరిమితిని విశ్లేషించగా, 80 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారు 26.4 శాతం ఉన్నారు. భారత్‌లో పాజిటివ్ రోగులు, మృతుల్లో 60, ఆ పై వయస్కులు 8.9 శాతం మంది ఉన్నారు. ఈ నెల 6 నాటికి చోటుచేసుకున్న 109 మరణాల్లో 69 మంది 60 ఏండ్లు దాటిన వారుండటం గమనార్హం.

| వయసు | పాజిటివ్ కేసులు | మరణాలు | మరణాల రేటు |
|---|---|---|---|
| 40 కంటే తక్కువ | 1,911 | 08 | 0.4 |
| 40-60 | 1,383 | 33 | 2.4 |
| 60 కంటే ఎక్కువ | 773 | 69 | 8.9 |
| మగవారు | 3,091 | 80 | 2.6 |
| ఆడవారు | 976 | 29 | 3.0 |
| మొత్తం | 4,067 | 109 | 2.7 |

**109 మంది మృతుల్లో..**

- 56 శాతం మందికి మధుమేహం ఉండగా, 47 శాతం మందికి రక్తపోటు ఉంది.
- ఈ రెండూ ఉన్నవారు 86 మంది ఉన్నారు.
- ప్రతి ఐదుగురిలో ఒకరు ఆస్తమా లేదా శ్వాస్వకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.
- 16 శాతం మందికి హృద్రోగ సమస్యలు ఉన్నాయి.
- మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలున్నవారు చాలా తక్కువ




ఖాతా నంబర్ : 62354157651
ఐఎఫ్ఎస్సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077
ఎస్‌బీఐ, సెక్రటేరియట్ బ్రాంచ్, హైదరాబాద్.
వాట్సాప్: 9121006471 / 9121006472
https://ts.meeseva.telangana.gov.in/covid/covidcontribution.htm


లాక్‌డౌన్-డే 17





ఆర్ట్ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన రూ.2.20 లక్షల చెక్కును సీఎంఆర్‌ఎఫ్ కోసం బుధవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌కు అందజేస్తున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ప్రణవ్‌సాయి జాస్తి. చిత్రంలో రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్‌కు కిడ్డీస్ సాయం

- దాచుకున్న డబ్బులను ఇచ్చిన చిన్నారులు
- మంత్రి కేటీఆర్‌కు చెక్కులు అందజేసిన ప్రముఖులు

| బుధవారం చెక్కులు అందజేసిన ప్రముఖులు, సంస్థల వివరాలు | |
|---|---|
| రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ | కోటి |
| ఆప్టిమస్ డ్రగ్స్ | 25 లక్షలు |
| వివిన్ డ్రగ్స్ అండ్ ఫార్మా | 25 లక్షలు |
| సార్క్ ప్రాజెక్ట్స్ ఇండియా | 20 లక్షలు |
| టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ | 12 లక్షలు |
| ఇండియన్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ | 11 లక్షలు |
| శతాబ్ది టౌన్‌షిప్ | 10 లక్షలు |
| బిషప్ డాక్టర్ జాబ్ లోహ్రా | 10 లక్షలు |
| ఎస్ఎస్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ | 10 లక్షలు |
| బింజ్ సరియా ఇస్పాత్ | 10 లక్షలు |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నియంత్రణకు ప్రభుత్వంచేస్తున్న ప్రయత్నాలకు చిన్నారులు కూడా తమ వంతు సహాయంచేస్తున్నారు. కిడ్డీబ్యాంకులో దాచుకున్న డబ్బును ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేస్తున్నారు. పుణేలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తున్న హైదరాబాద్‌లోని నందినగర్ బస్తీకి చెందిన ఏ మౌనిక తన తండ్రి రాజు సాగర్ నెలనెలా పంపించే డబ్బుల్లో నుంచి దాచుకున్న రూ.లక్షను మంత్రి కేటీఆర్‌కు అందజేసింది. పలువురు చిన్నారులు సీఎంఆర్‌ఎఫ్‌కు ఆన్‌లైన్‌లో చెక్కులు పంపించారు. తమ జన్మదినం సందర్భంగా చెక్కులను అందించినట్టు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. చిన్నారులను మంత్రి కేటీఆర్ అభినందించారు.

# 1500 బెడ్ల దవాఖాన సిద్ధం

గచ్చిబౌలిలో 15 రోజుల్లోనే ఏర్పాటు

- 22 ప్రైవేట్ దవాఖానల్లో 15,040 బెడ్లు
- ప్రతిరోజూ 900 మందికి పరీక్షలు
- నిరంతరం పర్యవేక్షిస్తున్న సీఎం కేసీఆర్
- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలమేరకు దేశంలో ఎక్కడా లేనివిధంగా గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 15 రోజుల వ్యవధిలో 1500 బెడ్లతో దవాఖానను సిద్ధంచేశామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. బుధవారం కోఠిలోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నమోదైన పాజిటివ్ కేసులకు గాంధీ దవాఖానలోనే చికిత్సచేస్తామని స్పష్టంచేశారు. వైద్య పరీక్షల్లో నెగెటివ్ వచ్చినవారిని జిల్లాల్లోనే క్వారంటైన్‌లో ఉంచుతామని చెప్పారు. కరోనా చికిత్స అందించడానికి 22 ప్రైవేట్ దవాఖానలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. వీటిలో 15,040 బెడ్లు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. కరోనా కట్టడి చర్యలపై సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వశాఖలవారీగా రోజూ 18 గంటలపాటు సమీక్షలు కొనసాగుతున్నాయన్నారు. సీఎస్ స్థాయిలో ఐఏఎస్ అధికారుల కమిటీలతోపాటు తన ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఈ విషయంలో కీలకంగా పనిచేస్తున్నాదని పేర్కొన్నారు. పీపీఈలు, ఎన్-96 మాస్కులు, గ్లౌజ్‌లు, మందులు.. టెస్టింగ్ కిట్లు అధికసంఖ్యలో అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం కేసీఆర్ స్వయంగా ఆయా సంస్థల యాజమాన్యాలతో మాట్లాడి తెప్పిస్తున్నారన్నారు. 5 లక్షల పీపీఈ కిట్లు, 5 లక్షల ఎన్-95 మాస్కులు, 2 కోట్ల డాక్టర్ మాస్కులు, కోటి గ్లౌజ్‌లు, 5 లక్షల గాగుల్స్, 3.5 లక్షల టెస్టింగ్ కిట్లు త్వరలో రానున్నట్లు మంత్రి వెల్లడించారు.రూ.400 కోట్ల వ్యయంతో మందులు కొంటున్నామని చెప్పారు. డిల్లీ మర్కజ్ నుంచి రాష్ట్రానికి 1,100 మందికి పైగా వచ్చారని మంత్రి ఈటల తెలిపారు. మర్కజ్‌నుంచి వచ్చిన వారితో కాంటాక్ట్ అయిన 3,158 మందిని క్వారంటైన్ సెంటర్లలో ఉంచామని, వారిని పరీక్షించి నెగెటివ్ వచ్చినవారిని 14 రోజులు హోం క్వారంటైన్‌లో ఉంచుతామని తెలిపారు. వాళ్లంతా ఏప్రిల్ 21 వరకు ఇండ్లలోనే ఉండాలని స్పష్టంచేశారు. వారిపై వైద్య, పోలీసు సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని, రోజుకు రెండుసార్లు వైద్యసిబ్బంది వెళ్లి పరీక్షిస్తారన్నారు. మర్కజ్ కేసులు తగ్గినప్పటికీ పరిస్థితిని తేలిగ్గా తీసుకోవద్దని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు వెల్లడించారు. చికిత్స పొందుతున్నవారిలో ఎవరి పరిస్థితీ విషమంగా లేదని తెలిపారు. వారిలో కొందరికి పరీక్షలు నిర్వహించి నెగెటివ్ వచ్చినవారిని డిశ్చార్జ్ చేస్తామని మంత్రి ఈటల పేర్కొన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

## కరోనా గుర్తింపునకు 'పల్స్'తో పరిష్కారం

ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ హెల్త్‌కేర్ స్టార్టప్ తయారుచేసిన పల్స్ యాక్టివ్ డిటెక్షన్ స్టేషన్ కరోనా స్క్రీనింగ్ కూడా చేస్తుందని, రియల్ టైం టెలిమెడిసిన్, ఆరోగ్య పర్యవేక్షణ పరిష్కారాలను అందిస్తుందని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ఒకే షిఫ్టులో వందమందిని పరీక్షించే సామర్థ్యం ఉన్నదని ట్వీట్‌చేశారు. హైదరాబాద్ మెడికల్ డివైజెస్ పార్కుకుచెందిన కంపెనీ ఈ పల్స్ యాక్టీవ్ డిటెక్షన్ స్టేషన్ రూపొందించిందని చెప్పారు. 'పల్స్'ను ప్రోత్సహిస్తున్న మంత్రి కేటీఆర్‌ను ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభినందించారు.

**తెలంగాణకు రప్పించండి:** కాశీయాత్రకు వెళ్లి వారణాసిలో చిక్కుకున్నామని, తెలంగాణకు తీసుకొచ్చే ఏర్పాటుచేయాలని జగిత్యాలకు చెందిన పలువురు ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. ఆయారాష్ట్రాలతో సంప్రదించి రోడ్డు మార్గంలోతీసుకొచ్చే అవకాశాలను అన్వేషించాలని డీజీపీని కేటీఆర్ కోరారు.

# తాజాగా 49 మందికి పాజిటివ్

- 453కు చేరిన కరోనా కేసులు
- 397 మందికి కొనసాగుతున్న చికిత్స
- ఆరోగ్యశాఖ బులెటిన్‌లో వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో తాజాగా 49 పాజిటివ్ కేసులు నమోదైనట్లు ప్రజారోగ్యశాఖ బుధవారం ప్రత్యేక బులెటిన్ ద్వారా వెల్లడించింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 453 మందికి పాజిటివ్ నమోదు కాగా, 11 మంది మరణించారు. 45 మంది కోలుకొన్నారు. 397 మంది చికిత్స పొందుతున్నారు.

ప్రజారోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం కేసుల సంఖ్య

| వివరాలు | బుధవారం ఒక్కరోజు | ఇప్పటి వరకు మొత్తం |
|---|---|---|
| కొవిడ్-19 వైరస్ పాజిటివ్స్ | 49 | 453 |
| కోలుకున్న/డిశ్చార్జి అయినవారు | -- | 45 |
| మరణాలు | -- | 11 |
| చికిత్స పొందుతున్నవారు | 397 | 397 |

## వృద్ధులకు 'సీనియారిటీ' యాప్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వృద్ధుల్లో కరోనా లక్షణాలను గుర్తించేందుకు 'సీనియారిటీ, ఆర్పీజీ లైఫ్ సైన్సెస్' సంస్థ 'సేఫ్ సీనియర్స్' పేరిట ఓ యాప్‌ను రూపొందించింది. వైద్య నిపుణులను సంప్రదించి దీనిని తయారుచేసినట్టు తెలిపింది. వృద్ధుల వ్యక్తిగత వివరాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, దీర్ఘకాల వ్యాధులు, విదేశాలకెళితే ఆ సమాచారం రోజువారీ పొందుపరిస్తే తమవద్దనున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆరోగ్య పరిస్థితిని అంచనావేసి అప్రమత్తం చేస్తామని తెలిపింది. https://safeseniors.in/loginలో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొంది.

## పునర్జన్మనిస్తున్న డాక్టర్లు

- ట్విట్టర్‌లో మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అమ్మ జన్మనిస్తే.. డాక్టర్లు పునర్జన్మనిస్తున్నారని మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. 'కరోనాపై పోరాటంలో తెలంగాణ డాక్టర్లు, ఇతర వైద్యసిబ్బంది అంకితభావం, త్యాగనిరతి అద్భుతమైనవి. ప్రాణాలనే పణంగా పెడుతూ సైనికుల్లా పనిచేస్తున్న వీరికి అండగా ఉండటం మన బాధ్యత' అని పేర్కొన్నారు.

## నిజామాబాద్ జిల్లాకు మంత్రి వేముల విరాళం

- టీఆర్‌ఎస్ పార్టీ ద్వారా రూ.15 లక్షలు అందజేత
- బాల్కొండ నియోజకవర్గంలో సిబ్బందికి భోజన వసతి

**నిజామాబాద్,నమస్తేతెలంగాణ ప్రతినిధి:** మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ. 15 లక్షల విరాళాన్ని అందజేశారు. నిజామాబాద్‌కు రూ.10 లక్షలు, కామారెడ్డికి రూ.5లక్షలను టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలతో కలిసి వేర్వేరుగా కలెక్టర్లకు అందజేశారు. బాల్కొండ నియోజకవర్గంలో వైరస్ నివారణకు అత్యవసర సేవలు అందిస్తున్న వైద్య,పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల సిబ్బందితోపాటు మీడియా సిబ్బందికి వేముల ప్రశాంత్‌రెడ్డి సొంతఖర్చుతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ప్రతిరోజూ 1200 మందికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి తండ్రి దివంగత సురేందర్‌రెడ్డి 2001లో కరువు సమయంలో వేల్పూర్‌లో వందమందికి వందరోజులపాటు అన్నదానం చేశారు.

# కరోనా నియంత్రణలో మనం భేష్

- పేదల సాయానికి దాతలు ముందుకు రావాలి
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నియంత్రణ చర్యల్లో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన ఉన్నదని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్బీస్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సూచనలను అమలుచేయడంతోపాటు కేంద్రానికి కరోనాపై సీఎం కేసీఆర్ కీలకసమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారన్నారు. క్లిష్ట సమయంలో ప్రైవేట్ ఉద్యోగులను సంస్థల యజమాన్యాలు ఆదుకోవాలని, ఇంటి అద్దెల కోసం యజమానులు ఒత్తిడి చేయవద్దని కోరారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న వలస కార్మికులను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకొంటున్నదని, రేషన్ కార్డులతో సంబంధం లేకుండా వీరికి కూడా 12 కిలోల బియ్యం, రూ.500 నగదును ప్రభుత్వం అందజేస్తున్నదని చెప్పారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ స్ఫూర్తితో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేపట్టామని, ఎనిమిది రోజులపాటు పంపిణీ చేపడుతామన్నారు.



ఎల్బీనగర్ స్టేడియంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు



జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో బుధవారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలను నిరాడంబరంగా జరిపారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో భక్తులను అనుమతించకపోవడంతో.. బుధవారం ఆలయం బోసిపోయి కనిపించింది.
– మల్యాల


ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
స్పెసిఫికేషన్ నం. TST-CONST-e-16/2019-20/CE (నిర్మాణం)
పని పేరు: టర్న్ కీ పద్ధతిన దిగువ తెలిపిన పనులు (i) 132 KV RTSS వనపర్తి కోసం ప్రస్తుత 132/11KV కొత్తకోట LIS వద్ద 1 నం. 132KV బే. (ii) మహబూబ్‌నగర్ జిల్లాలోని సుమారు 10.35 కి.మీ. పొడవు కోసం ప్రస్తుత 132/11KV కొత్తకోట LIS నుండి ప్రతిపాదిత RTSS వనపర్తి వరకు 132KV DC/SC లైన్. (iii) టర్న్‌కీ పద్ధతిన మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతిపాదిత 132 KV RTSS వనపర్తి వద్ద 1 నం. 132KV మీటరింగ్ బే సరఫరా, స్థాపన, పరీక్షించుట & పనిచేయించుట. తదుపరి వివరాలను http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్: 040-23396000 Extn: 3356, 3643, 3508, 3572, ఫ్యాక్స్: 040-23336171
R.O. No. 02/20
సం/- చీఫ్ ఇంజినీర్, నిర్మాణం



వ్యవసాయ మార్కెటింగ్ శాఖ
జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, సూర్యాపేట. మొబైల్ నెం: 7330944725/9959860166
No. DMO/SRPT/MSP/RMS/2019-20 సంక్షిప్త టెండరు ప్రకటన తేదీ: 07-04-2020
దిగువ ఐటమ్‌ల సరఫరా కోసం తయారీదార్లు/సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి: ఐటమ్ పేరు & షెడ్యూల్ ధర & బయానా: ధాన్యం మాయిశ్చర్ మీటర్లు (డిజిటల్) (145) - రూ. 1,000/- - రూ. 10,000/-. టార్పాలిన్స్ (3000) - రూ. 1,000/- - 10,000/-. ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్ (113) - రూ. 1,000/- - 20,000/-. ఆసక్తిగల సంస్థలు/తయారీదార్లు టెండరు షెడ్యూళ్లను నగదు లేదా DD రూపంలో రూ. 1,000/- (ఒక వేయి రూపాయలు మాత్రమే) చెల్లింపుపై జిల్లా మార్కెటింగ్ అధికారి, సూర్యాపేట నుండి పొందవచ్చును. టెండర్లు సెక్యూరిటీ డిపాజిట్ నిమిత్తం జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, సూర్యాపేట పేరున చెల్లించేలా పట్టికలో చూపిన విధంగా DD రూపంలో బయానా మొత్తంతో జతచేయాలి మరియు జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, సూర్యాపేట వద్ద ఉంచిన టెండరు బాక్సుల్లో కొటేషన్లను వేయాలి. ఏదైనా ఇతర సమాచారాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, సూర్యాపేట నుండి పనివేళల్లో పొందవచ్చును. వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు ఏ కారణాలు చూపకుండా ఏదైనా లేదా అన్ని టెండర్లను తిరస్కరించుటకు/రద్దు చేయుటకు హక్కు కలదు

| | | |
|---|---|---|
| టెండరు షెడ్యూల్ అమ్మకం తేది | : | 08-04-2020న ఉ॥ గం. 10.30 ని॥ల నుండి |
| టెండర్లు దాఖలుకు ఆఖరి తేది | : | 13-04-2020న మ॥ 3.00 గం. వరకు |
| టెండర్లు తెరుచు తేది | : | 13-04-2020న మ॥ గం. 3.30 ని॥లకు |

సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి, సూర్యాపేట సం/- అడిషనల్ జిల్లా కలెక్టర్, సూర్యాపేట
DIPR RO.No. 1132-PP/CL/ADVT/1/2020-21, Dt: 08-04-2020


## మైక్రాన్ ఫౌండేషన్ విరాళం 7.5 కోట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మెమరీ, స్టోరేజ్ సొల్యూషన్స్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన మైక్రాన్ టెక్నాలజీ సంస్థ భారత్‌లో కరోనా వ్యాప్తిని నివారించేందుకు రూ.7.5 కోట్లు విరాళం ప్రకటించింది. ఐదు దేశాలకు మాత్రమే విరాళం ప్రకటించామని, అందులో భారత్ ఒకటని ఎండీ ఆనంద్ రామమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఉద్యోగులు కూడా విరాళాలు ఇచ్చేవిధం ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈసీఐఎల్ ఉద్యోగులు ప్రధాని సహాయనిధికి రూ.2.60 కోట్లు తెలంగాణ సీఎం సహాయనిధికి రూ.23.25 లక్షలు అందజేసినట్లు ఈసీఐఎల్ సీఎండీ తెలిపారు.

## కరోనాపై పోరుకు కాంతవ్వ 'ఆసరా'

**కలెక్టరేట్/సిరిసిల్ల టౌన్:** సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన వెంగళ కాంతవ్వ (73) తాను దాచుకున్న రూ.12 వేల వృద్ధాప్య పింఛన్ డబ్బులను సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళంగా అందజేసింది. భర్త ముత్తయ్య ఆరేండ్ల క్రితం చనిపోగా.. కొడుకు భాస్కర్ గల్ఫ్‌లో ఉండటంతో ప్రస్తుతం ఆమె ఒంటరిగా జీవిస్తున్నది. బుధవారం కలెక్టర్ కృష్ణభాస్కర్‌ను కలిసి రూ.12వేలు అందజేసింది. 'రెండ్రోజుల కింద సీఎం మాట్లాడింది టీవీల జూసిన. సర్కారు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చిండు. నా పెద్దకొడుకు కేసీఆర్ జెప్పిన మాటమీదుగానే నేను దాచుకున్నది కలెక్టర్‌కు ఇచ్చిన. కేసీఆర్ రుణం తీర్చుకున్నానన్న సంతోషంగున్నది' అని చెప్పిన కాంతవ్వను కలెక్టర్ అభినందించారు.



కాంతవ్వకు కృతజ్ఞతలు తెలుపుతున్న కలెక్టర్ కృష్ణభాస్కర్ (ఇన్‌సెట్) కాంతవ్వ

## ఏపీ పోలీస్‌కు రూ.10 లక్షల విరాళం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**ఏపీలోని విజయవాడ పోలీసులకు ప్రముఖ హోమియో వైద్యుడు ఓరుగంటి వెంకటరమణ రూ.10లక్షలు విరాళం అందజేశారు. ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేస్తున్న విజయవాడ పోలీసులకు విరాళం అందించాలని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర ఆదేశించినట్టు ఆయన శిష్యుడు వెంకటరమణ తెలిపారు. బుధవారం చెక్కును సీపీ ద్వారకా తిరుమలరావుకు అందజేసినట్టు చెప్పారు.

## లెక్చరర్లను తొలగించొద్దు.. జీతాలూ ఆపొద్దు

- అఫిలియేటెడ్ కాలేజీలకు జేఎన్టీయూహెచ్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రైవేట్ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలలోపనిచేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీని కరోనా వైరస్ పేరు చెప్పి తొలగించొద్దని, జీతాలు కూడా ఆపొద్దని జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ఆదేశించారు. బుధవారం ఆయా కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లకు లేఖలు పంపారు. వర్సిటీకి తెలియకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉస్మానియా సహా ఇతర వర్సిటీల పరిధిలోని అఫిలియేటెడ్ కాలేజీలలో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించవద్దని, వారి జీతాలు కూడా నిలిపివేయవద్దని ఆదేశాలు జారీఅయ్యాయి. కరోనా నేపథ్యంలో సిబ్బందికి మనోధైర్యం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవాలే తప్ప వారిని వేధించేలా చర్యలు తీసుకోవద్దని వర్సిటీలు స్పష్టంచేశాయి.

## బహిరంగప్రదేశాల్లో ఉమ్మడం నిషేధం

- ఉత్తర్వులు జారీ.. తక్షణం అమల్లోకి
- అంటువ్యాధుల అడ్డుకట్టకు నిర్ణయం
- కరోనా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు
- సింగపూర్ తరహాలో అమలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 వైరస్ వ్యాప్తి కట్టడికి రాష్ట్రప్రభుత్వం మరింత కట్టుదిట్టంగా చర్యలు చేపడుతున్నది. అంటువ్యాధుల ముప్పును సమర్థంగా అడ్డుకొనేందుకు అన్నిమార్గాలనూ అన్వేషిస్తున్నది. ఇందులోభాగంగా సింగపూర్ తరహాలో.. బహిరంగప్రదేశాల్లో ఉమ్మివేయడాన్ని నిషేధించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. బహిరంగప్రదేశాలు, కార్యాలయాలు, రహదారులు.. వంటి ప్రజలు తిరిగేప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు, పాన్, గుట్కాలతోపాటు దగ్గు, జలుబు ద్వారా వచ్చే కఫం ఉమ్మివేయకూడదని ఆదేశాలు జారీచేశారు. బహిరంగప్రదేశాల్లో ఉమ్మివేయడం ద్వారా అంటువ్యాధులు వ్యాపించే తీవ్రమైన ముప్పు పొంచి ఉన్నదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలు తిరిగే ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రహదారుల మీద ఉమ్మివేసే వాహనదారులను ఆటోమెటిక్ వెహికిల్ రికగ్నిషన్ సిస్టం (ఏవీఆర్‌ఎస్) ద్వారా గుర్తించి.. వారిపై చర్యలు తీసుకొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నిషేధాన్ని ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠినంగా వ్యవహరించనున్నారు.




అనుబంధం-I
తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ
10 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) వేలము 2030

| | |
|---|---|
| మొత్తం | : రూ. 1000.00 కోట్లు |
| జారీ ధర | : ప్రతి రూ. 10,000.00లకు రూ. 10,000.00 |
| కరెన్సీ | : 10 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ కాలము | :మొత్తం చేకూరిన వెంటనే ప్రకటన లేకుండా 13-04-2020 వ్యాపార వేళల అనంతరం వెంటనే ముగియగలదు. |

పై రుణము కొరకు తెలంగాణ ప్రభుత్వము చందాలు అభ్యర్థిస్తున్నది. పూర్తి వివరములను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబయి నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
కె. రామకృష్ణారావు
ముఖ్య ఆర్థిక కార్యదర్శి
ఆర్థిక శాఖ
DIPR R.O. No. 2736-DP/CL/Advt/1/2020-21, Dt: 08-04-2020


# నిర్మూలన ఇప్పట్లో అసాధ్యం

- కరోనాను జయించేందుకు వ్యాక్సిన్లే మార్గం
- వ్యక్తిగత శుభ్రత, దూరాన్ని పాటించడం ముఖ్యం
- 'నమస్తే తెలంగాణ'తో కిమ్స్ ఎండీ భాస్కర్‌రావు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌ను సడలించాక కూడా కొన్నినెలలపాటు వ్యక్తిగత పరిశుభ్రతను, నిర్ణీత దూరాన్ని పాటించాలని, లేకపోతే కరోనా మళ్లీ విజృంభించే అవకాశమున్నదని 'కిమ్స్' దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ హెచ్చరించారు. మన దేశంలో కరోనా వ్యాప్తి తక్కువగా ఉండటానికి భౌగోళిక, సామాజిక పరిస్థితులు, ఆహార అలవాట్లే ప్రధాన కారణమని, ఈ వైరస్ చైన్‌లింక్ బ్రేక్‌డౌన్ కావాలంటే లాక్‌డౌన్‌లు తప్పనిసరని 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కరోనాను నిర్మూలించడం ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదని, దీన్నిపూర్తిగా నిర్మూలించాలంటే వ్యాక్సిన్‌ను కనుక్కోవడమే ఏకైక మార్గమన్నారు. కానీ ఇది అంత సులభంకాదని, శాస్త్రీయంగా ఎన్నో పరిశోధనలు, ప్రయోగాలు చేసిన తర్వాతే వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుందని చెప్పారు.

**అంత నష్టం ఉండకపోవచ్చు**

కొవిడ్-19 వల్ల అమెరికా, యూరప్ దేశాల్లో ఉన్నంత నష్టం మన దేశంలో ఉండకపోవచ్చని డాక్టర్ భాస్కర్‌రావు అభిప్రాయపడ్డారు. గతంలో కలరా లాంటి ఎన్నో భయంకర వ్యాధులను ఎదుర్కొన్న మన దేశంలో ముందుజాగ్రత్తగా బీసీజీ వ్యాక్సిన్లను తీసుకునే అలవాటున్నదని, స్మాల్‌పాక్స్, చికెన్‌పాక్స్, పోలియో లాంటి వ్యాక్సిన్ల వినియోగంతో ఇక్కడి ప్రజల్లో తెలియకుండానే ఓ రకమైన వ్యాధినిరోధక శక్తి ఏర్పడుతుందని అన్నారు. పాశ్చాత్య దేశాల్లో ప్రజల ఆహార అలవాట్లు ప్రధానసమస్య అని తెలిపారు.

**చిన్న చిట్కాలతో పెద్ద లాభాలు**

సాధారణంగా మనం ఇండ్లలో పాటించే చిన్నచిన్న చిట్కాలతోనే ఎన్నో రకాల వైరస్‌లను ఎదుర్కోవచ్చని, రోగనిరోధకశక్తిని పెంచుకోవడం ద్వారా ఇది సాధ్యమవుతుందని తెలిపారు. రోజూ మనం ఆహారంలో వాడే పసుపు, ఉప్పు లాంటి ప్రాకృతిక ఔషధాలతో ఎన్నోరకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందగలుగుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నిర్ణీత దూరాన్ని పాటించకపోతే కరోనా తీవ్రత పెరిగి విపత్కర పరిణామాలకు దారితీస్తుంది అని డాక్టర్ భాస్కర్‌రావు హెచ్చరించారు.




# కంటికి రెప్పలా కాపాడుతున్న కేసీఆర్

- కరోనాపై పోరుకు అన్ని ముందస్తు జాగ్రత్తలు
- ప్రతిపక్షనేతలవి పనికిమాలిన విమర్శలు
- మీడియాతో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నేపథ్యంలో రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ తండ్రిలాగా కాపాడుతున్నారని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు 97 శాతం ప్రజలు లాక్‌డౌన్‌ను పాటిస్తున్నారని తెలిపారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంట్లోనే ఉండాలని, స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. కరోనా నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. ముందుజాగ్రత్తగా దాదాపు 20 వేల బెడ్లను సిద్ధంచేసినట్టు తెలిపారు. మెడికల్ కిట్లు, మందులు, సూట్‌లు అడ్వాన్స్‌గా ఏర్పాటు చేసుకున్నామన్నారు. వైద్యులు, పోలీసులు, పారిశుద్ధ్య, పారా మెడికల్ సిబ్బంది ప్రాణాలకు తెగించి సర్వీసు చేస్తున్నారని కొనియాడారు. కేవలం మీడియాలో కనిపించాలనే అత్యుత్సాహంతోనే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని తలసాని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని, చేతకాని దద్దమ్మలని, ఇన్నాళ్లు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఒక పత్రికలో వచ్చిన వార్త గురించి చెప్పారని.. సోషల్ మీడియా యాంటీసోషల్ మీడియాగా మారుతున్నదని అన్నారు. ఇది బురద చల్లుకునే సమయం కాదని హితవు పలికారు.




TELANGANA STATE POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD - 500 082.

T.No.e-16/CE/Civil/Thermal/TSGENCO/2019-20
YTPS – Formation of Water Bound Macadam road along the compound wall for providing access from Narsapur Village to Thimmapur Village at Yadadri Thermal Power Station, Veerlaplem (Vil), Nalagonda Dist. Value of the works: ₹.1,69,80,625/-. Schedule Extended up to: 21.04.2020 at 17:00 Hrs.

T.No.e-15/CE/Civil/Thermal/TSGENCO/2019-20
YTPS – Construction of Security Main Gate and Security Building in Project Area of 5x800MW at Yadadri Thermal Power Station, Dameracherla (Mdl), Nalagonda Dist. Value of the works: ₹. 2,82,32,781/-. Schedule Extended up to: 21.04.2020 at 17:00 Hrs.

T.No.e-09/CE/HPC&HP/TSGENCO/2020-21
MHS – Design, Manufacture, Testing at Manufacturers works and supply of current transformers, potential transformers, lightning arrestors etc., inclusive of packing, forwarding, transit insurance and freight charges for Pochampad Hydro Power Station (4x9 MW) at Pochampad, Nizamabad Dist. Value of the works: ₹.18,70,000/-. Scheduled Open & Closing Date: 20.03.2020 at 17:00 Hrs & 23.04.2020 at 15:00 Hrs.

T.No.e-13/NSHES/TSGENCO/2020-21
NSHES – Supply of 80 KL of EHV grade transformer oil conforming to IS:335/2018 for Nagarjuna Sagar Power House, Nalagonda Dist. Value of the works: ₹. 65,48,393/-. Scheduled Open & Closing Date: 16.03.2020 at 17:00 Hrs & 16.04.2020 at 14:00 Hrs.

For further Details: " www.tsgenco.co.in & https://tender.telangana.gov.in"

లాక్‌డౌన్-డే 17

*కిరణాల్ని తీగెల్ని చేసుకొని ఇంట్లో కిటికీ వీణను సవరించినా
సంగీతానికైనా కరిగిపోతుందేమోనని
వేళ్లతో తీగెల్ని మీటుతుంటే వెళ్లిపోతుందేమోనని ..
మోగుతున్న వీణనుచూసి మైమరిచి పోతుందేమోనని
పాట వింటూనే కిరణాల వేడికి మాడిపోతుందేమోనని
బయట వీస్తున్న గాలికి కొట్టుకుపోతుందేమోనని*
*- కందుకూరి శ్రీరాములు*

# ట్రంపన్న కన్నెర్ర

- డబ్ల్యూహెచ్‌వోకు నిధుల్ని నిలిపివేస్తామని హెచ్చరిక
- కరోనా గురించి సమాచారమివ్వలేదని ధ్వజం
- చైనాకు అనుకూలంగా ప్రవర్తించిందని ఆరోపణ



**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** కరోనా దెబ్బకు అగ్రరాజ్యం అమెరికా అల్లాడిపోతున్నది. వైరస్ కారణంగా చనిపోతున్నవారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. మహమ్మారిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమీ సత్ఫలితాల్ని ఇవ్వడంలేదు. దీంతో అధ్యక్షుడు ట్రంప్ తన అసహనాన్ని వెల్లగక్కుతున్నారు. హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను ఎగుమతి చేయకుంటే భారత్‌పై ప్రతిచర్యకు పాల్పడుతానని హెచ్చరించిన మరునాడే ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో)పై కన్నెర్రజేశారు. తొలినాళ్లలో వైరస్ గురించి సరైన రీతిలో హెచ్చరించడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని ఆరోపిస్తూ.. అమెరికా నుంచి ఆ సంస్థకు ఇవ్వాల్సిన నిధుల్ని నిలిపివేస్తామని హెచ్చరించారు. చైనాకు అనుకూలంగా ప్రదర్శిస్తున్నదని డబ్ల్యూహెచ్‌వోపై ధ్వజమెత్తారు. శ్వేతసౌధంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. 'వైరస్ వెలుగు చూసిన తొలిరోజుల్లోనే డబ్ల్యూహెచ్‌వో దగ్గర దానిపై సమాచారం ఉన్నది. అయినా, దాన్ని మాతో పంచుకోలేదు. వైరస్‌పై మమ్మల్ని అప్రమత్తం చేయడంలో వాళ్లు విఫలమయ్యారు. వాళ్లకు అందుతున్న మొత్తం నిధుల్లో మాదే సింహభాగం. ఆ సంస్థకు ఇస్తున్న నిధుల్ని నిలిపివేస్తాం. వైరస్ నేపథ్యంలో చైనాకు ఎవ్వరూ ప్రయాణించవద్దని సూచించా. నా నిర్ణయాన్ని డబ్ల్యూహెచ్‌వో విమర్శించింది. ఇది పెద్ద తప్పు. వాళ్లు చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు' అని ట్రంప్ మండిపడ్డారు. కాగా, కరోనా అంశాన్ని రాజకీయం చేయొద్దని డబ్ల్యూహెచ్‌వో అమెరికాకు హితవు పలికింది. మరోవైపు, కరోనాపై అందరం సమిష్ఠిగా పోరాటం సాగించాలని ఐక్యరాజ్యసమితి సూచించింది

**చైనా చేతిలో తోలుబొమ్మ**

కరోనా అంశంలో డబ్ల్యూహెచ్‌వో స్పందిస్తున్న తీరుపై అమెరికా సెనేట్ విదేశాంగ సంబంధాల కమిటీ ఛైర్మన్ జిమ్‌రిష్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో డబ్ల్యూహెచ్‌వోపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించారు. చైనా ప్రభుత్వం చేతిలో డబ్ల్యూహెచ్‌వో తోలుబొమ్మగా మారిందని విరుచుకుపడ్డారు.

## అమెరికాకు హైడ్రాక్సీక్లోరోక్విన్

### మోదీ చాలా మంచివాడన్న ట్రంప్

**వాషింగ్టన్:** కరోనా మహమ్మారితో వణికిపోతున్న అమెరికాను ఆదుకోవడంలో భారత్ తన ఉదారతను చాటుకొన్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజ్ఞప్తి మేరకు పెద్ద ఎత్తున కరోనా కట్టడికి వినియోగిస్తున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందులను భారత్ ఎగుమతి చేసింది. ఈ మేరకు హైడ్రాక్సీక్లోరోక్విన్‌పై విధించిన పూర్తి నిషేధాన్ని పాక్షికంగా సడలిస్తూ నిర్ణయం తీసుకొన్న భారత్.. బుధవారం అమెరికాకు దాదాపు 2.90 కోట్ల డోసులను మందులను పంపింది. 'అడిగిందే తడవుగా పెద్ద మొత్తంలో యాంటీ మలేరియా డ్రగ్‌ను పంపి భారత ప్రధాని నరేంద్రమోదీ తన గొప్ప మనుసును చాటుకొన్నారు. ఆయన చాలా మంచివారు' అని హైడ్రాక్సీక్లోరోక్విన్ మందులు అందగానే ట్రంప్ వ్యాఖ్యానించారు. వాళ్లకు కూడా అవసరమైనందున ఈ మందులపై నిషేధం విధించారని, అయినప్పటికీ తన విజ్ఞప్తి మేరకు వెంటనే పంపి ఆదుకొన్నారని ట్రంప్ అన్నారు.

## అంబేద్కర్ జయంతి.. 14న సెలవు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 14వ తేదీన సెలవు ప్రకటించింది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, పరిశ్రమలకు సెలవు వర్తిస్తుందని తెలిపింది.

## వారంలో లొంగిపోవాలి

**న్యూఢిల్లీ:** భీమాకోరేగావ్ కేసులో పౌరహక్కుల కార్యకర్తలు గౌతం నవ్‌లఖా, ఆనంద్ తెల్తుంబ్డే వారంరోజుల్లో జైలు అధికారుల ముందు లొంగిపోవాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ఇప్పటికే వారి ముందస్తుబెయిల్ దరఖాస్తును తిరస్కరించిన సుప్రీంకోర్టు.. తాజాగా ఈ ఆదేశాలను జారీ చేసింది.

## ఆగమై.. ఆపై నోరు జారి!

- ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

**వాషింగ్టన్:** అంతకంతకూ వ్యాప్తి చెందుతున్న కరోనా వైరస్ అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్‌ను ఆగమాగం చేస్తున్నది. రోజూ పిట్టల్లా రాలిపోతున్న జనాన్ని చూసి ఉక్కిరిబిక్కిరవుతున్న ఆయన తన స్వీయ వైఫల్యాల్ని కప్పిపుచ్చుకోవడానికి ఇతరులపై అసహనాన్ని ప్రదర్శిస్తున్నారు. సాధారణంగానే తెంపరితనానికి ఉదాహరణగా నిలిచే ట్రంప్.. కరోనా నేపథ్యంలో అందరిపై నోరుపారేసుకుంటున్నారు. ఇటీవల ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల్లో కొన్ని..

- కరోనాను 'చైనీస్ వైరస్' అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనమయ్యాయి. కొవిడ్-19 చైనాలో వెలుగుచూసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు.
- కరోనా మెక్సికో నుంచి త్వరగా అమెరికన్లకు సోకే ప్రమాదమున్నదని, వలసదారుల అక్రమ రవాణాను నిరోధించేందుకు తాను నిర్మించనున్న గోడ వైరస్ బారి నుంచి దేశ ప్రజల్ని రక్షిస్తుందని వ్యాఖ్యానించారు.
- దేశంలో వైరస్ తీవ్రతను ఎక్కువగా చూపించి, ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్ష డెమొక్రాట్లపైనా ట్రంప్ ధ్వజమెత్తారు.
- కరోనా మహమ్మారిగా మారుతుందని తనకు ఎప్పుడో తెలుసునని, అయితే, వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడంలో తాము విఫలమయ్యామని ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హనుమంతుడిలా అదుకోండి

- మోదీకి బ్రెజిల్ అధ్యక్షుడి లేఖ



**న్యూఢిల్లీ:** లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు హిమాలయాల నుంచి సంజీవినిని తీసుకొచ్చినట్టు.. భారత్ తమకు హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను సరఫరా చేయాలని బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో కోరారు. ఈ ఔషధంపై నిషేధం ఎత్తివేసిన ప్రధాని మోదీని కొనియాడారు. బ్రెజిల్‌లో కరోనా విజృంభిస్తుండటం, వైరస్‌ను ఎదుర్కోవడంలో హైడ్రాక్సీ క్లోరోక్విన్ సమర్థంగా పనిచేస్తుండటంతో బోల్సోనారో మంగళవారం ప్రధాని మోదీకి లేఖరాశారు.

## బాలలపై పెరిగిన వేధింపులు

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ సమయంలో మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని ఇప్పటికే వార్తలు వెలువడగా.. ఇప్పుడు బాలలపైనా వేధింపులు ఎక్కువవుతున్నాయని తేలింది. తమను కాపాడాలంటూ అనేక మంది బాలలు 'చైల్డ్‌లైన్ హెల్ప్' నెంబర్ 1098కు ఫోన్లు చేస్తున్నారు. గత నెల 20 నుంచి 31 వరకు ఈ నెంబర్‌కు 3.07 లక్షల కాల్స్ వచ్చాయని, ఇందులో బాలలు తమను రక్షించాలని చేసిన ఫోన్ కాల్స్ 92,105 ఉన్నాయని చైల్డ్ లైన్ డిప్యూటీ డైరెక్టర్ హర్లీన్ వాలియా తెలిపారు. గత నెల 25 నుంచి మొదలైన లాక్‌డౌన్ తొలి వారంలో.. కాల్స్ 50 శాతం పెరిగాయని హర్లీన్ చెప్పారు.

## పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా పెట్టండి

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ నేపథ్యంలో పిల్లలు ఇంటర్నెట్‌తో అధిక సమయం గడుపుతున్న నేపథ్యంలో వారిపై నిఘా ఉంచాలని తల్లిదండ్రులకు మనదేశ సైబర్ సెక్యూరిటీ సంస్థ సీఈఆర్టీ-ఇన్ సూచించింది. సైబర్ మోసగాళ్ల వలలో పిల్లలు పడకుండా జాగ్రత్త వహించాలని తెలిపింది.



*కరోనాకు కేంద్ర బిందువైన చైనాలోని వుహాన్ నగరంలో 76 రోజుల అనంతరం బుధవారం లాక్‌డౌన్ ఎత్తివేసిన నేపథ్యంలో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకుంటున్న వైద్యులు*

## కరోనాపై పోరుకు రూ. 7,500 కోట్లు

- సాయంగా ప్రకటించిన ట్విట్టర్ సీఈవో



**శాన్ ఫ్రాన్సిస్కో:** కరోనాపై పోరాటానికి ట్విట్టర్ సీఈవో జాక్ డోర్సీ భారీ సాయాన్ని ప్రకటించారు. ఇందుకోసం రూ.7,500 కోట్ల(100 కోట్ల డాలర్ల)ను ఇవ్వనున్నట్లు మంగళవారం తెలిపారు. తన ఆన్‌లైన్ ఆర్థిక సేవల సంస్థ 'స్క్వేర్' నుంచి ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. కరోనా సహాయ కార్యక్రమాలు చేపట్టడానికిగాను ఈ మొత్తాన్ని తాను స్థాపించిన సేవా సంస్థ 'స్టార్ట్ స్మాల్'కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు ప్రస్తుతం ప్రపంచానికి సహాయం అత్యవసరమని చెప్పారు. తాను చేసిన సాయాన్ని చూసి మరికొందరు స్ఫూర్తి పొందుతారని భావిస్తున్నానని, వాళ్లు కూడా తనలాగే ముందుకు వచ్చి సాయం చేస్తారనుకుంటున్నానని తెలిపారు. జీవితం చాలా చిన్నదని, కాబట్టి సహాయం అవసరమున్న వారికి ఈ రోజే చేయూతనిద్దామని జాక్ డోర్సీ పిలుపునిచ్చారు. కాగా జాక్ డోర్సీ చేసిన సాయం ఆయన సంపదలో 28 శాతం కావడం గమనార్హం.

## పోరుకు 'భారీ బలగం'

*ఇప్పటికే పనిచేస్తున్నవారి స్థానంలో భర్తీ • సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆన్‌లైన్ శిక్షణ*

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 మహమ్మారి ముప్పును మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తున్నది. కరోనాపై పోరు కోసం భారీ బలగాన్ని సిద్ధంచేయాలని నిర్ణయించింది. కరోనా కట్టడి, వ్యాప్తి నియంత్రణ కోసం ముందువరుసలో ఉంటూ పనిచేస్తున్నవారి స్థానాన్ని ఈ భారీ బలగంతో భర్తీచేయాలని భావిస్తున్నది. పనిచేసేవారికి అవసరమైన ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నది. ఐజీవోటీలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సాంకేతిక నిపుణులు, ఏఎన్‌ఎంలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పౌర రక్షణ అధికారులు తదితరుల కోసం వివిధ కోర్సులను ప్రారంభించినట్టు కేంద్ర సిబ్బంది మంత్రిత్వశాఖ వెల్లడించింది.



*బుధవారం పుణెలో కవాతు నిర్వహిస్తున్న భద్రతాబలగాలు*

# చిన్న జిల్లాలు పెద్ద మేలు

మొదటిపేజీ తరువాయి...

ఆయుధమయింది.

**అన్ని చెక్‌పోస్టులు తనిఖీ**

రాష్ట్రంలో కరోనా వైరస్ కోరలు గుర్తించిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చారు. ఏ ఒక్కరూ ఇంటినుంచి బయటకు రావొద్దని సూచించారు. రాష్ట్ర సరిహద్దులను మూసివేయడంతోపాటు, జిల్లాల సరిహద్దులు, జిల్లాల్లో ముఖ్యమైన ప్రదేశాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. విభజన కారణంగా జిల్లా విస్తీర్ణం తక్కువగా ఉండటంతో ఒక్కో జిల్లాలో మూడు నుంచి నాలుగు చెక్‌పోస్టులు మాత్రమే ఏర్పాటుచేశారు. దీంతో జిల్లా ఎస్పీ ప్రతిరోజూ ఆయా చెక్‌పోస్టులను స్వయంగా తనిఖీచేసి.. అవసరమైన చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతున్నది. గతంలో జిల్లా విస్తీర్ణం పెద్దదిగా ఉండటంతో ఎస్పీ అన్ని చెక్‌పోస్టులను కనీసం ఒక్కసారి కూడా పరిశీలించేందుకు వీలు కలుగకపోయేది. చిన్న జిల్లాలు కావడంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణయాలు తీసుకోవడంతో, వాహనాల కట్టడిపై గట్టినిఘా పెట్టడంతో లాక్‌డౌన్ పకడ్బందీగా అమలవుతున్నది.

**త్వరగా నిత్యావసరాల పంపిణీ**

లాక్‌డౌన్ కారణంగా ఇండ్లలో ఉంటున్న ప్రజలకు కావాల్సిన నిత్యావసరాలు అందేలా కలెక్టర్లు ఏర్పాట్లు చేశారు. తెల్ల రేషన్‌కార్డుదారులకు 15 కిలోల ఉచిత బియ్యంతోపాటు, 1500 నగదును అందజేశారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లి కూలీలు, వలస కూలీలను గుర్తించి వారికి వసతి సౌకర్యంతోపాటు, సర్కారు అందజేసిన 12 కిలోల బియ్యం, నగదును స్వయంగా పంపిణీ చేశారు. రైతులు వ్యవసాయపనులు నిరాటంకంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో కూలీలు, రేషన్ కార్డుదారులు తక్కువ సంఖ్యలో ఉండటంతో దీంతో కలెక్టర్లే స్వయంగా క్యాంపులకు వెళ్లి పరిశీలించి వారికి సహాయం చేయడానికి వీలు కలిగింది. జిల్లా కలెక్టర్లకు ఎస్పీ, ఇతర అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో కో ఆర్డినేట్ చేసుకుని పనిచేసే అవకాశం చిన్నజిల్లాలతో ఏర్పడింది. జిల్లా, మండలస్థాయిలో ఏర్పాటుచేసిన కరోనా బృందాలకు మినిట్ టూ మినిట్ సమాచారం అందించి మాట్లాడి తగిన ఆదేశాలు ఇవ్వడం సులువైంది.

**ఒక్కరాత్రిలో తబ్లిగీ కాంటాక్ట్‌ల గుర్తింపు**

తెలంగాణ ఆవిర్భవించిన మొదట్లో సీఎం కేసీఆర్ జరిపించిన సమగ్ర కుటుంబసర్వే కరోనా అనుమానితుల గుర్తింపులో అధికారయంత్రాంగానికి ఎంతగానో ఉపయోగపడుతున్నది. సర్వే వివరాలన్నీ కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉండటంతో పని చాలా సులువవుతున్నది. విదేశాల నుంచి వచ్చినవారు. ఢిల్లీలో తబ్లిగీ ప్రార్థనలకు వెళ్లివచ్చినవారితోపాటు, వారితో కాంటాక్ట్‌లో ఉన్నవారిని విశ్లేషించి గుర్తించేందుకు ఈ జాబితా ఎంతో దోహదం చేసింది. రాష్ట్రానికి వచ్చిన సమాచారం జిల్లాలకు పంపించిన ఒక్క రాత్రిలోనే వారిని గుర్తించి క్వారంటైన్‌కు పంపి పరీక్షలు చేయించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించి తగిన చర్యలు తీసుకున్నారు. వాస్తవంగా పెద్దజిల్లాలు అయితే ప్రభుత్వ సమాచారంమేరకు వెంటనే అందరినీ ట్రేస్‌చేయడం కష్టమయ్యేది. 33 మంది కలెక్టర్లు ఫాలో అప్ చేయడంతో యంత్రాంగం వడివడిగా కార్యాచరణ చేపట్టింది. ఉదాహరణకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ మూడుజిల్లాలో కరోనా కేసులు 300 వరకు ఉన్నాయి. ఈ కేసులతోపాటు వాటి ట్రాకింగ్ అంతా మూడుజిల్లాల కలెక్టర్లు చూస్తున్నారు. ఉమ్మడిగా ఉంటే ఒకే కలెక్టర్ చూడాల్సి వచ్చేది. కష్టమయ్యేది.

- సూర్యాపేట జిల్లాలో తబ్లిగీకి వెళ్లొచ్చినవ్యక్తికి వైరస్ పాజిటివ్ రావడంతో అతడు ఎవరెవరితో కాంటాక్ట్‌లోకి వెళ్లాడో అధికారులు వెంటనే పరిశీలించారు. వర్ధమానుకోటలో అతడి అత్తగారి కుటుంబంతో కలిసినట్టు తేలడంతో వెంటనే వారిని పరీక్షించగా అందులో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. దీంతో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ కలిసి గ్రామంలో పర్యటించి గ్రామాన్ని జల్లెడపట్టారు. ఆ కుటుంబం మాంసం విక్రయాలు చేస్తున్నదని తెలుసుకొని వారి దగ్గర మాంసం కొనుగోలు చేసిన వారిని గుర్తించేపనిలో పడ్డారు.
- రిమ్స్‌లో పనిచేసే డాక్టర్ తబ్లిగీకి వెళ్లి మూడ్రోజులు అక్కడే ఉండి విషయం దాచిఉంచాడు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న అధికారులు కాల్‌ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా అతడు ఢిల్లీ వెళ్లివచ్చాడని నిర్ధారించుకుని క్వారంటైన్‌కు తరలించారు. నల్లగొండ జిల్లాకు చెందిన రెండు జంటలు ఢిల్లీకి వెళ్లిరాగా, ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 19 మంది మర్కజ్‌కు వెళ్లొచ్చినట్టు అధికారులు గుర్తించారు. వారితోపాటు వారు కాంటాక్ట్ అయిన వారి వివరాలు సేకరించారు. ఎక్కడికక్కడ కాలనీలనే దిగ్బంధం చేశారు.

**పదిహేను నిమిషాల్లో ఘటనా స్థలికి..**



ఆదిలాబాద్ జిల్లాలో కరోనా అనుమానితులు 35 మంది ఉన్నట్టు తెలియడంతో సమాచారాన్ని సేకరించాం. 77మంది అనుమానితులను గుర్తించి క్వారంటైన్ చేశాం. జిల్లా విస్తీర్ణం తక్కువగా ఉండటంతో మారుమూల గ్రామానికి కూడా గంట నుంచి రెండుగంటల్లో చేరుకొని సమస్యను పరిష్కరించడానికి వీలవుతున్నది. సమాచారం వచ్చిన 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకొని రెస్క్యూ చేయగలుగుతున్నాం.

**- దేవసేన, కలెక్టర్, ఆదిలాబాద్**

## ఒక్క ఘటనను అందరికీ ఆపాదించలేం

- వనపర్తి ఘటనపై హైకోర్టు వ్యాఖ్యలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒక్క ఘటనను రాష్ట్రం మొత్తానికి ఆపాదించలేమని హైకోర్టు వ్యాఖ్యానించింది. నిత్యావసరాల కోసం బయటకు వచ్చిన ప్రజలను పోలీసులు కొడుతున్నారని న్యాయవాది ఉమేశ్‌చంద్ర రాసిన లేఖను సుమోటో పిల్‌గా స్వీకరించి చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారించింది. వనపర్తిలో కుమారుడి ఎదుటే తండ్రిని పోలీసులు కొట్టడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఈ ఘటనలో ఒక పోలీస్‌ను సస్పెండ్ చేసినట్టు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కొవిడ్-19 నేపథ్యంలో పోలీసులు ప్రాణాలను పణంగాపెట్టి విధులు నిర్వర్తిస్తున్నారని, వారి సేవలు గొప్పవని, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం మంచిదికాదని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను 17కు వాయిదావేసింది.

**మరో 3 పిల్స్‌పై విచారణ**

కరోనా బాధితులకు వైద్యం అందిస్తున్న గాంధీ దవాఖాన డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడి ఘటనలపై కఠినచర్యలు తీసుకోవాలని, జనరద్దీ ప్రాంతాల్లో డిజ్‌ఇన్ఫెక్టెంట్ టన్నెల్స్ ఏర్పాటుచేయాలని, లాక్‌డౌన్‌లో ఉద్యోగుల జీతాల్లో కోత విధించడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు వేర్వేరుగా హైకోర్టుకు రాసిన లేఖలను న్యాయస్థానం సుమోటో పిల్‌లుగా స్వీకరించింది.



*బుధవారం రాజేంద్రనగర్ ఐసొలేషన్ కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్న వారి చేతిపై ముద్రవేస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది*

## ఐసొలేషన్ నుంచి స్వీయగృహ నిర్బంధం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఢిల్లీ మర్కజ్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన, వారితో సన్నిహితంగా ఉన్న రంగారెడ్డి(72), జగిత్యాల(52), కరీంనగర్(68) జిల్లాలకు చెందిన 192 మంది ఐసొలేషన్ కేంద్రం నుంచి బుధవారం క్షేమంగా ఇంటికి చేరారు. వీరు కొన్నిరోజులుగా రాజేంద్రనగర్ అగ్రికల్చర్ వర్సిటీలోని టీఎస్ ఐపార్డ్ ఐసొలేషన్ కేంద్రంతోపాటు ఆయా జిల్లాకేంద్రాల్లోని దవాఖానల్లో చికిత్సలు పొందారు. అందరికీ నెగెటివ్ అని తేలింది. దీంతో రంగారెడ్డి జిల్లా అధికారులు.. ఐదు ఆర్టీసీ బస్సుల్లో వర్సిటీ కేంద్రంలోనవారిని ఇండ్లకు పంపారు. కొంతకాలం వరకు స్వీయ గృహనిర్బంధంలో ఉండాలని ఆదేశించి.. వారి చేతిపై ప్రత్యేక ముద్రలు వేశారు. ఇండ్లలోనే ఉండేలా సెల్ఫ్ డిక్లరేషన్‌పై సంతకాలు తీసుకున్నారు.

## డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యలో ఆన్‌లైన్ పాఠాలు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భవిష్యత్‌లో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలతోపాటు ప్రైవేట్ కళాశాలల్లో కూడా ఆన్‌లైన్ పాఠాలు బోధన విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు. ఇప్పటికే డిజిటల్ కాంటెంట్ సిద్ధంగా ఉన్నదని చెప్పారు. అంతర్జాతీయస్థాయిలోని కోర్స్‌ఎరా కూడా ఉచితంగా డిజిటల్ పాఠాలు అందించడానికి ముందుకొచ్చిందని తెలిపారు. బుధవారం డిగ్రీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్లు, రెండుశాఖ అధికారులతో కమిషనర్ వెబ్‌నార్ (జూమ్) యాప్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## కరోనా నియంత్రణకు ఆయుర్వేద ఔషధాలు

- సిబ్బందికి ఇచ్చిన టీటీడీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ కట్టడి కోసం తిరుమల, తిరుపతి దేవస్థానం ఆయుర్వేద మందుల తయారీ చేపట్టింది. ఎస్వీ ఆయుర్వేద కళాశాల, ఎస్వీ ఆయుర్వేద దవాఖాన, ఆయుర్వేద ఫార్మసీ సంయుక్తంగా తయారుచేసిన ఐదు రకాల మందులను టీటీడీ జేఈవో బసంత్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. తొలుత ఈ మందులను టీటీడీ అన్నప్రసాదం సిబ్బందికి అందజేశారు. కరోనా నివారణకు ఉపయోగపడే రక్షజ్ఞ ధూపం, పవిత్ర, గండూషము, నింబనస్యం, అమత మాత్రలను విడుతలవారీగా పంపిణీ చేయనున్నట్టు టీటీడీ ప్రకటించింది.

## లాక్‌డౌన్ పొడిగింపు మంచిదే!

- తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నియంత్రణకు సీఎం కేసీఆర్ తీసుకొంటున్న నిర్ణయాలకు అందరం కట్టుబడి ఉండాలని, లాక్‌డౌన్ పొడిగించాలని సీఎం భావించడం మంచి నిర్ణయమని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత అన్నారు. పెరుగుతున్న కరోనా పాజిటివ్ కేసులు తగ్గుముఖం పట్టాలంటే లాక్‌డౌన్ పొడిగించడం అనివార్యమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లాక్‌డౌన్‌లో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు.

## సరిగ్గా వినకుండానే విమర్శలా!

- దీపాలు వెలిగించడంపై సీపీఐ నేత నారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వీడియోలో ఇచ్చిన వివరణను సరిగ్గా వినకుండా, అర్థం చేసుకోకుండా తనపై కొందరు విమర్శలు చేస్తుండటంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విచారం వ్యక్తంచేశారు. దేశ ఐక్యతను చాటడానికే ఈ నెల 5న లైట్లు ఆర్పివేసి దీపాలు వెలిగించామని తెలిపారు. సైన్స్‌తోనే కరోనాపై పోరాడాలని, ఇందుకు ప్రభుత్వాలు వైద్యారోగ్యశాఖను బలోపేతంచేయాలని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆన్‌లైన్‌లో టీ కన్సల్ట్ వైద్యం

- టీటా ఆధ్వర్యంలో టెలిమెడిసిన్
- మక్తల్‌లో ప్రారంభించిన చినజీయర్ స్వామి
- దేశంలోనే మొదటి మండలంగా గుర్తింపు



*బుధవారం టీటా ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో సమగ్ర టెలిమెడిసిన్ సేవలు ప్రారంభిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి*

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశం లో తొలిసారిగా ఒక మండలం మొత్తానికి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ వైద్యసేవలు అం దుబాటులోకి తీసుకొచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో సమగ్ర టెలిమెడిసిన్ సేవలు 'టీ కన్సల్ట్' పేరుతో అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను త్రిదండి చినజీయర్ స్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'టీ కన్సల్ట్' ద్వారా అందించే ఆన్‌లైన్ వైద్యసేవలతో గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర మార్పులు రానున్నాయన్నారు. హోమియోకు సంబంధించి జీయర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జిమ్స్) బృందాన్ని ఆన్‌లైన్ సేవల్లో అందుబాటులోకి తెస్తామని హామీఇచ్చారు. కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాకు చెందిన ఏడునెలల గర్భిణి గైనకాలజిస్ట్ సహాయం లేకపోవడంతో కన్నుమూశారని, వైద్యసేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటం వల్ల ముప్పు తప్పే అవకాశం ఉంటుందన్నారు. టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టులో వైద్యులను భాగస్వామ్యం చేయడంలో కలెక్టర్ కృషి అభినందనీయమన్నారు. సాంకేతిక సహకారం అందించిన అమెరికాకు చెందిన క్లినికల్స్ సంస్థ యజమాని రాజ్, కెన్నత్, టీటా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని 39 గ్రామపంచాయతీలు ఆన్‌లైన్ ద్వారా వైద్యసేవలు పొందనున్నాయి. పంచాయతీ నోడల్ ఆఫీస్‌గా, పంచాయతీ సెక్రటరీ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటికే నోడల్ ఆఫీసర్లకు శిక్షణ పూర్తయింది.

**టెలిమెడిసిన్ సేవలు ఇలా..**

ఆన్‌లైన్ విధానం ద్వారా స్పెషలైజ్డ్ డాక్టర్ తమ అందుబాటు సమయం పేర్కొంటారు. ప్రజల అపాయింట్‌మెంట్ పొందుతారు. సంబంధిత డాక్టర్, గ్రామస్థుడు ఆన్‌లైన్ ద్వారా కన్సల్ట్ అవుతారు. వీరిద్దరి మధ్య జరిగిన టెలిమెడిసిన్ ప్రక్రియ అనంతరం ప్రిస్క్రిప్షన్ సైతం ఆన్‌లైన్‌లో చేరుతుంది. గ్రామపంచాయతీ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్ ఈ వీడియో కనెక్ట్ ప్రక్రియను సమన్వయం చేస్తారు. లాక్‌డౌన్‌లో మెరుగైన వైద్యసేవలు ఈ ప్రాజెక్టు ద్వారా అందనున్నాయి.

**వరంగల్ అర్బన్ జిల్లాలో ప్రారంభం**

వరంగల్ అర్బన్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో టెలిమెడిసిన్ కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లలితాదేవి బుధవారం ప్రారంభించారు. క్వారంటైన్‌లో ఉన్నవారికి, ఇతరులకు ప్రాథమిక చికిత్స కోసం కలెక్టర్ ఆదేశాలమేరకు 79939 69104, 79951 18405 నంబర్లతోపాటు వాట్సాప్ వీడియో కోసం 93924 69344 నంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలవరకు సేవలు అందుబాటులో ఉంటాయి.

# 14న ఎత్తేయలేం

- లాక్‌డౌన్‌పై మోదీ స్పష్టీకరణ
- దేశంలో సోషల్ ఎమర్జెన్సీ
- విపక్షాలతో భేటీలో ప్రధాని
- ఎల్లుండి సీఎంలతో కాన్ఫరెన్స్


విపక్షనేతలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: కరోనా నియంత్రణకు విధించిన దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ఈ నెల 14 తర్వాత ఒకేసారి ఎత్తివేయబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంచేశారు. పార్లమెంట్‌లోని విపక్షాల ఫ్లోర్ లీడర్లు, ఇతర పార్టీల ముఖ్య నాయకులతో ప్రధాని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. కరోనా అనంతర పరిస్థితులు, వైరస్ వ్యాప్తిని అదుపుచేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వారితో చర్చించారు. లాక్‌డౌన్‌ను ఒకేసారి ఎత్తివేయబోమని ప్రధాని ఈ సందర్భంగా స్పష్టంచేసినట్లు బిజు జనతాదళ్ (బీజేడీ) నేత పినాకి శర్మ తెలిపారు. అలాగే కరోనాకు ముందు, కరోనాకు తర్వాత జీవితం ఒకేలా ఉండదని మోదీ వ్యాఖ్యానించినట్లు చెప్పారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. లాక్‌డౌన్ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కేంద్ర వైద్య శాఖ, హోంశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శులు నేతలకు వివరించినట్లు తెలిసింది. కాగా, లాక్‌డౌన్, ఇతర ముఖ్య అంశాలపై చర్చించేందుకు ప్రధాని శనివారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో వైద్య సిబ్బందికి వ్యక్తిగత పరిరక్షణ సామగ్రి (పీపీఈ) కొరత ఉండడాన్ని కొందరు నేతలు లేవనెత్తినట్లు సమాచారం. అలాగే నూతన పార్లమెంట్ భవన నిర్మాణాన్ని ఆపాలని పలువురు నేతలు సూచించినట్లు తెలిపింది. దేశంలో కరోనా కేసులు తగ్గుతున్న సంకేతాలేమీ కనబడని నేపథ్యంలో లాక్‌డౌన్ పొడిగింపునకే రాష్ట్రాలు మొగ్గుచూపుతున్న తరుణంలో ప్రధాని ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

### సోషల్ ఎమర్జెన్సీ

దేశంలో 'సోషల్ ఎమర్జెన్సీ' తరహా పరిస్థితులు నెలకొన్నాయని, ఈ నేపథ్యంలో కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని నేతలతో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర, జిల్లా యంత్రాంగాలు, నిపుణులు లాక్‌డౌన్ పొడిగించాలని సూచించారని తెలిపారు.

**లాక్‌డౌన్ పొడిగించొచ్చు!**

కరోనా కట్టడి కోసం దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 14 తర్వాత కూడా కొనసాగించవచ్చని ప్రతిపక్ష కాంగ్రెస్ అభిప్రాయపడింది. వివిధ పార్టీలకు చెందిన దాదాపు 80 శాతం నేతలు లాక్‌డౌన్ కొనసాగింపునకు సుముఖంగా ఉన్నారని ఆ పార్టీ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ వెల్లడించారు

# పొడిగింపే మార్గం

- కరోనా కట్టడికి సీఎం కేసీఆర్ నిరంతర కృషి
- ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్‌లో టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేకే



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో కరోనా వ్యాప్తిని సమర్థంగా నియంత్రించేందుకు లాక్‌డౌన్ పొడిగింపు ఒక్కటే మార్గమమని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ స్పష్టంచేసింది. కష్టనష్టాలున్నా లాక్‌డౌన్‌ను కొనసాగించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తిచేసింది. పార్లమెంటులోని అన్ని రాజకీయపక్షాల నాయకులతో ప్రధాని మోదీ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. హైదరాబాద్ నుంచి టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కే కేశవరావు, టీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ.. కరోనా వ్యాప్తి నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా చేస్తున్న ప్రయత్నాలు ఎంతో బాగున్నాయని, తెలంగాణ సీఎం కేసీఆర్ 24 గంటలపాటు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో లాక్‌డౌన్‌ను కొనసాగించడమే ఉత్తమమార్గమమని సూచించారు.

**400 కోట్లకుగాను కోటి ఆదాయం**

లాక్‌డౌన్ వల్ల తెలంగాణలో రాబడులు పడిపోయాయని కేకే అన్నారు. 'రోజుకు రూ.400కోట్లకుపైగా రాబడి రావాల్సి ఉండగా, అత్యంత కష్టంగా రూ.కోటి ఆదాయమే సమకూరుతున్నది' అని తెలిపారు. ఇబ్బందులున్నా పేద కుటుంబాల్లోని ప్రతి ఒక్కరికి 12 కిలోల బియ్యం, ప్రతి కుటుంబానికి రూ.1500 నగదు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలకు రావాల్సిన నిధులను అందించాలని, పాత బకాయిలు చెల్లించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

# పేదరికంలోకి భారత్!



**కరోనాతో 40 కోట్ల మంది ఉపాధిపై దెబ్బ**

**ప్రపంచ కార్మిక సమాఖ్య హెచ్చరిక**

ఐక్యరాజ్యసమితి: కరోనా విశ్వమారి ప్రభావంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని ప్రపంచ కార్మిక సమాఖ్య (ఐఎల్వో) హెచ్చరించింది. దేశంలోని అసంఘటితరంగ కార్మికుల్లో దాదాపు 90 శాతం మంది ఉపాధి కోల్పోతారన్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 19.5 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది.

**200 కోట్ల మంది..**

ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులున్నారు. ఇందులో ఎక్కువమంది అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉన్నారు. కరోనాతో వీరంతా ఉపాధి కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. భారత్‌తోపాటు బ్రెజిల్, నైజీరియా వంటి దేశాల్లో లాక్‌డౌన్‌తో అసంఘటిత రంగం తీవ్రంగా దెబ్బతిన్నది.

**40 కోట్లు** దేశంలోని అసంఘటితరంగ కార్మికులు

**36 కోట్లు** ఉపాధి కోల్పోనున్న కార్మికుల సంఖ్య 90%

**330 కోట్లు** ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికుల సంఖ్య

**220 కోట్లు** లాక్‌డౌన్‌తో ప్రభావితమైనవాకం 81%

**19.5 కోట్లు** ప్రపంచవ్యాప్తంగా ఊడిపోనున్న ఉద్యోగాలు

ఇందులో..

**12.5 కోట్లు** ఆసియా, పసిఫిక్ దేశాల్లో..

**1.2 కోట్లు** ఐరోపాలో

**50 లక్షలు** అరబ్ దేశాల్లో

**తీవ్రంగా ప్రభావితమయ్యే రంగాలు**

ఆతిథ్యరంగం, ఆహారం, తయారీ, రిటైల్, వ్యాపారాలు, అడ్మినిస్ట్రేటివ్ కార్యకలాపాలు. ఫలితంగా 125 కోట్ల మంది ఉద్యోగం కోల్పోవడమో లేదా జీతాలు తగ్గడం, పని గంటలు తగ్గించడం వంటివి జరుగొచ్చు.

**గట్టెక్కడానికి నాలుగు సూత్రాలు**

1.వ్యాపార, వాణిజ్య సంస్థలకు ప్రభుత్వాలు మద్దతుగా నిలువడం, 2.ఆర్థిక వ్యవస్థను, ఉద్యోగాలను స్థిరీకరించడం. 3. కార్మికులను, సంస్థలను కాపాడుకోవడం. 4.ప్రభుత్వం, కార్మికులు, ఉద్యోగుల మధ్య చర్చలు జరిపి, పరిష్కారాలు కనుగొనడం.

స్మాల్ ఆర్మ్స్ సర్వే ప్రకారం....................

అమెరికాలో పౌరుల వద్ద ఉన్న తుపాకులు **40 కోట్లు**

**46%** ప్రపంచంలోని మొత్తం తుపాకుల సంఖ్యలో ఇది

**1.3** సగటున ఒక్కో అమెరికన్ పౌరుడి వద్ద ఉన్న తుపాకులు

అమెరికా జనాభాలో 30 శాతం మంది వద్ద మాత్రమే తుపాకులు ఉన్నాయి. ఈ లెక్కన 10 కోట్ల మంది వద్ద 40 కోట్ల తుపాకులున్నట్టు.

అమెరికాలో తుపాకీ కనీస ప్రారంభ ధర 200 డాలర్లు

గన్ రిజిస్ట్రేషన్, లైసెన్స్ వంటి ఫీజులు.. 800-900 డాలర్లు



తుపాకుల కోసం కాలిఫోర్నియాలో ఒక దుకాణం ముందు బారులు

అమెరికా సైన్యం దగ్గర ఉన్న తుపాకుల కన్నా.. పౌరుల దగ్గర వందరెట్లు ఎక్కువ ఉన్నాయి.



రష్యా, చైనా, భారత్, అమెరికా, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, ఉక్రెయిన్, వియత్నాం, ఇరాన్, పాకిస్థాన్ సైన్యాల వద్ద ఉన్న మొత్తం తుపాకులకన్నా మూడు రెట్లు ఎక్కువగా అమెరికా పౌరుల వద్ద ఉన్నాయి.

కరోనా విలయతాండవంతో ఆత్మరక్షణలో అమెరికన్లు

ఒక్క మార్చి నెలలోనే 20 లక్షల తుపాకుల కొనుగోలు

ఇప్పటికే ప్రతి వంద మందికి 120.5 తుపాకులు

# అమెరిగన్స్!

'ఆ లిబర్టీ శిల్ప శిలలలో స్వేచ్ఛా జ్యోతులు... ఆకసాన సాగిపోయే అంతరిక్షాలు... కృషి-ఖుషీ సంగమించే చోట...' అంటూ అమెరికాను సృష్టికే ప్రతి సృష్టిగా అభివర్ణించాడు.. సినీ గేయ రచయిత ఆత్రేయ. నిజమే.. ఇతర దేశాల్లోని అందునా అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాల్లోని సగటు జీవికి అగ్రరాజ్యమంటే ఓ స్వర్గధామం. మరి అలాంటి 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' తలరాత ఇప్పుడు తారుమారైంది. రేపు అనేది ఎలా ఉండబోతుందోనన్న ఆందోళన ఆ దేశ పౌరుల్ని పట్టి పీడిస్తున్నది. అందుకే మనుగడ కోసం పోరాటం.. అంటూ లక్షలాది మంది పౌరులు రికార్డు స్థాయిలో తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. ఒక్క మార్చి నెలలోనే దాదాపు 20 లక్షల తుపాకుల విక్రయం జరిగింది.



పౌరులు వద్ద అత్యధిక తుపాకులున్న దేశాలు
(ప్రతి వందమందికి ఉండే తుపాకుల సంఖ్య)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) లెక్కల ప్రకారం.. గత మార్చి నెలలో అమెరికన్లు ఏకంగా 20 లక్షల తుపాకులను కొనుగోలు చేయడం ఆ దేశ యంత్రాంగాన్ని కలవరపరుస్తున్నది. 2013 జనవరిలో బరాక్ ఒబామా రెండోసారి అధ్యక్షుడయ్యాక, శాండీహుక్ మారణహోమం తర్వాత ఆ స్థాయిలో తుపాకుల కొనుగోళ్లు జరుగుడం ఇదే తొలిసారి. కరోనా మరణాలు అధికమవుతున్న నేపథ్యంలో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనడంతో స్వీయ రక్షణ కోసం ప్రజలు తుపాకుల కోసం ఎగబడుతున్నారు. దీంతో దేశవ్యాప్తంగా తుపాకుల దుకాణాల ముందు భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి.

**తనిఖీలు ముమ్మరం..**

తుపాకీ కొనుగోళ్లు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఎఫ్‌బీఐ తనిఖీలను (బ్యాక్‌గ్రౌండ్ చెక్) ముమ్మరం చేసింది. ఒక్క మార్చి నెలలోనే 37 లక్షల తనిఖీలు నిర్వహించింది. 1998లో తనిఖీల ప్రక్రియ మొదలైన తర్వాత ఈ స్థాయిలో తనిఖీలు నిర్వహించడం ఇదే తొలిసారి. అలాగే గతేడాది మార్చితో పోలిస్తే ఇది 11 లక్షలు ఎక్కువ. ఒక్క మార్చి 21వ తేదీనే 2.10 లక్షల తనిఖీలు నిర్వహించడం కూడా రికార్డే. 2015లో కాలిఫోర్నియాలోని శాన్ బెర్నార్డియోలో జరిగిన సామూహిక కాల్పుల నేపథ్యంలో ఒబామా ప్రభుత్వం ఆ ఏడాది డిసెంబరులో తుపాకులపై ఆంక్షలు పెట్టాలని యోచించింది. ఈ నేపథ్యంలో అప్పుడు భారీఎత్తున ఒక్క డిసెంబరు నెలలోనే 3.3 మిలియన్ల (33 లక్షలు) మేర తనిఖీలు నిర్వహించారు. ఆ తర్వాత దాని కంటే అధిక స్థాయిలో తాజాగా మార్చిలో తనిఖీలు నిర్వహించారంటే తుపాకుల కొనుగోళ్లు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

**ఇది సామాజిక రుగ్మత..**

పౌరులు ఇలా ఎగబడి తుపాకులు కొనుగోలు చేయడం కేవలం భయం మాత్రమే కాదు... సామాజిక రుగ్మతగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. రెండు అంశాల ఆధారంగా తుపాకుల కొనుగోళ్లు పెరిగాయని యూఎస్ గన్ ఇండస్ట్రీ నిపుణుడు, జార్జియా స్టేట్ యూనివర్సిటీ లా స్కూల్ ప్రొఫెసర్ టిమోతీ లిట్టన్ విశ్లేషిస్తున్నారు. 'ప్రస్తుత కరోనా దరిమిలా శాంతిభద్రతలు అదుపు తప్పుతాయి. దీంతో సొంతంగా మనుగడ సాధించేందుకు తుపాకీ ఒక్కటే అవసరపడుతుందనే భావనగా ఉండొచ్చు. రెండోది.. అమెరికా ప్రభుత్వం అమెరికన్ల స్వేచ్ఛను హరించే సమయంలో తుపాకీ ఒక్కటే శరణ్యం' అని భావిస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. పైగా అమెరికా రాజ్యాంగంలోనూ ఈ మేరకు వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి నిరోధించడంలో భాగంగా ప్రభుత్వం ఆంక్షల పేరిట నిరంకుశంగా వ్యవహరించే అవకాశమున్నందున చాలామంది తుపాకుల వైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు, తుపాకీ ఇండస్ట్రీ లాబీయింగ్ నేపథ్యంలో ఫార్మసీ, గ్యాస్, గ్రాసరీలతోపాటు తుపాకీ స్టోర్లను కూడా అత్యవసర వాణిజ్యం కింద ప్రభుత్వం ప్రకటించింది.

## అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు



న్యూఢిల్లీ: లాక్‌డౌన్ నేపథ్యంలో నిత్యావసరాలను ఎక్కువ ధరకు అమ్మడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. కొందరు లాక్‌డౌన్‌ను ఆసరాగా చేసుకొని నిత్యావసరాల కృత్రిమ కొరత సృష్టించడానికి ప్రయత్నించినా, ఎక్కువ ధరలకు అమ్మినా అస్సలు ఉపేక్షించవద్దని సూచించింది. వెంటనే 'అత్యవసర సరుకుల చట్టం-1955'ను ప్రయోగించి ప్రజలకు సరసమైనధరల్లో సరుకులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరింది. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే అలాంటి వారికి ఏడేండ్లు జైలుశిక్ష లేదా జరిమానా విధించే అవకాశముందని వ్యాపారులను కేంద్రం హెచ్చరించింది.

## నేరుగా కొనేందుకు అనుమతించండి

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలకు నిత్యావసరాల కొరత రాకుండా హోల్‌సేల్ వ్యాపారులు, బడా రిటైల్ సంస్థలకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. వచ్చే మూడు నెలల పాటు వారు నేరుగా రైతులు, కో-ఆపరేటివ్ సంఘాలు, రైతు సంఘాలు, మండీల వద్ద నేరుగా ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నది. ఈ-నామ్ ద్వారా సేకరించే ఉత్పత్తులను నిల్వ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు గోదాములను గుర్తించాలని సూచించింది. పంట సీజన్ మొదలైనందున రైతులను దృష్టిలో పెట్టుకొని ఈ చర్యలను తక్షణం చేపట్టాలని సూచించారు. తద్వారా వారు ఉత్పత్తులను సులభంగా అమ్ముకోగలుగుతారని చెప్పారు.

### లాక్‌డౌన్ తప్పనిసరి



'నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం ఇంటి నుంచి బయటకు వచ్చే ప్రజలు ముఖానికి మాస్కును తప్పనిసరిగా ధరించాలి. కరోనాపై జరిగే పోరులో రక్షణశాఖ ఆరోగ్య సేవల మాజీ ఉద్యోగులు, రిటైర్డ్ నర్సులు, రిటైర్డ్ వార్డ్‌బాయ్‌లు భాగస్వాములు కావాలని అభ్యర్థిస్తున్నా. లాక్‌డౌన్ మినహా మరో మార్గం లేదు'

– వెబ్‌కాస్ట్ ద్వారా మహారాష్ట్ర ప్రజలతో ఆ రాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే

## ఉచితంగా కరోనా పరీక్షలు

న్యూఢిల్లీ: దేశంలోని అన్ని గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ ల్యాబ్‌లు, ఏజెన్సీల్లో కరోనా నిర్ధారణ పరీక్షలు ఉచితంగా జరుపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం వెంటనే మార్గదర్శకాలు జారీ చేయాలని స్పష్టం చేసింది. దేశ ప్రజలందరికీ ఉచిత కరోనా నిర్ధారణ జరీక్షలు నిర్వహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలంటూ న్యాయవాది శశాంక్ దేవ్ సోదీ పిటిషన్ దాఖలు చేశారు. ప్రైవేట్ ల్యాబ్‌లలో కరోనా నిర్ధారణ పరీక్షలకు రూ.4,900 వసూలు చేస్తున్నారని తెలిపారు. దీంతో పేదలు పరీక్షలకు దూరంగా ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్‌లు అశోక్ భూషణ్, ఎస్ రవీంద్రభట్‌తో కూడిన ధర్మాసనం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. ఎన్ఏబీఎల్, ఐసీఎంఆర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు పొందిన అన్ని ల్యాబ్‌లు, ఏజెన్సీల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## ర్యాపిడ్ టెస్ట్ కిట్ల తయారీలో మై ల్యాబ్

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: కరోనా నిర్ధారణ పరీక్షలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు ఐసీఎంఆర్ సూచించింది. ఈ పరీక్షల కోసం 20 లక్షల ర్యాపిడ్ టెస్ట్ కిట్‌లను సిద్ధం చేసుకోవాలని కోరింది. ఈ నేపథ్యంలో కిట్ల తయారీ బాధ్యతను పుణె కేంద్రంగా ఉన్న 'మై ల్యాబ్ బయోటెక్నాలజీ కంపెనీ'కి అధికారులు అప్పగించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.4,500 వరకు ఉన్న ఈ కిట్‌ను రూ.1200కే అందించేలా మై ల్యాబ్ చర్యలు తీసుకుంటున్నది.

# కరోనా కట్టడికి..


ఘజియాబాద్‌లో పాలదుకాణం ముందు బారులు

- **ఉత్తరప్రదేశ్:** రాష్ట్రంలో కరోనా కేసులు ఎక్కువగా నమోదైన 15 జిల్లాలోని హాట్‌స్పాట్లను ఈ నెల 15వ తేదీ వరకు పూర్తిగా మూసివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. నిత్యావసరాలను డోర్ డెలివరీ చేయనున్నట్టు తెలిపింది.
- **మధ్యప్రదేశ్:** ప్రజలకు ఆహార పొట్లాల కోసం రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే సిద్ధార్థ్ కుశ్వాహా 200 మందితో నిరసన ర్యాలీ చేపట్టారు. లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయనపై కేసు నమోదైంది.
- **ఢిల్లీ:** ఎయిమ్స్ దవాఖానను సందర్శించిన ఓ వ్యక్తికి కరోనా ఉన్నట్లు తేలడంతో 30మంది వైద్యులు, నర్సులను క్వారంటైన్‌కు వెళ్లాలని అధికారులు సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే వారు మాస్కులు ధరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.
- **మహారాష్ట్ర:** ముంబైలోని ఓ మున్సిపల్ దవాఖానలో కరోనా రోగి మరణించిందని, ఆమెతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న తమను క్వారంటైన్‌కు తరలించాలంటూ ఉద్యోగులు ధర్నా చేశారు.
- **పశ్చిమబెంగాల్:** రాష్ట్రంలో ఏడు కరోనా హాట్‌స్పాట్లను గుర్తించామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ చెప్పారు.
- **తమిళనాడు:** రూ.25,000లోపులోనే తాము ఒక వెంటిలేటర్ నమూనాను అభివృద్ధి చేశామని తమిళనాడుకు చెందిన విద్యార్థులు చెప్పారు.
- **కర్ణాటక:** రాష్ట్రంలోని ఎమ్మెల్యేల జీతాల్లో 30 శాతం కోత విధించనున్నట్లు సీఎం యెడియూరప్ప చెప్పారు. ఈ నెల 14న లాక్‌డౌన్ పూర్తయిన తర్వాత రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు అనుమతించాలని యోచిస్తున్నట్లు తెలిపారు.

## దేశంలో 5,689 కేసులు

*న్యూఢిల్లీ:* మహారాష్ట్రలో కరోనా కేసుల సంఖ్య వెయ్యి దాటింది. బుధవారం నాటికి రాష్ట్రంలో 1,018 కేసులు నమోదయ్యాయి. మరోవైపు దేశవ్యాప్తంగా 485 మందికి కరోనా వైరస్ పాజిటివ్ అని తేలింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 5,274కు, మృతుల సంఖ్య 149కి పెరిగింది. ఇప్పటివరకు 410 మంది కోలుకున్నారు. కరోనా వైరస్‌పై పోరుకు రాష్ట్రాలు దవాఖానల నిర్మాణంపై దృష్టి సారించాలని కేంద్రం సూచించింది. ఇప్పటి వరకు 1,21,271 మందికి వైద్య పరీక్షలు జరిపినట్లు ఐసీఎంఆర్ వెల్లడించింది. పీటీఐ వార్తాసంస్థ సేకరించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 5,689 కేసులు నమోదయ్యాయి. 181 మంది మరణించగా, 506 మంది వరకు కోలుకున్నారు.

## ముంబైలో సామాజిక వ్యాప్తి దశ

*ముంబై:* మహారాష్ట్ర రాజధాని ముంబైలో కరోనా వైరస్ సామాజిక వ్యాప్తి దశలోకి ప్రవేశించిందని బృహన్ ముంబై నగర పాలక సంస్థ (బీఎంసీ) బుధవారం ప్రకటించింది. నగర పరిధిలో బుధవారం నమోదైన కరోనా పాజిటివ్ కేసుల్లో ఎవరికీ విదేశీ ప్రయాణ చరిత్ర లేదని, కరోనా రోగులతో వారికి సంబంధాలు కూడా లేవని.. అయినప్పటికీ వారిలో కరోనా పాజిటివ్ వచ్చిందని ఓ బీఎంసీ అధికారి తెలిపారు. బీఎంసీ పరిధిలో బుధవారం కొత్తగా 44 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కేసులు పెరుగుతుండటంతో ఫేస్‌మాస్క్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ బీఎంసీ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఆసియా ఖండంలోనే అతిపెద్ద మురికివాడ- ముంబైలోని ధారావిలో బుధవారం ఇద్దరు కరోనా రోగులు మరణించారు.

### కరోనా క్లాక్

8-4-2020

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 14.91 లక్షలు |
| కోలుకున్నవారు | 3,19,030 |
| మరణాలు | 87,435 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 4,18,410 | 14,240 |
| స్పెయిన్ | 1,46,690 | 14,673 |
| ఇటలీ | 1,39,422 | 17,669 |
| ఫ్రాన్స్ | 1,12,950 | 10,869 |
| జర్మనీ | 1,10,483 | 2,183 |
| చైనా | 81,802 | 3,333 |
| ఇరాన్ | 64,586 | 3,993 |
| యూకే | 60,733 | 7,092 |
| టర్కీ | 38,226 | 812 |
| బెల్జియం | 23,403 | 2,240 |

| | |
|---|---|
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 5,689 |
| కోలుకున్నవారు | 506 |
| మరణాలు | 181 |

**దేశంలో కరోనా కేసులు**

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 1,135 | తమిళనాడు 738 | ఢిల్లీ 669 |
| తెలంగాణ 453 | మధ్యప్రదేశ్ 385 | రాజస్థాన్ 383 |
| ఉత్తరప్రదేశ్ 361 | ఏపీ 348 | కేరళ 345 |
| గుజరాత్ 186 | కర్ణాటక 181 | కశ్మీర్ 158 |
| హర్యానా 153 | పంజాబ్ 106 | ప. బెంగాల్ 99 |



### 15 నిమిషాల్లోపే అంత్యక్రియలు

*మాడ్రిడ్:* 'పాడెపై శవాన్ని తీసుకొస్తారు. ఆ వెంటనే పవిత్ర జలంతో ఆశీర్వదిస్తాను. మృతదేహాన్ని శ్మశాన వాటికలోకి పంపుతారు. ఇదంతా 15 నిమిషాల్లో పూర్తవుతుంది' అంటూ స్పెయిన్ లోని ఓ చర్చి ఫాదర్ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనాతో రోజూ వందల మంది చనిపోతుండటంతో 15 నిమిషాల్లోనే అంత్యక్రియల్ని పూర్తి చేయాలని అక్కడి ప్రభుత్వం ఆదేశించింది.

### నా కోసం చప్పట్లు కొట్టొద్దు!

*న్యూఢిల్లీ:* దేశ ప్రజల కోసం ప్రధాని మోదీ చేస్తున్న కృషికి గుర్తుగా ఈ ఆదివారం ఐదు నిమిషాల పాటు ఆయనకు గౌరవ సూచకంగా నిలబడి చప్పట్లు కొట్టాలని పేర్కొంటూ ఆన్‌లైన్‌లో జరుగుతున్న ప్రచారంపై మోదీ స్పందించారు. ఇలాంటి చర్యలు తనను వివాదాల్లోకి తీసుకువెళ్తాయని, వీటికి తాను సమ్మతించబోనని అన్నారు. కరోనా గురించి కీలక సమాచారాన్ని అందించే 'ఆరోగ్య సేతు' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



### ఏపీలోనే 'ర్యాపిడ్ టెస్టింగ్ కిట్ల' తయారీ

*హైదరాబాద్, నమస్తే తెలంగాణ:* కరోనా పరీక్షల కోసం 'ర్యాపిడ్ టెస్టింగ్ కిట్ల'ను రాష్ట్రంలోనే తయారు చేసినట్లు ఏపీ సీఎం జగన్ తెలిపారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో విశాఖ మెడిటెక్ జోన్‌లో ఈ కిట్లను తయారు చేస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో వెయ్యి కిట్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కిట్ల ద్వారా 55 నిమిషాల్లోనే పరీక్ష ఫలితాన్ని తెలుసుకోవచ్చని, ఒక్క కిట్‌తో 20 టెస్టులు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

### ఏ వర్గాన్నీ నిందించవద్దు: కేంద్రం

*న్యూఢిల్లీ:* కరోనా వ్యాప్తికి ఫలానా వర్గం లేదా ప్రాంతం కారణమంటూ ఎవరినీ ఎవరూ నిందించకూడదని కేంద్రం స్పష్టం చేసింది. వైద్య, పారిశుద్ధ్య సిబ్బందిపై దాడులకు పాల్పడవద్దని హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

**మన యాది - 1939**

ప్రముఖ ఛాయాచిత్ర కళాకారుడు బండి రాజన్‌బాబు జయంతి. కరీంనగర్ జిల్లా కోరుట్లలో జన్మించిన ఈయన 'అసోసియేట్ ఆఫ్ ది రాయల్ కాలేజ్ ఆఫ్ ఫొటోగ్రఫీ' లండన్ వారి గౌరవాన్ని పొందిన తొలి వ్యక్తి.

# వేదిక

తమకు తాము కాపాడుకోలేని ఆఫ్రికావాసులపై కరోనా ప్రయోగాలను నిర్వహించాలని ఫ్రెంచి వైద్యులు పేర్కొనడం వారి వలసవాద మనస్తత్వాన్ని సూచిస్తున్నది. సౌహార్ద్రత చూపాల్సిన సమయంలో ఇటువంటి వ్యాఖ్యలు ఉపయోగపడవు.

– టెడ్రాస్ అధానామ్ ఘెబ్రెయెసస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్



**నమస్తే తెలంగాణ**

## వుహాన్ విజయం

**మృత్యువు** కోరల్లో చిక్కి విలవిలలాడిన వుహాన్ నగరం 76 రోజుల లాక్‌డౌన్ తరువాత మళ్లీ స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నది! కొద్ది రోజులుగా దశలవారిగా నిర్బంధాన్ని సడలిస్తూ వచ్చిన ప్రభుత్వం కొత్త కేసులేవీ లేకపోవడంతో లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తున్నట్టు బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సుదీర్ఘ లాక్‌డౌన్ కాలంలో వుహాన్ సమాజం ఎన్నో కష్టనష్టాలకోర్చి నిబ్బరంగా నిలిచింది. సుమారు 50 వేల మంది వ్యాధిగ్రస్తులు కాగా, రెండున్నవేల మందికి పైగా మృత్యువాత పడ్డారు. లాక్‌డౌన్ మధ్యలో, మార్చి పదవ తేదీ నాడు దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ వుహాన్ వచ్చి ప్రజల ధీరత్వాన్ని ప్రశంసించి మనోబలాన్ని ఇవ్వవలసి వచ్చింది. వుహాన్ నుంచి వ్యాపించిన వైరస్ ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా దాదాపు కోటిన్నర మందికి సోకింది. దాదాపు ఎనభై వేల మంది ప్రాణాలను హరించింది. ఈ విషాదఘట్టంలో వైరస్‌పై వుహాన్ సమాజం సాధించిన విజయాన్ని కీర్తించడం సబబుగా తోచకపోవచ్చు. కానీ వుహాన్ గెలుపు, వైరస్‌పై మనం సాగిస్తున్న పోరాటానికి స్ఫూర్తినిస్తుంది. ఈ వైరస్‌ను జయించడం సాధ్యమేననే ధైర్యాన్ని కలిగిస్తున్నది.

కరోనా వైరస్ పుట్టుకకు, వ్యాప్తికి కారకులెవరనేది తరువాత తేల్చుకోవచ్చు. దేశాల మధ్య విభేదాలకు సమయం కాదిది. ఇప్పుడు కరోనా వైరస్ కట్టడికి చైనా అనుసరించిన మార్గాలేమిటి అనేది తెలుసుకోవడమే ప్రధానం. వుహాన్‌లో ఆ తరువాత హుబెయి రాష్ట్రంలోని ఇతర నగరాల్లో లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆర్థిక, సామాజిక కోణాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కోటీ పది లక్షల జనాభా గల వుహాన్ నగరం రవాణా మార్గాలకు కూడలిగా, చైనా దేశపు షికాగో నగరంగా ప్రసిద్ధికెక్కింది. అక్కడ విధించిన లాక్‌డౌన్ ఆర్థికంగా నగరానికే కాదు, దేశానికీ ఇబ్బందికరం. అయినా రోజుకు వేలాది మందిని వైరస్ కమ్ముకుంటున్న తరుణంలో చైనా ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకోక తప్పలేదు. ఇప్పుడు కరోనా కట్టడికి లాక్‌డౌనే తగిన విధానమని ధ్రువపడ్డది. ఈ ప్రయోగాన్నే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు అనుసరిస్తున్నాయి.

వుహాన్ నగరం మృత్యువు కోరల్లో చిక్కిన నాటితో పోలిస్తే మనం చాలా అదృష్టవంతులమనే భావించవచ్చు. ఆనాడు ఆ వ్యాధి ఏమిటో, కారకమేమిటో, చికిత్స ఏ విధంగానో తెలియని అయోమయం. ఇప్పటికల్లా మనం వివిధ దేశాల అనుభవాలను చూడగలిగాం. మనకు వైరస్ జన్మ రహస్యమూ తెలుసు, మరణ రహస్యమూ తెలుసు. శత్రువును తుదముట్టించే గెలుపు వ్యూహమూ తెలుసు. మనం అన్ని హంగులూ సమకూర్చుకొని సర్వ సన్నద్ధమై ఉన్నాం. ఈ లాక్‌డౌన్ ఎంతకాలం ఉంటుంది, ఈలోగా వైరస్ ఎన్ని ప్రాణాలను పొట్టన పెట్టుకుంటుంది అనే భయసందేహాలు పెట్టుకోవద్దు. ఇది భయపడవలసిన సందర్భం కాదు, జాగ్రత్త పడవలసిన సందర్భం. వుహాన్ అనుభవం నుంచి మనం నేర్చుకోవలసిన ప్రధానాంశం–కష్టాలు ఎప్పటికీ ఉండవు. మృత్యువుదే ఎప్పటికీ పైచేయి కాదు. తలుపు తట్టిన శత్రువు తలవంచి నిష్క్రమించే రోజు తప్పక వస్తుంది. అప్పటి వరకు నిబ్బరంగా ఉండాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ మనలను సరిహద్దులో ప్రాణాలు ఒడ్డి నిలబడమనడం లేదు. కొండలు పగుల గొట్టమనడం లేదు. ఇంటిపట్టున ఉల్లాసంగా ఉండమంటున్నారు. ఈ సూచనను పాటిస్తే చాలు. మనం బతికి బయటపడతాం.

## కొందరి తప్పు, అందరికీ ముప్పు

**ఆలోకన**



టంకశాల అశోక్

తబ్లిగీ తప్పుల వల్ల వారికే గాక మొత్తం ముస్లిం సమాజానికి, దేశానికి కూడా హాని కలుగుతున్నది. అది తక్షణ స్థాయిలో తమతో సహా అందరి ఆరోగ్యానికి, దీర్ఘకాలికంగా సామాజిక సామరస్యతకు సంబంధించినది. ఢిల్లీ కార్యక్రమాల నిర్వహణలో తబ్లిగీతో పాటు కేంద్రం తప్పులు ఎట్లుండినా, తర్వాతకాలంలో సంస్థ నాయకులు, అనుయాయుల ధోరణి సవ్యంగా ఉన్నట్లయితే, తక్కిన ముస్లిం సమాజం తను చేయని తప్పుకు సంజాయిషీ ఇచ్చుకోవలసి రావటం గాని, అవకాశం కోసం ఎప్పుడూ ఎదురుచూసే వ్యతిరేక శక్తులకు ఇదొక వరంగా మారటం గాని జరిగేది కాదు.

**ఇస్లాంలో** తబ్లిగీ జమాత్ ఒక శాఖ. 1925లో ఆరంభమైన ఆ సంస్థ లక్ష్యం తమ మతాన్ని సంస్కరించుకోవటం. సంస్కరణకు అర్థం మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునీకరించటం కావచ్చు, లేదా ఆధునిక పరిణామాలు తమ ప్రవక్త మౌలిక బోధనలకు హానికరంగా ఉన్నాయి గనుక తిరిగి ఆ మౌలికత వైపు వెళ్లాలనుకోవటం కావచ్చు. ఈ రెండు విధాలైన పురోగామి, తిరోగామి సంస్కరణలు, ఆ పనిచేసే శాఖలు కూడా మనకు అనేక మతాల చరిత్రలలో కన్పిస్తాయి.

అటువంటి వాటిలో తబ్లిగీ జమాత్ ఒకటి. అకడమిక్‌గా చెప్పాలంటే వారు చెప్తున్న మత సంస్కరణ తిరోగామి సంస్కరణ. 1925 నుంచి 95 సంవత్సరాలుగా ఆ సంస్థ అదే లక్ష్యాలతో పని చేస్తున్నది. దాని అనుయాయులు అనేక దేశాలలో లక్షల సంఖ్యలో ఉన్నారు. తిరిగి అకడమిక్‌గా చెప్పాలంటే స్వభావరీత్యా తబ్లిగీ ఒక ఫండమెంటలిస్టు సంస్థ అయినప్పటికీ, కనీసం మన దేశంలో సాధారణ మత కార్యక్రమాలు మినహా మత విద్వేష కార్యకలాపాలు, కలహాల వంటివాటికి పాల్పడిన రికార్డు ఉన్నట్లు లేదు.

ఇంతకూ తప్పు ఎక్కడ జరిగింది? ఢిల్లీ హజ్రత్ నిజాముద్దీన్ ప్రాంతంలో గల మర్కజ్‌లో జరిగిన తబ్లిగీ ప్రార్థనలకు సంబంధించి ఒకవైపు ఆ సంస్థ, మరొకవైపు కేంద్ర ప్రభుత్వం అధీనంలో గల ఢిల్లీ పోలీసులు ఎవరి వాదనలు వారు చెప్తున్నారు. ఇరువురి వాదనలను నిష్పక్షపాతంగా, జాగ్రత్తగా పరిశీలించినప్పుడు ఎవరు కూడా అన్ని విషయాలను దాచకుండా వెల్లడిస్తున్నట్లు తోచదు. అట్లా ఎందుకు అనిపిస్తున్నదో విశ్లేషించేందుకు ఇది సందర్భం కాదు గనుక అటుంచుదాం. ఆ వివరాలు ప్రస్తుతం ఢిల్లీ పోలీసు క్రైమ్ బ్రాంచ్ చేస్తున్న దర్యాప్తులో, తర్వాత కోర్టు విచారణలలో బయటకురావచ్చు.

ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. కరోనా వైరస్ ఇతర దేశాల నుంచి వచ్చినవారి ద్వారా ఇక్కడ సంక్రమిస్తున్నది. ఇది విదేశాల నుంచి వచ్చిన భారతీయుల నుంచి ఇతర భారతీయులకు స్థానికంగా సోకింది. వారి కుటుంబసభ్యులకు, ఇంకా ఇతరులకు కూడా. అట్లా బయటినుంచి వచ్చిన భారతీయులలో కొందరికి వారు అక్కడ బయల్దేరే సమయానికి, లేదా ఇక్కడకు చేరిన తొలి రోజులలో వ్యాధి లక్షణాలు బయటపడలేదు. అది ఆ తర్వాత పరీక్షలలో తేలింది. కొందరైతే ఆ విషయం ముందే తెలిసి కూడా దాచిపెట్టారు. పోలీసులు,వైద్యులు కనుగొన్న తర్వాత కూడా సహకరించనివారు, క్వారంటైన్‌ను ఉల్లంఘించి తిరుగుతున్నవారు, ఈ కారణాల వల్ల కుటుంబసభ్యులకు వ్యాధిని సంక్రమింపజేస్తున్నవారు మరికొందరు.

ఢిల్లీ ప్రార్థనలకు లాక్‌డౌన్ కన్న ముందే వచ్చిన విదేశీయులకు వ్యాధి లక్షణాలు వారు తమ దేశాల నుంచి బయలుదేరటానికి ముందే ఉన్నాయా, ఉండి ఆ దశలో బయటపడలేదా అన్న వివరాలు మనకు తెలియదు. అక్కడ వారి విమానాశ్రయాలలో, ఇక్కడ ఢిల్లీ విమానాశ్రయంలో జరిగిన వైద్య పరీక్షలు ఏమిటో కూడా తెలియదు. లాక్‌డౌన్‌ను ఉల్లంఘించి వందలు, వేల మంది రోజుల తరబడి ప్రార్థనలు జరుపుతుండగా ఆ మసీదుకు సరిగ్గా ఆనుకునే ఉన్న పోలీస్‌స్టేషన్ వారు, మసీదులపై ప్రత్యేక నిఘా వేసే ఇంటెలిజెన్స్ వారు ఏమి చేశారన్నదీ తెలియదు. తబ్లిగీ ప్రార్థనలకు వచ్చిన సమూహాలకు, కరోనాకు సంబంధం గల కేసుల గురించి తెలంగాణ అధికారు



లు చెప్పేవరకు,కేంద్రం తన విస్తృతమైన, బలమైన యంత్రాంగం ద్వారా ఎందువల్ల తెలుసుకోలేకపోయిందో అంతకన్నా అర్థం కాదు.

ఈ అనేకానేక వివరాలు, ప్రశ్నలు ఎట్లున్నప్పటికీ, తబ్లిగీ నాయకత్వం చేసిన స్పష్టమైన మొదటి తప్పు– లాక్‌డౌన్ ప్రకటించిన వెంటనే ప్రార్థనలను ఆపివేయకపోవటం. తమ కార్యక్రమాలను రద్దుచేసుకుంటున్నట్లు ప్రకటించి ఆ విషయం అధికారులకు, మీడియాకు తెలియజేయకపోవటం. తమ విదేశీ, స్వదేశీ ప్రచారకులు ఎవరూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రచారం నిమిత్తం వెళ్లరాదని ఆదేశించకపోవటం. ఒకవేళ అప్పటికీ ఎవరైనా వెళ్లి ఉంటే వెంటనే ఉప సంహరించుకోవాలంటూ చెప్పకపోవటం. కనీసం వ్యాధి తీవ్రత పెరుగుతుండిన సమయంలోనైనా ఆ పనిచేయకపోవటం. ఇవన్నీ తబ్లిగీ నాయకత్వం చేసిన మొదటి తరహా తప్పులు.

ఇక రెండవ తరహావి– తమ అనుయాయులకు సంబంధించినవి. లాక్‌డౌన్‌కు ముందూ తర్వాత వేలాది మంది అనుయాయులు అనేక రాష్ట్రాలకు వెళ్లిపోయారు. వారిలో పలువురికి వ్యాధిసోకిన వార్తలు కొద్దిరోజుల్లోనే రాసాగాయి. వారు తమ వివరాలు అధికారులకు తెలియజేయటం లేదని, సహకరించటం లేదన్న వార్తలు కూడా వచ్చాయి. అటువంటప్పుడు ఢిల్లీలోనూ, స్థానికంగానూ గల తబ్లిగీ పెద్దలు వెంటనే రంగంలోకి దిగవలసింది. ఢిల్లీ మర్కజ్ ప్రధాన ప్రతినిధి, ఆ మరునాడు ప్రధాన గురువు ఒక్కొక్కసారి తమ అనుయాయులకు విజ్ఞప్తులు చేసిన మాట నిజం. కానీ అది ఎంతమాత్రం చాల లేదు. వ్యాధి పెరుగుతున్న లెక్కలు, అందులో తబ్లిగీ యాత్రికుల వాటాలను కేంద్ర, రాష్ట్ర అధికారులు రోజూ ప్రకటిస్తున్నారు. పైన చెప్పినట్లు అధికారులకు సహకరించనివారు, లాక్‌డౌన్‌ను ఉల్లంఘించే వారు ఇతరులలోనూ ఉన్నారు. కానీ తబ్లిగీ ఒక వ్యవస్థీకృత సంస్థ అని గుర్తించాలి. ఆ సంస్థ బాధ్యులు, అనుయాయులు ఇప్పటికైనా తమ కోసం సమాజం కోసం బాధ్యతగా వ్యవహరించాలి. తబ్లిగీతో సంబంధం లేకున్నా ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు ఇప్పటికే అటువంటి విజ్ఞప్తి చేసింది. వారు దేశంలోని మసీదుల్లో నమాజును మొదటనే ఆపివేశారు. ప్రభుత్వానికి సహకరించి నియమాలను పాటించాలని ప్రకటించారు.

వెనుకబడి ఉన్నది తబ్లిగీ ఒక్కటే. కేవలం వారి తప్పులు ముస్లిం సమాజాన్ని అంతా ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టుతున్నాయి.ఇటువంటి అవకాశాల కోసం ఎదురుచూసే శక్తులకు ఇది ఒక వరంగా మారింది. ఆ శక్తులకు బయట కూడా సాధారణ ప్రజలలో తబ్లిగీ యాత్రికుల తీరు వ్యతిరేకతను పెంచుతున్నది. మొదట అనుకున్నట్లు ఈ ధోరణి వల్ల తమతో సహా అందరి ఆరోగ్యాలకు ముప్పు ఏర్పడుతున్నది. ఇటువంటి శక్తుల వల్ల, ప్రజలలోనూ వ్యతిరేకతల వల్ల దీర్ఘకాలంలో సామాజిక సామరస్యతలకు ప్రమాదం పొంచి ఉన్నది.

> ఇంతకూ తప్పు ఎక్కడ జరిగింది? ఢిల్లీ హజ్రత్ నిజాముద్దీన్ ప్రాంతంలో గల మర్కజ్‌లో జరిగిన తబ్లిగీ ప్రార్థనలకు సంబంధించి ఒకవైపు ఆ సంస్థ, మరొకవైపు కేంద్ర ప్రభుత్వం అధీనంలో గల ఢిల్లీ పోలీసులు ఎవరి వాదనలు వారు చెప్తున్నారు.

## బాధ్యతగా నడయాడు

**అజ్ఞాతంగా** ఉంటూ మిక్కిలి తెలివితో
కలిగించెనొకటి విధి వైపరీత్యము..
కరోనా నామముతో జగమునెల్ల
గడగడలాడిస్తోందిది నిత్యమూ..!

కానీ .. కాపాడటానికి మన చెంత
వీరున్నారన్న ధైర్యంతో కొంత నిశ్చింత!

మన జీవనాడికై
తమ ప్రాణాల్ని అడ్డువేస్తూ
నిత్యం మానవ సేవలోనే తరిస్తున్న
వైద్యులను –
వైద్య సిబ్బందిని చూస్తుంటే
దేవదూతలా లేక సాక్షాత్తు దేవుళ్ళా..
అని అన్పిస్తోంది కదూ ..!

అగ్నిగోళంలా ప్రజ్వరిల్లుతున్న సూర్య
తాపాన్ని సైతం
తమ కనుసన్నల్లోకి రానీకుండా
కాఠిన్యం– కరుణ
తమ రెండు కళ్లుగా చేసుకొని
అనుక్షణం
ఆపద నుండి రక్షించటానికి తపిస్తున్న
రక్షకభటులను చూస్తుంటే ..
బాధ్యతాయుతమైన తండ్రులా.. లేక
సరిహద్దుల్లో వుండి దేశాన్ని
కాపాడే సిపాయిలా
అని అన్పిస్తోంది కదూ..!

అందరినీ తమ బిడ్డలుగా భావిస్తూ
ఎవ్వరికీ హాని కలుగకుండా క్షణక్షణం
శుచి – శుభ్రత కోసం పరితపిస్తూ
శ్రమిస్తున్న శ్రామికులను చూస్తుంటే..
కన్నతల్లులా లేక ఆదిశక్తులా
అని అన్పిస్తోంది కదూ..!

ఆర్థిక మాంద్యము కూడా లెక్క చేయక
నిద్రాహారాలు మాని
ప్రజా రక్షణే మా లక్ష్యమని
ప్రతిక్షణం యోచిస్తున్న
ప్రభుత్వమును చూస్తుంటే..
ధర్మ పరిపాలన చేసే రారాజులా లేక
అంతకు మించా..
అని అన్పిస్తోంది కదూ..!

జనులారా.. మీకన్పించటం లేదా!?
మన కోసం గీచిన లక్ష్మణరేఖ లాంటి
రక్షణరేఖ దాటకుండా
వారు చెప్పిన నియమాలను
పాటించాలని .. మనల్ని కాపాడుకొని
వారందరికీ విముక్తి కలిగించాలని
వారికి అందరం సెల్యూట్
చేయాలనీ..!

నాడు లక్ష్మణరేఖ దాటితే రావణ
హతంతో
జరిగెను లోక కళ్యాణము..
కానీ .. నేడు రక్షణరేఖ దాటితే మనల్ని
అంతం చేసే ప్రత్యర్థి మహమ్మారికి
కలుగును కదా విజయము..!
అందుకే..
బాధ్యతగా నడయాడు..
నిర్లక్ష్యం విడనాడు...

–మాదారపు వాణిశ్రీ,
9247286668

## భద్రతకు పూచీ.. పేదలకు భరోసా

> మంచి మనసు, దయాగుణం కలవాడే రాజు అయితే ఆ రాజ్యంలోని ప్రజలంతా ఎంతటి విపత్తు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోగలుగుతారు. ప్రస్తుతం కరోనా వైరస్ యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో ఒక రాజు వలె తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. కరోనా కాలంలో ఆయన ప్రదర్శిస్తున్న చొరవను, కరోనా కట్టడి కోసం రాష్ట్రప్రజలకు ఆయన సూచనలను యావత్ దేశం హర్షిస్తున్నది.

**తెలంగాణం**



నన్నపునేని నరేందర్

**తెలంగాణ** రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమ స్ఫూర్తితో కరోనాపై కేసీఆర్ పోరు సల్పుతున్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క వ్యక్తి కరోనా రక్కసికి బలికాకూడదనే లక్ష్యంతో ప్రజలను అప్రమత్తం చేశారు.ఈ క్రమంలోనే విదేశాల నుంచి వచ్చిన వేలాది మందిని ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేసి రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తిచెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కరోనా సంక్షోభ సమయంలో మనోధైర్యం కోల్పోకూడదని వరుసగా మీడియా సమావేశాలు నిర్వహించి మనోనిబ్బరాన్ని పెంచారు. ఆయన చేసిన సూచనలను ప్రజలు స్వీకరించారు. ఆయన మార్గదర్శనంలో నడుస్తున్నారు. ఈ క్రమంలో లాక్‌డౌన్ విజయవంతంగా కొనసాగుతున్నది. ప్రజలు స్వచ్ఛందంగా గృహ నిర్బంధంలో ఉంటున్నారు. కష్టమైనా సరే కరోనాకు బలికాకూడదని ఇంట్లోనే ఉంటున్నారు.

ఉద్యమ సమయంలో తెలంగాణ సాధన కోసం ఎలాగైతే చర్చోపచర్చలు, మేధోమథనాలు చేశారో.., అలాగే కరోనా నిరోధానికి సైతం ఉద్యమస్ఫూర్తితో సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారు.ప్రజల సంక్షేమం కోసం అహో రాత్రులు శ్రమిస్తున్నారు. కరోనా వైరస్ నివారణ కోసం సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభు త్వం చేస్తున్న సూచనలు, నిబంధనలను విధి గా ప్రజలు పాటించవలసిన అవసరం ఎంతై నా ఉన్నది. అప్పుడే కరోనా రక్కసి నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తులయ్యే అవకాశం ఉం టుంది.

కరోనా నివారణ చర్యల్లో భాగంగా ఒక్క తెలంగాణ, ఒక్క భారత్ మాత్రమే కాదు, యావత్ ప్రపంచం లాక్‌డౌన్ అయ్యింది. వ్యాపార వాణిజ్య సముదాయాలు మూతబడినాయి. పేద ప్రజలకు ఉపాధి కరువైంది. దిన కూలీలు రోడ్డున పడ్డారు. కేసీఆర్ పేదల బాధలను అర్థం చేసుకొని బాసటగా నిలిచారు. ఈ సంక్షోభ సమయంలో స్వాంతనగా నిలిచేందుకు నిర్ణయం తీసుకున్నారు. తెల్ల రేషన్ కార్డ్ కలిగిన కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 12కిలోల బియ్యం సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పేద కుటుంబానికి నిత్యావసరాల కోసం రూ.1500లు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ విధంగా పేదలకు ప్రభుత్వం భరోసా కల్పించింది. అంతేకాదు, వలస కూలీలు లాక్‌డౌన్‌తో ఉపా ధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. అలాంటి వారిని తెలంగాణ పునర్నిర్మాణ భాగస్వాములుగా గుర్తిస్తూ ప్రతి ఒక్కరికి రూ.500లతో సహా 12కిలోల రేషన్ బియ్యాన్ని అందిస్తున్నది తెలంగాణ ప్రభు త్వం.

సంక్షోభ సమయాల్లో, విపత్కర పరిస్థితుల్లో పేదలకు అండగా నిలువడం నాయకుని లక్షణం. ఇలాంటి అరుదైన నాయకుల్లో కేసీఆర్ ఒక్కరంటూ యావత్ దేశం కీర్తిస్తున్నది. తమను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నది తెలంగాణ ప్రభుత్వం అని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతుండటం గమనార్హం.

కరోనా నివారణ కోసం మనం చేయాల్సిందల్లా ఒక్కటే. ఆయన సూచనలను అనుసరిస్తూ లాక్‌డౌన్‌లో భాగంగా ఇండ్లల్లోనే ఉండటం. కరోనా మహమ్మారిని తరిమికొట్టాలంటే స్వీయ నియంత్రణే శ్రీరామ రక్ష. అందుకోసమే రాష్ట్ర ప్రజలంతా స్వీయ నియంత్రణ పాటించాలి. కరోనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే క్వారంటైన్‌లో ఉంటూ వెంటనే దవాఖానను సంప్రదించాలి. సామాజిక దూరం పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న జర్నలిస్టులకు, వైద్యులకు, పారిశుద్ధ్య సిబ్బందికి, పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు. క్వారంటైన్ పాటిద్దాం.. కరోనా నివారణకు కృషిచేద్దాం.

(వ్యాసకర్త: వరంగల్ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు)

## ఇది యుద్ధం, ఏకమై నిలుద్దాం

> కరోనా మహమ్మారి నుంచి బయటపడాలంటే 'లాక్‌డౌన్' ఒక్కటే శరణ్యమా! ఈ నేపథ్యంలో ప్రపంచ గమనాన్ని తప్పకుండా పరిశీలించాల్సిందే. కొన్ని దేశాల్లో ప్రాణనష్టం ఎందుకు తీవ్రంగా ఉంది? లాక్‌డౌన్ ప్రభావం ఆయా దేశాల్లో ఎలా ఉంది? భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు వస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. తీసుకోవాల్సిన ముందస్తు చర్యలేంటి? ఇవన్నీ చూసినప్పుడు లాక్‌డౌన్ కొంతకాలం తప్పేలా లేదు.

**విశ్లేషణ**



పీవీ శ్రీనివాసరావు

**ముఖ్యమంత్రి** కేసీఆర్ ఇవన్నీ పరిగణనలోకి తీసుకునే లాక్‌డౌన్‌ను కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని అనుకోవచ్చా? కేసీఆర్ నిర్వహిస్తున్న మీడియా సమావేశాలు, చెబుతున్న అంశాలను బట్టి చూస్తే ఆయన కరోనా వైరస్ నివారణ కోసం పలు రకాల అధ్యయనాలు చేస్తున్నట్టు కనిపిస్తున్నది. వ్యాధి తీవ్రత, మన దేశంలో ఉండే మౌలిక సదుపాయాలు, వైరస్ విస్తరిస్తే జరిగే నష్టాన్ని గుర్తించే కేసీఆర్ ఈ ప్రతిపాదన చేశారనిపిస్తున్నది. మార్చిలో 12 వేల కోట్లు ఆదాయం కోల్పోతే ఏప్రిల్‌లో ఇప్పటి వరకు రూ.2,500 కోట్లు రావాల్సి ఉండగా 6 కోట్లు కూడా రాలేదని చెప్పారు. ముఖ్యమంత్రి ముందుచూపుతోనే జనతా కర్ఫ్యూ రోజే మార్చి 31 వరకు లాక్‌డౌన్ పాటించాలన్నారు. ఆ తర్వాతే ప్రధాని ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్ ఉంటుందని ప్రకటించారు. లాక్‌డౌన్ పాటిస్తూ కరోనా వ్యాధి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడుతూనే ఈ కాలంలో పేదలు, వలస కార్మికులు ఇబ్బంది పడకూడదని నిత్యావసరాలు, నగదు అందిస్తున్నారు. అలాగే రైతులు పండించిన పంటలను కూడా కొనుగోలు చేయాలనే నిర్ణయం తీసుకోవటం ముదావహం.

చరిత్రలో ఏయుద్ధంలోనైనా డాక్టర్ల పాత్ర చాలా కీలకం. ఆ విషయాన్ని కేసీఆర్ గుర్తించే వాళ్ల సేవలను కొనియాడారు. ప్రోత్సాహకంగా నగదు బహుమతి ఇచ్చా రు.'సఫాయన్నకు సలాం' చెప్పి వారికి కూడా పారితోషికం ప్రకటించి పెద్ద మనసు చాటుకున్నారు. యుద్ధంలో ఉండే సైనికుడిని భుజం తట్టి వారిలో మనోధైర్యం నిం పాలి. కేసీఆర్ ఆ పనిచేసి దేశానికి మార్గదర్శకంగా నిలిచారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టాల్లో పాలుపంచుకోవాలని చెప్పిన మార్గదర్శి కేసీఆర్. దేశంలో పెరుగుతున్న కరోనా కేసుల తీవ్రత, మన జనాభా, మనకున్న వైద్య వనరులు, వ్యాధి విస్తరిస్తే జరిగేప్రాణనష్టం వీటన్నింటి దృష్ట్యా కేసీఆర్ విజ్ఞప్తిని కేంద్ర ప్రభు త్వం పరిగణనలోకి తీసుకోవాలి.

అగ్రరాజ్యం అమెరికా కరోనా వైరస్ ప్రభావానికి వణికిపోతున్నది. శవాలు గుట్టలుగా పడుతున్నాయి. కారణం వాళ్లు లాక్‌డౌన్ ప్రకటించకపోవడమే. నిధులకు, వైద్య మౌలిక సదుపాయాలకు అమెరికాకు కొదువ లేదు. అయినా వేలాది మంది మృత్యువాత పడుతున్నారు. అమెరికా పరిస్థితే ఇలా ఉంటే ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో వ్యాధి విస్తరిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

కరోనా వైరస్‌కు ఇప్పటికీ మందు కనిపెట్ట లేకపోయాం. కాబట్టి లాక్‌డౌన్ ఒక్కటే శ్రీరామ రక్ష. విదేశాలు, మర్కజ్ నుంచి వచ్చినవారిని ప్రభుత్వం.. మీరు పరీక్షలు చేయిం చుకోండి, క్వారంటైన్‌లో ఉండండి అని చెప్పినా కొందరు వినడంలేదు. ఫలితంగా వారి కుటుంబ సభ్యులకూ వ్యాధి సోకింది. లాక్‌డౌన్ పాటించకపోతే కరోనా కేసులు ఇంకా పెరుగుతాయి. ఇలా కేసులు పెరుగుకుంటూ పోతే మనం కూడా చేతులెత్తేసే పరిస్థితి నెలకొంటుంది.

కరోనా కట్టడి కోసం కేసీఆర్ అవిరళ కృషి చేస్తున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు. ఈ సమయంలో అందరూ ఏకతాటిమీద నిలబడాలి. ప్రతిపక్షాలు సైతం రాజకీయాలకు తావులేకుండా నిర్మాణాత్మకంగా సూచనలు చేయాలి. నిజమే ఇది యుద్ధ సమయం. శత్రుదేశాల దాడి కన్నా ఇది ప్రమాదకరమైనది.ఈయుద్ధంలో ఓడిపోతే మానవాళి మనుగడకే ప్రమాదం. మీడియా కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. ఎప్పటికప్పుడు సమస్యను సర్కార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేట్లు చూడాలి.ఎట్టి పరిస్థితుల్లో అబద్ధపు వార్తలను ప్రసారం చేయవద్దు. ఈ యుద్ధ సమయంలో పనిచేసే వారెవ్వరూ సహనం కోల్పోకూడదు.

(వ్యాసకర్త: 'టీ న్యూస్' ఇన్‌పుట్ ఎడిటర్)

## కూర్చుండే గుర్రాలు మలుపు!

**చాటుగా** నిలబడి
బాణాన్ని గురిపెట్టటమూ
నీళ్ళల్లో ప్రతిబింబాన్ని చూసి
వేలాడుతున్న చేపను కొట్టటమూ
ఇవేమంతా గొప్పవి కావు!
కనిపించని శత్రువును
ఎలా మట్టు పెట్టాలన్నదే
ఈనాటి లాక్ డౌన్!!
ఇంట్లో నువ్వుండి
బయట నుండి ఇంటికి
తాళం పడ్డట్టుండాలి
సెల్లు ఒక్కదగ్గర ఉండే
సకల పనులు నెరవేస్తున్నట్టు–
అలాగే నువ్వూ
ఇంట్లో కదలకుండా
కూర్చుండే గుర్రాలు మలుపు..!!

– కందుకూరి శ్రీరాములు
9440119245

## శ్రీరామ సాక్షాత్కారం



**నమస్తే.. నమస్తే.. నమః**

- శతావధాని డాక్టర్ జి.యం.రామశర్మ

**ప్రతిభామూర్తి,** పవిత్ర కీర్తిని పొందిన పోతనామాత్యుడు సంసారసాగర సేతువైన భాగవతాన్ని అనువదించడానికై ఉపక్రమిస్తూ, 'అనేక వేల జన్మలలో సంపాదించుకొన్న తపఃఫలం వల్లనే తన హృదయంలో పురుషోత్తముని పుణ్యకథా గ్రంథాన్ని అనువదించాలనే ఆసక్తి కలిగిందని' వెల్లడించాడు. ఇది ఒక దైవ ప్రేరణగా, ఒక దివ్య కార్యంగానూ తలపోశాడు ఆ మహనుభావుడు. అంతేకాదు, 'తన పూర్వపుణ్య విశేషం వల్లనే పూర్వకవులు భాగవతాన్ని అనువదించకుండా ఆ అమృతభాండాన్ని తన కోసం నిల్వ చేశారని, ఇది తనకు లభించిన సువర్ణావకాశం' అని వర్ణించి మురిసిపోయాడు పోతన.

'ఏ కార్యం సత్ప్రేరణతో మొదలవుతుందో అది సుశ్లోకమవడమేకాక సకల లోక హితాన్ని కూడా సంపాదించి పెడుతుంది' అనడంలో ఏ సందేహమూ లేదు. పుణ్యశ్లోకుడైన పోతన సు'వర్ణ'మయంగా పోతబోసిన భాగవతం కవితాపరంగా ఒక ఉత్తుంగ రసతరంగిణి అయితే భక్తిపరంగా ఆయనొక ఆధ్యాత్మిక మేరుశిఖరం కావడానికి మొదటి కారణం భగవత్ప్రేరణ కాగా, రెండవ కారణం ఆ మహాకవికి శ్రీరామ సాక్షాత్కారం కావడం.

అదొక పున్నమి రోజు. ఆ రోజును 'పోతన పున్నెం (పుణ్యం) పండిన రోజు'గా ఊహించవచ్చు. విశేషించి, అది చంద్రగ్రహణపు పవిత్ర వేళ. ఆ వేళ దివ్య గోదావరీ నదీ స్నానం చేసిన ఆ మహామనీషి పావన గౌతమీతీరంలో మహేశ్వరుడైన శివుణ్ణి లక్ష్యంగా చేసుకొని అరవిప్పారిన కన్నులతో ధ్యానం చేస్తున్నాడు. అప్పుడు, ఆ పుణ్యమూర్తికి శ్రీరామచంద్రస్వామి దర్శనమైందట. అది చంద్రగ్రహణం కావడంతో చంద్రుడు కనిపించే అవకాశం లేదు. అయితే, రామచంద్రుడు కనిపించాడు. ఎంత హృదయంగమ సన్నివేశం. ఇంకేం, భాగవతానువాదానికై పోతన్నకు శ్రీరాముని ఆజ్ఞ లభించింది. ఇక్కడే ఒక వింత చోటు చేసుకొన్నది. అదేమిటంటే, 'పోతన చేసింది హర (శివుని) ధ్యానం. అతనికి కలిగింది హరి (రామ) దర్శనం. హరిహరులకు భేదం లేదనే సిద్ధాంతానికి ఇంతకంటే బలీయమైన ప్రమాణమేముంటుంది! హరిహరులలో కనిపించేది 'గుడి'(ర/రి) భేదమే కదా. వారిరువురిలో ఆత్మభేదం ఎంతమాత్రం లేదనేది నిర్వివాదం.

పోతన తాను దర్శించిన శ్రీరామచంద్రస్వామిని ఒక అందమైన 'సీస'పద్యంలో ఆత్మానందంతో వర్ణించి, ఆ హృద్యమైన అనుభూతిని మనకు మనసారా అందించాడు. ఆ సుమధుర వర్ణనలోకి తొంగిచూస్తే.. 'మెరుపుతో కూడిన వినీల మేఘం లాగా మేటి లావణ్యవతియైన సీతతో కూడియున్నవాడు, చంద్రమండలం కురిపించే సాంద్రమైన వెన్నెల వానలాగా అందమైన



ముఖంపై సుందరమైన చిరునవ్వు కలవాడు, సోయగాల తీగెతో పెనవేసికొన్న నల్లని తమాల వృక్షం (కానుగు చెట్టు) లాగా దండి కోదండాన్ని భుజాన వేసుకొన్నవాడు, నల్లని పర్వతశిఖరంపై మొలిచిన ఉదయ సూర్యబింబం లాగా మిరుమిట్లు గొలిపే గొప్ప సువర్ణ కిరీటాన్ని తలపై ధరించిన వాడు, తెల్ల తామరల లాంటి విప్పారిన కండ్లు కలవాడు, విశాలమైన చాతి గలవాడు, భద్రముద్రాంకితమైన ఆకారం కలవాడు.. అయిన రాజముఖ్యుడైన రాముడు నా కంటి ఎదుట సాక్షాత్కరించినాడు'.. అని ఆ మహాకవి శ్రీ రాముని ముగ్ధమనోహర రూపాన్ని మృదుమధురంగా కవిత్వీకరించాడు.

ఈ వర్ణనను లోతుగా పరిశీలిస్తే.. సీతను మెరుపుతో పోల్చడం 'విద్యుల్లేఖేవ భాస్వరా' అన్న శ్రుతివాక్యాన్ని గుర్తుకుతెస్తున్నది. రాముని చిరునవ్వును వెన్నెలతో పోల్చడం, ఆశ్రితలోక చకోరాలకు ఆ స్వామి చిరునవ్వు సంజీవని అనే అంశాన్ని సూచిస్తున్నది. ఇక, ఆయన భుజాన ఉన్న కోదండం 'శిష్టరక్షణకు దుష్టశిక్షణ'కు ప్రతీయమా నం. అలాగే, కిరీటాన్ని సూర్యునితో పోల్చిచెప్పడ మంటే అది సకల జగతికి ప్రగతిని కల్పించే చైతన్య దీప్తిని ప్రసాదించగలదని స్ఫురింపజేయడానికే. అలాగే, పద్మాల వంటి విప్పారిన నేత్రాలు, విశాలమైన చాతి, భద్రమైన మూర్తిమత్త్వం.. ఇవన్నీ శ్రీరాముని మంగళకరత్వానికి అద్దం పట్టేవి. ఇలా.. పోతనామాత్యులు తాను కండ్లారా చూసిన శ్రీరామరూపాన్ని మనమూ మనసారా ఉపాసిద్దాం. మధురానుభూతిలో తేలిపోదాం.

లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు | పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు **1967** | హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ **100** 24/7 | సైబరాబాద్ కమిషనరేట్ **9490617440** | రాచకొండ కమిషనరేట్ **9490617234** | కొవిడ్-19 కాల్‌సెంటర్ **040-23434343**

# రైతులకు సర్కారు అండ

## వడగండ్ల వానతో పంటలకు నష్టం

- జాతీయ విపత్తు నిధితో ఆదుకుంటాం
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- అంచనాల కోసం కలెక్టర్లకు ఆదేశం


వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం అల్లమాయిపల్లిలో వరి చేను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** రాష్ట్రంలో పలు చోట్ల మంగళవారం కురిసిన వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి, ఖిల్లాఘనపురం మండలం సోళీపూర్, ఘణపురం, అల్లమాయపల్లి, తిర్మలాపూర్ గ్రామాల్లో వడగండ్ల వానతో నష్టపోయిన రైతుల పొలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వడగండ్లవాన కురిసిన చోట బీమా పరిధిలో నష్టపరిహారం అందే అంశాలను అంచనా వేస్తున్నట్టు చెప్పారు. బీమా పరిధిలోకి రాని రైతులను జాతీయ విపత్తు నిధి ద్వారా ఆదుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. అకాల వర్షానికి వరి, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు పేర్కొన్నారు. ఏటా ఏప్రిల్‌లో అకాలవర్షాలు కురుస్తాయి కాబట్టి, రైతులు యాసంగి పంటను మార్చి నెలలోనే కోతకు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇన్నేండ్లూ వర్షాధార పంటలు పండించుకున్న రైతులు.. తెలంగాణ వచ్చాక కాల్వల ద్వారా నీరు అందుతుండటంతో సంతోషంగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వాన రైతుల ఆశలపై నీళ్లు చల్లడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. పంట నష్టం వివరాలు సేకరించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు నిరంజన్‌రెడ్డి చెప్పారు.

### 14 వేల ఎకరాల్లో నష్టం

అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 14 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా 13 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రాథమిక పంట నష్టం అంచనా నివేదిను ప్రభుత్వానికి సమర్పించింది. కోత దశలో ఉన్న వరికి వడగండ్ల వానలతో తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 6,176 ఎకరాలు, రంగారెడ్డిలో వెయ్యి ఎకరాలు, వనపర్తిలో 4,031 ఎకరాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

**పంటనష్టం వివరాలు ఇవ్వండి**

ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద నమోదు చేసుకున్న రైతులు.. వడగండ్లు, అకాల వర్షంతో పంట నష్టపోతే ఆ సమాచారాన్ని ఆయా జిల్లాల్లో ఇన్సూరెన్స్ పథకం అమలుచేసే కంపెనీలకు 72 గంటల్లో తెలియజేయాలని వ్యవసాయ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో వడగండ్లు, అకాల వర్షంతో వరి, మక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులు తమ పేరును అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ టోల్ ఫ్రీనంబర్- 18005992594కు, ఇఫ్కోటోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ టోల్ ఫ్రీ నంబర్ 18001035499కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

**గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన**

**హైదరాబాద్ సిటీబ్యూరో:** పగలు భగభగ.. రాత్రి వేళ వర్షంతో గ్రేటర్ హైదరాబాద్‌లో భిన్న వాతావరణం నెలకొన్నది. ఉపరితల ఆవర్తనాలకుతోడు అధిక ఉష్ణోగ్రతల కారణంగా క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడటంతో ఈ పరిస్థితులు నెలకొన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. వీటి ప్రభావంతో గురు, శుక్రవారాల్లో గ్రేటర్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. నగరంలో బుధవారం 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, 24.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత, గాలిలో తేమ 24.1 శాతంగా నమోదైందని పేర్కొన్నారు.

## నోడల్ ఏజెన్సీగా టీఎస్‌మార్క్‌ఫెడ్

2020-21 ఆర్థిక సంవత్సరంలో ఎరువుల కొనుగోలు, బఫర్ స్టాక్ నిల్వ, సరఫరా చేయడానికి నోడల్ ఏజెన్సీగా టీఎస్ మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సంవత్సరానికి మార్క్‌ఫెడ్ ద్వారా వివిధ జిల్లాల్లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను బఫర్‌స్టాక్‌గా ఉంచనుంది. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 0.30 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, 0.70 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను బఫర్‌స్టాక్‌గా మార్క్‌ఫెడ్ జిల్లాల వారీగా అందుబాటులో ఉంచాలి. వీటి కొనుగోలుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు రూ.500 కోట్లు బ్యాంకు గ్యారెంటీ కల్పించింది. ఈ మేరకు బుధవారం వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## గన్నీ బ్యాగులు సరఫరా చేయండి

- కేంద్ర మంత్రి తోమర్‌కు నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి

గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌ను కోరారు. వ్యవసాయశాఖ మంత్రులు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శులతో కేంద్రమంత్రి బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నిరంజన్‌రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మొబైల్ రైతుబజార్లు, కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను కేంద్రమంత్రి ప్రశంసించారు. ఇక్కడి బత్తాయిలను ఢిల్లీ మార్కెట్‌కు పంపేలా సహకరించాలన్నారు. కరోనా నేపథ్యంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా వానాకాలంలో బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## 20 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం

- రైతుబంధు సమితిరాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి



రాష్ట్రానికి 20 కోట్ల గన్నీ బ్యాగుల అవసరముండగా.. ప్రస్తుతం 10 కోట్లే ఉన్నాయని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నీ సంచులు పంపాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోరామని వెల్లడించారు. వరి ధాన్యం సేకరణకు ఏడు వేల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామని, కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఎం కేసీఆర్ రూ.32 వేల కోట్ల బ్యాంకు గ్యారెంటి ఇచ్చారన్నారు. ధాన్యం సేకరణ సమస్యలపై కాల్ సెంటర్ నెంబర్ 7288894807, 7288876545లో రైతులు సంప్రదించాలని సూచించారు.


మైకు ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

## ప్రజల సహకారంతో కట్టడి

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**నిజామాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడికి సహకరించాలని శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్, బాల్కొండలో కంటైన్‌మెంట్ క్లస్టర్లను పరిశీలించారు. మైకు ద్వారా సూచనలిచ్చారు. కంటైన్‌మెంట్ క్లస్టర్లలో ఉన్న వారికి నిత్యావసర సరుకులను ఇంటివద్దకే తీసుకువచ్చి అధికారులు అందజేస్తారని చెప్పారు.


సూర్యాపేటలో మీకోసం యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## సీఎం కేసీఆర్ నిర్ణయం దేశానికే ఆదర్శం

విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరోనాపై సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేటలో రెడ్‌జోన్ ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం రూపొందించిన 'మీ కోసం' యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఇమాంపేట వద్ద గురుకుల పాఠశాల క్వారంటైన్ సెంటర్‌ను సందర్శించి బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ తదితరులున్నారు.


ఖమ్మం జిల్లా చింతకానిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మహిళా రైతుకు కూపన్ అందిస్తున్న మంత్రి అజయ్‌కుమార్

## మక్కల కొనుగోలుకు రూ.3500 కోట్లు

మంత్రి పువ్వాడ అజయ్

**రఘునాథపాలెం:** మక్కల కొనుగోలుకు ప్రభుత్వం రూ.3500 కోట్లు కేటాయించిందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం, ఖమ్మంనగర పరిధి అల్లిపురం, చింతకాని మండలం లచ్చగూడెం, చింతకాని, కొణిజర్ల మండలం పెద్దమునగాలలో కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులెవ్వరూ ఆందోళనపడొద్దని, ప్రభుత్వమే మక్కలను కొనుగోలు చేస్తుందన్నారు. ఖమ్మం జిల్లాలో432 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.


కలెక్టర్ కృష్ణభాస్కర్, చేనేత జౌళిశాఖ ఏడీ అశోక్‌రావుతో సమావేశమైన టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సభ్యులు

## లాక్‌డౌన్‌లో నేతన్నకు భరోసా

- వెయ్యిమంది కార్మికులకు రూ.1500 చొప్పున అందజేస్తామన్న టెక్స్‌టైల్ పార్క్ ప్రతినిధులు
- కలెక్టర్ కృష్ణభాస్కర్‌తో సమావేశంలో ప్రకటన

**సిరిసిల్ల రూరల్:** లాక్‌డౌన్ నేపథ్యంలో నేతన్నలకు అండనా నిలిచేందుకు సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ యజమానులు ముందుకొచ్చారు. టెక్స్‌టైల్ పార్క్ యూనిట్ యజమానుల సంఘంతో కలెక్టర్ కృష్ణభాస్కర్, చేనేత జౌళిశాఖ ఏడీ అశోక్‌రావు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న దాదాపు 1000 మంది కార్మికులకు అండగా నిలవాలని యజమానులకు సూచించారు. దీనికి టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించి ఒక్కో కార్మికుడికి రూ.1500 చొప్పున మొత్తం రూ.15లక్షలు అందిస్తామని ప్రకటించింది. సమావేశంలో టెక్స్‌టైల్ పార్క్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ అన్నల్‌దాస్ అనీల్, సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు దూస భూమయ్య, ఆడెపు భాస్కర్, చిమ్మని ప్రకాశ్, ఎల్లండి శంకర్, వేముల శ్రీనివాస్, అంకారపు కిరణ్, లక్ష్మీనారాయణ, బొద్దుల వేణు పాల్గొన్నారు.

## ఉల్లంఘనులపై కేసులు

**నల్లగొండ క్రైం/పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** కరోనా వైరస్ నియంత్రణలో ప్రభుత్వ నిర్ణయాలకు విరుద్ధంగా ప్రవర్తించిన 39 మందిపై నల్లగొండ పోలీసులు కేసులు నమోదుచేశారు. వియత్నాం దేశానికి చెందిన 12 మంది, మయన్మార్ రోహింగ్యాలు మరో 17మందిపై వీసా ఉల్లంఘన కింద కేసు నమోదుచేసినట్టు నల్లగొండ వన్‌టౌన్ సీఐ నిగిడాల సురేశ్ తెలిపారు. ఆశ్రయం కల్పించిన ఆరుగురు మసీదు ఇంచార్జిలపైనా కేసులు నమోదుచేసినట్టు తెలిపారు. మరోవైపు లాక్‌డౌన్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 8 కేసుల్లో 21 మందిని అరెస్టు చేసినట్టు సీఐ సురేశ్ వెల్లడించారు. మరోవైపు టూరిస్టు వీసాపై వచ్చి నిబంధనలకు విరుద్ధంగా మతప్రచారం చేస్తూ కరోనా వైరస్ వ్యాప్తికి కారణమైన 10 మందితోపాటు వారికి సహకరించిన స్థానికుడొకరిపైనా కేసు నమోదుచేసినట్టు రామగుండం సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

# గ్రామగ్రామాన కొనుగోళ్లు

- మంత్రి తన్నీరు హరీశ్‌రావు


సిద్దిపేట జిల్లా ఇర్కోడులో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఓవైపు కరోనాపై పోరాడుతునే రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు.. గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రతి గింజను కొనేలా చర్యలు చేపట్టారు.. ధాన్యం కొనుగోలుకు రాష్ట్రవ్యాప్తంగా 14 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, ప్రస్తుతం 5 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని పలుగ్రామాల్లో వరి, మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గన్నీ బ్యాగుల కోసం సీఎం కేసీఆర్ తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు ఇండ్లనుంచి బయటకు రాకుండా లాక్‌డౌన్ కచ్చితంగా పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదన్నారు. అనంతరం లైట్ మోటార్ వెహికల్ మెకానిక్, మ్యాజిక్ ఆటో అసోసియేషన్లకు చెందిన 325 మంది సభ్యులకు బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి ఉప సర్పంచ్ కూతురు శ్రీవిజ్ఞ తాను దాచుకున్న కిడ్డీ బ్యాంకును మంత్రికి అందజేసింది.

## యాచకులకు అండగా పోలీసులు


నల్లగొండ పట్టణంలో రోడ్డు పక్కన యాచకుడికి ఆహార పొట్లాలను అందజేస్తున్న కానిస్టేబుల్

**నల్లగొండ క్రైం:** ఓ వైపు లాక్‌డౌన్ విధులు.. కరోనా వ్యాప్తిచెందకుండా ప్రజల కదలికలను కఠినంగా కట్టడిచేసే బాధ్యత.. మరోపక్క లాక్‌డౌన్ వల్ల ఆహారం దొరక్క అల్లాడిపోతున్న అన్నార్తులను ఆదుకోవాలన్న తాపత్రయం.. నల్లగొండ పట్టణంలో తొమ్మిది మంది కానిస్టేబుళ్లు తమ బాధ్యతను నిర్వర్తిస్తూనే.. అన్నార్తుల ఆకలిదప్పులను ఎంతో ఔదార్యంతో తీరుస్తున్నారు. యాచకులు, అనాథలకు ప్రతిరోజూ ఆహార పొట్లాలు అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న కిషన్‌కుమార్, కరుణాకర్, హఫీజ్, అంజద్‌ఖాన్, మధు, రఘు, జగదీశ్, వీరబాబు, శేఖర్ మంచి మిత్రులు. లాక్‌డౌన్ అమలులో ఉండటంతో గత ఆరు రోజులుగా పట్టణంలో రోడ్ల పక్కన వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న పేదలు, యాచకులకు భోజనం అందిస్తున్నారు. ఇండ్లలోనే వంట చేసుకొని ప్యాక్‌చేయించి వీధులవెంట బతుకీడుస్తున్న యాచకులకు అందజేస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. మొదట కానిస్టేబుల్ కిషన్‌కుమార్ 20 రోజులుగా రోడ్లపై ఉన్న అనాథలకు, యాచకులకు పలురకాల పండ్లు పంచేవాడు. ఓ రోజు ఓ యాచకుడు పండ్లు వద్దు.. రెండు ముద్దలు బువ్వపెడితే చాలన్నట్లుగా సైగచేయడంతో కిషన్‌కుమార్ భోజన ఏర్పాట్లకు సిద్ధమయ్యాడు. కిషన్ సంకల్పానికి అతని మిత్రులు సైతం ముందుకు రావడంతో వారు అద్దెకు ఉంటున్న గదిలోనే వంటలుచేసి ప్యాకెట్లలో ఉంచి నిరుపేదలకు వారంరోజులుగా అందజేస్తున్నారు. విషయంతెలిసిన అధికారులువారిని అభినందనలతో ముంచెత్తుతున్నారు.

### ఆకలిమంట ఏమిటో తెలుసు



నేను నిరుపేద కుటుంబం నుంచి వచ్చాను. ఆకలి పస్తులు, బాధలు ఏమిటో నాకు బాగా తెలుసు. కష్టపడి చదువుకుని ఉద్యోగం సాధించా. కరోనా కారణంగా రోడ్లపైన నిరుపేదలు ఆకలికి అలమటిస్తుంటే నా వంతుగా వారికి పండ్లను అందించేవాడిని. జీతం మీద బతికే నేను నా మిత్రుల సహకారంతో అనాథలకు, యాచకులకు భోజనం అందిస్తున్నాం. మా గదుల్లోనే మాకు తోచిన వంటలు వండి ప్యాకింగ్ చేసి పంపిణీచేస్తున్నాం.

– డీ కిషన్‌కుమార్, పోలీస్ కానిస్టేబుల్, నల్లగొండ

### సంతృప్తిగా ఉన్నది



నేను కష్టపడి ఉద్యోగం సాధించి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. యాచకుల ఆకలి తీరుద్దామని నా మిత్రులు చెప్పడంతో వెంటనే ఒప్పుకున్నాం. ప్రతిరోజు మా రూములోనే వంటలు వండి ప్యాక్‌చేసి మా బండ్లపై తిరుగుతూ నిరుపేదలకు, యాచకులకు అందిస్తున్నాం. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన నాకు పేదవారికి సాయంచేస్తున్న ఆనందం చాలా తృప్తినిస్తున్నది.

– ఎం హఫీజ్, ఏఆర్ కానిస్టేబుల్, నల్లగొండ

## రక్షకభటుల రక్షణకు చర్యలు

- మానసిక ఒత్తిడిని జయించేలా నిపుణులతో కౌన్సెలింగ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ కట్టడిలో వైద్యులతో సమానంగా పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారు. గస్తీలోని పోలీసుల ఆరోగ్యం కాపాడేందుకు పోలీసు శాఖ అవసరమైన చర్యలు తీసుకొంటున్నది. వారికి అవసరమైన మాస్కులు, గ్లౌజ్‌లు, ప్రత్యేక కోట్లు, శానిటైజర్లు, సబ్బులు సరఫరా చేస్తున్నారు. లాక్‌డౌన్ మొదలైన నాటినుంచి గంటల తరబడి చెక్‌పోస్టుల వద్ద నిలబడటం, సరైన నిద్ర లేకపోవడంతో పోలీసులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వేళకు ఆరోగ్యకరమైన భోజనం, శుభ్రమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. మానసిక, శారీరక సమస్యలు ఉన్నట్టు గుర్తించినవారికి తగిన మందులు ఇస్తున్నారు. ప్రత్యేక నిపుణులతో కౌన్సెలింగ్ ఇస్తూ.. వారిలో మనోధైర్యాన్ని పెంచుతున్నారు. ఉన్నతాధికారులు సైతం తమ పరిధిలో సిబ్బందిని ప్రత్యక్షంగా కలుస్తూ వారి కృషిని అభినందిస్తూ. వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు.

**ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం**

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ పనిచేస్తున్నామని డీజీపీ మహేం దర్‌రెడ్డి తెలిపారు. సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకొంటున్నామని, కానిస్టేబుళ్లే మాకు కొండంత బలం అని చెప్పారు. లాక్‌డౌన్ కచ్చితంగా అమలుచేస్తూ కరోనా వ్యాప్తిచెందకుండా పోలీసులు చేస్తున్న కృషి పట్ల గర్వకారణంగాఉన్నదని డీజీపీ పేర్కొన్నారు.


మోడల్ రైతు బజార్ దగ్గర డిజిన్ఫెక్షన్ గదిని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## నిర్ణీత దూరంతో మేలు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్, నమస్తేతెలంగాణ:** ప్రజలు నిర్ణీతదూరంతోపాటు శుభ్రత పాటిస్తే కరోనా మహమ్మారి నుంచి రక్షించుకోవచ్చని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని న్యూమోడల్ రైతు బజార్‌లో కరోనా వ్యాప్తి నిర్మూలన కోసం డిజిన్ఫెక్షన్ గదిని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.


సోన్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

## దళారులకు విక్రయిస్తే నష్టం

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**సోన్:** ఆరుగాలం పండించిన పంటలను దళారులకు విక్రయించి నష్టపోవద్దని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రైతులను కోరారు. బుధవారం నిర్మల్ జిల్లా సోన్‌లో మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే దిగుబడులను విక్రయించుకోవాలని సూచించారు.

## ముందస్తు చర్యలతో కరోనా నియంత్రణ

మంత్రి కొప్పుల ఈశ్వర్



**జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీఎం ముందుచూపుతో కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణలో ఉందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడారు. కరోనాతో ప్రపంచం అతలాకుతలమవుతున్న తరుణంలో తెలంగాణ ముందుగా అప్రమత్తమైందన్నారు. లాక్‌డౌన్‌కు పూర్తిస్థాయిలో ప్రజలు సహకరిస్తున్నారని చెప్పారు.

## కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ మున్సిపల్ పరిపాలనశాఖ డైరెక్టర్ సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. లాక్‌డౌన్ ఉన్న సమయంలో మున్సిపల్ కాగజ్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తికి ఛత్తీస్‌గఢ్‌లోని రాయిపూర్ వెళ్లొచ్చేందుకు కమిషనర్ ట్రావెల్ సర్టిఫికెట్ ఇచ్చారు. కరోనా వైరస్ తీవ్రంగా ప్రబలుతున్న నేపథ్యంలో ట్రావెల్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.

నమస్తే తెలంగాణ
కరీంనగర్
గురువారం 9 ఏప్రిల్ 2020
www.ntnews.com

# జిందగీ

## మాస్కులు కుట్టి.. బంధువులకు పంచి...



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మాస్కుల కొరత ఏర్పడింది. ఈ పరిస్థితి మన దేశంలోనూ నెలకొన్నది. దీంతో లాక్‌డౌన్‌తో ఇంటిపట్టునే ఉంటున్న కొందరు మాస్కులు కుట్టేపనిలో పడ్డారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భార్య మృదుల, కుమార్తె నైమిష కూడా కరోనా కట్టడి చర్యల్లో భాగస్వాములయ్యారు. తమ కుటుంబ సభ్యులకు స్వయంగా మాస్కులను తయారు చేసి ఇచ్చారు. అవసరమున్న వారికి మాస్కులను అందజేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు వారు చెబుతున్నారు. భార్య, కుమార్తె మాస్కులను స్టిచ్ చేస్తున్న ఫోటోలను కేంద్రమంత్రి తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'చాలా మంచిపని చేస్తున్నారు' అంటూ ఆ ఇద్దర్నీ ప్రత్యేకంగా అభినందించారు.



# ఇకనుం చైనా...

**యోగా చేయండి. ధ్యానం మానకండి. ఆసనాలు వేయండి. ఆయుర్వేదం మంచిదండి.**
**... అంటూ భారతీయతకు జైకొడుతున్నారు చైనీయులు.**

**కరోనాకు** ఇంగ్లీష్ మెడిసిన్ ఇంకా ప్రత్యేకమైన మందులేవీ రాలేదు. కానీ భారతీయ వైద్య విధానాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచే దిశగా మంచి పరిష్కారాలను సూచిస్తున్నాయి. చైనా కూడా... లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత భారతీయ యోగా, ఆయుర్వేద సూత్రాలనే పాటించమని ప్రజలకు చెప్తున్నది. పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదు. ఆ గాయం విలువైన పాఠాన్ని నేర్పుతుంది. కరోనా సంక్షోభం నుంచి చైనా నేర్చుకున్న పాఠం పేరు... భారతీయత, భారతీయ వైద్యం. భారతీయ జీవన విధానం ఏ సమస్యను అయినా మూలాల నుంచి చూస్తుంది. వైరస్ మనమీద దాడి చేయకుండా ఉండాలంటే, మన జఠరాగ్నిని వృద్ధి చేసుకోవాలి. నాభి దగ్గర ఉండే మణిపూరక చక్రాన్ని చైతన్యం చేయాలి. ఇందుకు యోగ ప్రక్రియ, ప్రాణాయామ, ఆసనాలు, ముద్ర, ధ్యానం ...అన్నీ కలిపి సాధన చేయాలి.

### 1 కపాల భాతి

ఇది ప్రాణాయామ కాదు, బ్రీతింగ్ టెక్నిక్. శరీరం లోపల శుభ్రం చేసే యోగ ప్రక్రియ. దీనివల్ల లోపలున్న మలినాలన్నీ బయటకు వెళ్లిపోతాయి. ప్రస్తుతం ఉన్న కరోనా ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఫలితంగా శరీరంలోని ప్రతి కణం చైతన్యమంతం అవుతుంది. యోగాను కపాల భాతితోనే మొదలుపెట్టాలి. కింద కూర్చోలేకుంటే కుర్చీలో అయినా చేయొచ్చు. కపాల భాతి చేసేటప్పుడు నిటారుగా కూర్చోవాలి. శ్వాసను గట్టిగా, బలంగా బయటికి వదలాలి. పీల్చుకునేటప్పుడు సాధారణంగానే తీసుకోవాలి. ఇలా ఒక సెకనుకు ఒక స్ట్రోక్ చొప్పున చేయాలి. ఇవి 30 నుంచి మొదలుపెట్టి వంద వరకూ సాధన చేయాలి. కపాలభాతి చేసేటప్పుడు గొంతు, ఛాతీ మీద ఒత్తిడి తేవద్దు. ముక్కు రంధ్రాలపై మాత్రమే ఒత్తిడి ఉండాలి. దీనివల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. అలర్జీలు, దగ్గు, జలుబు రావు. వైరస్ లోపలికి ప్రవేశించినా... బయటకు నెట్టేయబడుతుంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. అయితే పీరియడ్స్‌లో ఉన్నవాళ్లు, గర్భిణులు, పొట్టలో హెర్నియా ఉన్నవాళ్లు, బీపీ, షుగర్ పేషెంట్లు దీన్ని చేయకూడదు. జలుబు ఉన్నా, ఫిట్స్ ఉన్నా చేయొద్దు. కపాల భాతి అయిన తర్వాత ఒక నిమిషం పాటు కళ్లు మూసుకుని మామూలు శ్వాస వదలాలి.

### 2 బస్త్రిక ప్రాణాయామ

దీన్ని మూడు దశల్లో చేయాలి. మొదట ఎడమ ముక్కు మూసి, కుడి ముక్కుతో శ్వాస వదలాలి. ఆ తరువాత కుడి ముక్కు మూసి, ఎడమ ముక్కుతో వదలాలి. చివరగా రెండు ముక్కురంధ్రాలతో ఒకేసారి శ్వాసతీసుకుని వదలాలి. ఇవన్నీ 60 నుంచి 100 సార్లు చేయాలి. ఆ తరువాత ఓ నిమిషం పాటు కళ్లు మూసుకుని శ్వాస వదలాలి.

### 3 అగ్నిసార

ఈ క్రియను కూర్చుని లేదా నిలబడి చేయొచ్చు. వెన్ను నిటారుగా ఉండటం ముఖ్యం. దీనిలో శ్వాస నార్మల్‌గా పీల్చుకుని, వదిలేటప్పుడు మాత్రం బలంగా వదలాలి. మళ్లీ శ్వాస పీల్చుకోకుండా పొట్టను వీలైనంత సేపు కదిలిస్తూ ఉండాలి. తర్వాత మామూలుగా శ్వాస తీసుకుని రిలాక్స్ అవ్వాలి. ఇలా ఐదు సార్లు చేయాలి.

### 4 ముద్రలు

శ్రీలింగ ముద్ర – నిటారుగా కూర్చోవాలి. రెండు చేతుల్లోని... నాలుగు వేళ్లు ఒకదానితో ఒకటి కలపాలి. మగవాళ్లయితే కుడి బొటనవేలు, ఆడవాళ్లయితే ఎడమ బొటనవేలు పైకి ఉంచాలి. రెండు చేతులను పొట్టకు రెండుమూడు అంగుళాల దూరంలో ఉంచాలి. ఇలా పెట్టిన తరువాత కళ్లు మూసుకుని శ్వాస మీద ధ్యాస పెట్టి 3 నుంచి 5 నిమిషాల పాటు ఉండాలి. దీనివల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. వైరస్ ఇన్‌ఫెక్షన్ తగ్గడానికి, అసలు రాకుండా ఉండటానికి సహాయపడుతుంది. శ్వాసముద్ర కూడా అంతే శక్తిమంతమైంది. చిటికెన వేలును బొటనవేలు మొదట్లో ఉంచాలి. ఉంగరం వేలు బొటనవేలి మధ్యలో, మధ్యవేలు బొటనవేలి చివరి భాగంలో ఉంచాలి. చూపుడు వేలు నిటారుగా ఉండాలి. ఇప్పుడు కూడా శ్వాస మీద ధ్యాసపెట్టి 3 – 5 నిమిషాలు ఉండాలి. ఊపిరి తీసుకునేటప్పుడు శక్తిని తీసుకుంటున్నట్టుగా, వదిలేటప్పుడు మలినాలను పంపిస్తున్నట్టుగా ఊహించుకోవాలి. దీనివల్ల శ్వాస సమస్యలు, అలర్జీ, ఆస్తమా తగ్గుతాయి.

### 5 భ్రామరీ ప్రాణాయామ

మానసిక ఒత్తిడికి ఇది మంచి పరిష్కారం. నిద్రకు ముందు 3 నిమిషాల పాటు చేయాలి. ముందుగా రెండు బొటనవేళ్లతో రెండు చెవులు మూయాలి. తరువాత చూపుడు వేళ్లను కనుబొమలకు పైన... చిటికెనవేలు, ఉంగరం వేలు, మధ్య వేళ్లను కనుకొలకుల దగ్గర ఆనించాలి. ఇప్పుడు శ్వాస పీల్చుకుని ఊ... అంటూ తుమ్మెద ఝుంకారంలా శబ్దం చేయాలి. ఈ కంపనాలు ఒత్తిడిని తగ్గిస్తాయి. వాటిని గమనిస్తూ నెమ్మదిగా కళ్లు తెరవాలి. ఒక 30 సెకన్ల పాటు... ఊపిరి పీల్చుకుంటున్నప్పుడల్లా ఇలా చేస్తూ పోవాలి.



**అరుణాదేవి**
యోగా గురువు

## వీటితో పాటుగా...

**సూర్య నమస్కారాలు రోజూ కనీసం 6 సార్లు చేయాలి. ఉష్ట్రాసనం, భుజంగాసనం, మత్స్యాసనం, అర్ధమత్స్యేంద్రాసనం, సర్వాంగాసనం, నౌకాసనం, ధనురాసనం... లాంటివి కూడా వ్యాధి నిరోధక వ్యవస్థను ఉత్తేజితం చేస్తాయి.**

- అరగంటకోసారి గోరువెచ్చని నీళ్లు తాగాలి. ఉదయాన్నే నువ్వుల నూనెతో నోరు పుక్కిలించి, వేడినీటితో నోరు కడుక్కోవాలి.
- గ్లాసు పాలలో పావు టీ స్పూన్ పసుపు వేసి, మరిగించి పిల్లలు, వృద్ధులకు ఇవ్వాలి.
- చిన్న శొంఠి, 5 నల్ల మిరియాలు, చిన్న దాల్చిన చెక్క ముక్క, నాలుగైదు తులసి ఆకులు, మూడు నాలుగు ఎండు ద్రాక్ష వేసిన గ్లాసు నీటిని మరిగించి... వడపోసిన తరువాత దానికి నిమ్మరసం, తేనె లేదా బెల్లం కలిపి తయారు చేసిన... హెర్బల్ టీని 40 రోజుల పాటు తాగాలి.
- పొడిదగ్గు, గొంతునొప్పి ఉంటే పావు టీ స్పూన్ లవంగాల పొడికి టీ స్పూన్ తేనె కలిపి సమస్య తగ్గేవరకు 3 పూటలా తీసుకోవాలి.
- రోజూ నువ్వుల నూనె లేదా ఆవునెయ్యి ఓ రెండు చుక్కలు... రెండు ముక్కు రంధ్రాల్లో వేసుకోవచ్చు. పిల్లలకు కూడా వేయవచ్చు.
- రోజూ పుదీనా, పసుపు వేసిన నీటితో ఆవిరి పట్టాలి.
- జీలకర్ర, వెల్లుల్లి, అల్లం, ఉల్లి, పసుపు మామూలు కన్నా ఎక్కువ వాడాలి.

## ఆయుర్వేద మార్గం..

**స్వాస్థస్య** స్వాస్థ రక్షణం... అంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లు ఆ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పాటించాల్సిన జాగ్రత్తలు. ఆతురస్య వికార ప్రశమనం.. అంటే రోగికి వచ్చిన రోగాన్ని తగ్గించే చికిత్స చేయడం... ఇవి ఆయుర్వేదం పాటించే రెండు విధానాలు. పరిపూర్ణ ఆరోగ్యవంతులు కరోనా బారిన పడకుండా తమను తాము రక్షించుకోవడానికి ఆయుర్వేదం అనేక మార్గాలు చూపుతున్నది. ఆరోగ్యంగా ఉన్నవాళ్లు దినచర్య, రుతుచర్యలను సక్రమంగా పాటిస్తూ... ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. బ్రాహ్మీ ముహూర్తంలో అంటే, 4.30కి అంతా లేవాలి. యోగా, ప్రాణాయామ చేయాలి. వ్యాధినిరోధక శక్తి బలంగా ఉండటానికి ఇక్కడే బీజం పడుతుంది. అల్పాహారానికి ముందు గోరువెచ్చని నీటిలో కొంచెం జీలకర్ర, ధనియాలు, అల్లం వేసి మరిగించి తాగాలి. దీంతో జీర్ణవ్యవస్థ బావుంటుంది. తద్వారా రోగనిరోధకత బలోపేతం అవుతుంది. ఈ రుతువులో కఫం ప్రకోపిస్తుంది. శిశిరంతో మొదలై ఇప్పుడు ఎక్కువ అవుతుంది. దాంతో సహజంగానే ముక్కుదిబ్బడ లాంటివి వస్తాయి. ఛాతీకి సంబంధించిన వ్యాధులు వస్తుంటాయి. రుతుచర్యలో భాగంగా గోరువెచ్చని నీరు తీసుకోవాలి. వీటి గుణాల వల్ల కఫ ప్రకోపం తగ్గుతుంది. మజ్జిగ ఎండల నుంచి ఉపశమనానికే కాదు, రోగనిరోధకత పెరగడానికీ పనిచేస్తుంది. దీనిలో ఉండే వెన్న వల్ల ఎక్కువ ప్రొటీన్ అందుతుంది. దీనిలో సహజమైన లాక్టోబాసిల్లస్ ఉంటుంది. మనుషుల పాలిట అమృతం ఇది. ఆమ్ల జ్యూస్ పేరుతో ఉసిరి రసం మార్కెట్లో దొరుకుతున్నది. 2 చెంచాల ఈ రసాన్ని 4 చెంచాల వేడినీటితో కలిపి పరగడుపున తాగితే రోగనిరోధకత వృద్ధి చెందుతుంది.

**ఔషధాలూ ఉన్నాయ్!**
రోగనిరోధకతను పెంచే చిన్నచిన్న ఔషధాలు కూడా ఆయుర్వేదంలో ఉన్నాయి. గుడూచి (తిప్పతీగ) ఇందుకు బాగా పనిచేస్తుంది. గుడూచి సత్వ పేరుతో దొరికే పొడికి పసుపు కలిపి ఒక అరస్పూన్ రోజూ పాలలో కలుపుకొని పొద్దున్నే తాగాలి. అన్ని వయసుల వాళ్లూ తాగొచ్చు. కరోనా వ్యాధి ఆయుర్వేదంలో చెప్పిన 'భూత అభిష్యంది జ్వరం' – విభాగంలోకి వస్తుంది. అంటే సూక్ష్మజీవుల వల్ల వచ్చేదని అర్థం. ఈ జ్వరాలకు ఇచ్చే చికిత్స కరోనాకు కూడా పనిచేసే అవకాశం ఉంది. అల్లోపతిలో కలిసి ఆయుర్వేద చికిత్సలు కూడా ఇస్తే మంచి ఫలితాలుంటాయి. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ ఆయుర్వేదిక్ రీసెర్చ్ (సిసిఆర్ఏఎస్) వాళ్లు ఇలాంటి విషమ జ్వరాలకు ఆయుష్–64 మందు బాగా పనిచేస్తుందని అధ్యయనాలతో రుజువు చేశారు. అయితే ఇది కరోనా మీద నిర్దుష్టంగా పనిచేస్తుందనడానికి క్లినికల్ ట్రయల్స్ లేవు. సైడ్ ఎఫెక్టులుండవు కాబట్టి ఈ ఔషధాన్ని ప్రయత్నించవచ్చు. ఆయుర్వేద చికిత్స 3 రకాలు. శారీరకంగా ఔషధాలు తీసుకోవడం, మనోస్థైర్యంతో వ్యాధిని జయించడం, ఆధ్యాత్మక చింతన ద్వారా సాంత్వన పొందడం. కరోనాను ఎదుర్కోవడంలో ఇవన్నీ ఇప్పుడు కీలకమైనవే.





**డాక్టర్ సారంగపాణి**
సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ సభ్యులు,మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్
సాయి భరద్వాజ అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద హాస్పిటల్
హైదరాబాద్

## మతములన్నీ మాసిపోవును



**లాక్‌డౌన్** వల్ల జన జీవనం స్తంభించింది. ఈ సమయంలో ఒకరికి ఒకరు సాయం చేసుకోవడం అత్యవసరం. ఈ తరుణంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన ఈ ఘటన హృదయాల్ని కదిలిస్తుంది. లాక్‌డౌన్ సమయంలో ఓ 65 ఏండ్ల మహిళ తీవ్ర అనారోగ్యంతో మరణించింది. కానీ కరోనా భయంతో ఆమె అంత్యక్రియలు నిర్వహించడానికి బంధువులు ఎవరూ ముందుకు రాలేదు. ఆమెకు ఇద్దరు కుమారులు. వారికి సాయం చేయడానికి కూడా వారు భయపడ్డారు. ఈ పరిస్థితిని గమనించిన చుట్టుపక్కల ముస్లిం యువకులు పెద్ద మనసును చాటుకున్నారు.ఆ మహిళకు అంత్యక్రియలు జరపడానికి సిద్ధపడ్డారు. ఆమె మృతదేహాన్ని ముస్లిం యువకులు తమ భుజాలపై మోసుకెళ్లారు. ఇంటి నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు జరిగాయి. మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ ఈ ఫొటోను తన ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'ఇలాంటి ఘటన మనుషుల్లో ప్రేమను, సోదరత్వాన్ని పెంచుతుంది' అని అభినందించారు. నిజమే కదా! మనుషుల మధ్య కుల మత భేదాలు మాసిపోయి మానవత్వం ఒక్కటే నిలుస్తుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

## రెస్టారెంట్ యజమాని ఔదార్యం





**కొండాపూర్‌లోని** 'నాటుకోడి బగారా' రెస్టారెంట్ యజమాని కొత్త లక్ష్మణ్ పటేల్ పదిరోజుల క్రితం నగరంలోని వలస కూలీల బాధలు ప్రత్యక్షంగా చూసి చలించి పోయారు. ఆ సమయంలోనే వారికి తన వంతుగా సాయం అందించాలనుకున్నారు. అప్పటికే లాక్ డౌన్ కారణంగా తన రెస్టారెంట్‌లో పని చేసే కార్మికులు ఇండ్లకే పరిమితమయ్యారు. దీంతో లక్ష్మణ్ పదిమంది కార్మికులను పిలిపించి, తన రెస్టారెంట్‌లోనే వసతి కల్పించారు. ఆకలితో అలమటించే వలస కూలీల కోసం ఆహారం తయారు చేయించి ఇస్తున్నారు. పది రోజులుగా హఫీజ్‌పేట్, ప్రేమ్ నగర్‌లలోని రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్ లకు చెందిన వలస కూలీలకు పండ్లు, భోజనం, మంచి నీటి బాటిళ్లు అందిస్తున్నారు. అంతేకాదు కరోనా వైరస్‌పై అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు. మొత్తం 15 మంది సభ్యులు రోజూ 500 మందికి పైగా అన్నదానం చేస్తున్నారు. ఆ సేవలో పాలుపంచుకోవడానికి సినీ నిర్మాత కాసారం రమేష్‌తోపాటు మరికొంతమంది స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. 'కోట్ల రూపాయలు సంపాదించడంలో కంటే.. ఇలా పదిమందికి సాయం చేయడంలోనే అసలైన సంతృప్తి ఉంటుందని లక్ష్మణ్ పటేల్ చెబుతున్నారు. లాక్ డౌన్ అమల్లో ఉన్నన్నిరోజులూ ఉచితంగా ఆహారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

### ఖాళీ సమయం.. చేతనైన సాయం

**కరోనా** వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా ఎవరికి తోచిన సాయం వారు చేస్తున్నారు. మరోవైపు చిత్రపరిశ్రమలోనూ లాక్‌డౌన్ ప్రభావం కనిపించడంతో తారలంతా ఇండ్లకు పరిమితం అయ్యారు. నటి తులసి ఈ సమయంలో తన వంతు చేయూతను అందిస్తున్నారు. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ శానిటైజర్లను తయారు చేస్తున్నారు. వీటిని పేదలకు, సెక్యూరిటీ గార్డులకు, పనివారికి పంపిణీ చేస్తున్నారు.





## వజ్రాలు... హిజ్రాలు



**కరోనా** కారణంగా... యాచనే ఆధారంగా బతికే చాలామంది ట్రాన్స్‌జెండర్స్ ఉపాధిని కోల్పోయారు. అయినా, నిరాశతో కుమిలిపోకుండా.. సామాజిక బాధ్యతగా బయటికి వచ్చారు. లాక్‌డౌన్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారికి తమదైన శైలిలో అవగాహన కల్పిస్తున్నారు. సిగ్నల్స్ పడిన సమయంలో... కరోనా కట్టడికి చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఒకే రంగు చీరలు ధరించి... తమ హావభావాలతో ఆకట్టుకుంటున్నారు, ఆలోచింపజేస్తున్నారు. నిన్నమొన్నటి వరకూ రైళ్లు, బస్సులు, దేవాలయాలు, సిగ్నల్స్ వద్ద యాచించి సంపాదించుకున్న డబ్బును పేదల కడుపునింపడానికి వినియోగిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎల్.బి.నగర్‌కు చెందిన వాసవిరెడ్డి అనే హిజ్రా తోటివారితో కలిసి పేదలకు బియ్యం, కూరగాయలు అందించి తన పెద్దమనసు చాటుకుంది. 'నా చుట్టూ ఉన్నవారు బాగుంటేనే నేను బాగుంటాను. వారు ఆకలితో అలమటిస్తుంటే నేనెలా కడుపునిండా తినగలను? అందుకే నాకు చేతనైనంత సాయం చేస్తున్నాను' అంటున్నారామె. ఇక కడప జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్స్ హాసిని అసోసియేషన్ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వెజ్‌బిర్యానీ, ఎగ్‌కర్రీ నిరుపేదలకు పంపిణీ చేశారు.

# అల్లరి

## పద్యం

మనసులోన నున్న మమతలన్నియు గోసి
దృఢము చేసి మనసు తేటపరచి
ఘటము నిల్పువాడు ఘనతర యోగిరా
విశ్వదాభిరామ వినురవేమ.



భావం : మనసులోని అహంకారాన్ని తొలగించుకోవాలి. మనసును స్థిరపరుచుకోవాలి. ఎలాంటి చెడు ఆలోచనలు రానీయకుండా చూసుకోవాలి. అట్లా మనసును శుద్ధిగా ఉంచుకొని, దేహాన్ని అదుపు చేసుకోగలిగినవాడే నిజమైన యోగి అవుతాడని ఈ పద్య భావం.

## చుక్కలు కలుపండి





కథ

## తెలివైన చేపలు

**ఒక అడవిలో** పెద్ద చెరువు ఉండేది. దానిలో చాలా చేపలు ఎంతో కాలంగా నివాసం ఉండేవి. ఆ చెరువు దట్టమైన అడవి లోపల ఉండటం వల్ల శత్రువుల భయం లేకుండా బతికేవి. ఒకరోజు ఆ అడవి మీదగా ఎగురుతున్న ఒక కొంగకి ఆ చెరువు కనిపించింది. 'ఇంత పెద్ద చెరువుని చూడకుండా ఇంతకాలం ఎలా ఉన్నానా?' అని ఆశ్చర్యపోతూ చెరువు గట్టుపై వాలింది. చెరువులో చాలా చేపలు కనిపించాయి. ఇక తన ఆహారానికి ఎలాంటి ఇబ్బందీ లేదనుకొని, కొంత దూరంలో నివాసం ఏర్పరుచుకుంది. రోజూ మూడుపూటలా హాయిగా చేపలను తింటూ కాలం గడపసాగింది. ఈలోగా చేపలు కంగారు పడటం ప్రారంభించాయి. రోజూ తమలో కొన్ని కొంగకి బలైపోవడం చేపలకు భయం కలిగించింది. ఇలా అయితే కొన్ని రోజులకి తామెవ్వరమూ మిగలమని తెలుసుకొని, కొంగ బారి నుంచి రక్షించుకొనే ఉపాయం ఆలోచించసాగాయి. ఒక చేపపిల్ల 'నాకొక ఉపాయం తట్టింది, కాని, దానికి మీ అందరి సహకారం కావాలి' అని చెప్పింది. 'ఏమిటది?' అని మిగతా చేపలు అడిగాయి. చేపపిల్ల తన ఉపాయాన్ని వాటికి చెప్పింది.

మరుసటి రోజు ఉదయాన్నే చేపల్ని తినడానికి కొంగ చెరువు వద్దకు వచ్చింది. కానీ చెరువులో చేపలన్నీ తేలుతూ కనిపించడం చూసి ఆశ్చర్యపోయింది. 'చూస్తుంటే ఈ చేపలన్నీ చచ్చినట్టున్నాయి, ఏమై ఉంటుందో'నని ఆలోచించసాగింది. ఇంతలో ఒక చేప నీరసంగా పడుతూ, లేస్తూ కనిపించింది. కొంగ ఆనందంగా ఆ చేపను పట్టుకోవడానికి ముందుకు వచ్చింది. కానీ ఆ చేప కొంగతో 'నీకు బతకాలని ఉంటే నా మాట విను' అన్నది. కొంగ ఆగి 'ఏమిటో చెప్పు?' అని ఆత్రుతతో అడిగింది. 'నిన్న రాత్రి ఒక పాము చెరువు దగ్గరకు వచ్చి నీళ్ళు తాగబోయింది. ఈలోగా ఒక పెద్దచేప దాన్ని కొరికింది. కోపంతో పాము చెరువులో విషాన్ని కక్కి వెళ్ళిపోయింది. చెరువులోని నీళ్ళన్నీ విషమయం అయిపోయాయి. అందుకే చేపలన్నీ చచ్చి తేలుతున్నాయి, నేను కూడా ఇంకో క్షణంలో చావబోతున్నాను. నన్ను తింటే నువ్వు కూడా చనిపోతావు జాగ్రత్త!' అంటూ గిలగిలా కొట్టుకోసాగింది చేప. దాంతో భయపడ్డ కొంగ మరొక చెరువును వెతుక్కుంటూ వెళ్ళిపోయింది. చేపపిల్ల పాచిక పారినందుకు చేపలన్నీ ఎంతో సంతోషించాయి.



## పెద్దల మాట



నూనె వేస్తూ ఉంటేనే దీపం వెలుగుతుంది. మనం ప్రేమ చూపిస్తుంటేనే మనపైన ప్రేమ అనే ప్రకాశం పడేది.

**- మదర్ థెరిస్సా**

## జత పరచండి




## పదాలు... అర్థాలు



University – విశ్వవిద్యాలయం
Lecturers – అధ్యాపకులు
Head of the Department– విభాగ అధిపతి
Struggle– పోరాటం
Research– పరిశోధన
Unity – ఐక్యత

## తెలియని నిజం




## దారి కనుక్కోండి



## జర నవ్వుకో!





**కొడుకు :** నాన్నా.. నాన్నా నాకు సన్నాయి నేర్చుకోవాలనుంది. కొనిపెట్టవా?
**తండ్రి:** వేళాపాళా లేకుండా వాయిస్తే ఇంట్లో గోలగా ఉంటుంది.
**కొడుకు :** పర్లేదు నాన్నా.. మీరంతా నిద్రపోయిన తర్వాత వాయించుకుంటాను!

****

**టింకు :** నీ చెప్పుల జత ఏంట్రా.. ఒకటి ఎర్రగా, మరోటి పచ్చ రంగులో భలే వింతగా ఉంది?
**పింటు :** అచ్చం ఇలాంటి వింత జతే మా ఇంట్లో మరోటి ఉంది!

## Two Goats

స్టోరీ బాక్స్



There were two goats. Over a river there was a very narrow bridge. One day a goat was crossing this bridge.Just at the middle of the bridge he met another goat.There was no room for them to pass. "Go back," said one goat to the other, "There is no room for both of us"."Why should I go back?" said the other goat. "Better you must go back." "You must go back", said the first goat, "because I am stronger than you." "You are not stronger than I", said the second goat."We will see about that", said the first goat and he put down his horns to fight. "Stop!" said the second goat. "If we fight, we shall both fall into the river and be drowned and instead I have a plan. I shall lie down and you may walk over me." Then the wise one laid down on the bridge and the other goat walked highly over him.So they crossed the bridge comfortably and went on their ways.

river : నది
must go back : కచ్చితంగా వెనక్కి వెళ్లడం.
strong : బలం horns : కొమ్ములు
wise : తెలివైన went : వెళ్లిపోవడం
comfortably : సులభంగా

# చిత్రం



అల్లుఅర్జున్

## పుష్పరాజ్‌గా బన్నీ

**అ**ల్లు అర్జున్, విలక్షణ చిత్రాల దర్శకుడు సుకుమార్ కలయికలో మైత్రీ మూవీ మేకర్స్, ముత్తంశెట్టి మీడియా పతాకాలపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. ఈ చిత్రానికి 'పుష్ప' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఈ ఫస్ట్‌లుక్‌లో పొడవైన జుట్టు, గడ్డం, తీక్షణమైన చూపులతో గత చిత్రాలకు పూర్తి భిన్నంగా అల్లు అర్జున్ కనిపిస్తున్నారు. పోలీసులకు పట్టుబడిన దొంగగా మాస్ పంథాలో తీర్చిదిద్దిన ఈ లుక్‌తో పాటు టైటిల్ అభిమానుల్ని ఆకట్టుకుంటున్నాయి. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ కనిపించబోతున్నారు. సినిమా కోసం చాలా ఎగ్జైటింగ్‌గా ఎదురుచూస్తున్నానని, అందరిని మెప్పిస్తుందనే నమ్మకముందని అల్లు అర్జున్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. చిత్తూరు బ్యాక్‌డ్రాప్‌లో ఎర్రచందనం అక్రమరవాణా నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు తెలిసింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో పాన్ ఇండియన్ స్థాయిలో సినిమాను రూపొందిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: మిరోస్లోవ్ కుబ బ్రోజెక్,



అనుష్క

## మాటలు సరిపోవు

**లా**క్‌డౌన్ కారణంగా ఏర్పడిన ఈ విరామంలో జీవితంలోని కొత్త కోణాల్ని దర్శించిన అనుభూతి కలుగుతున్నదని అంటోంది అనుష్క. ఎలాంటి తారతమ్యాలు లేకుండా మానవత్వంతో కరోనా విపత్తు నుంచి ధరిత్రిని రక్షించుకునే మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగమవ్వాలని చెప్పింది. అనుష్క మాట్లాడుతూ 'ఈ విపత్తు వల్ల అసాధ్యాలన్నీ సుసాధ్యమవుతున్నాయి. సాధ్యమైనవన్నీ అదృశ్యమైపోతున్న భావన కలుగుతున్నది. తెలిసినవన్నీ తెలియనట్లుగానే కనిపిస్తున్నాయి. అందరం విభజింపబడినట్లుగా, ఒంటరి వాళ్లమైనట్లుగా ఉంది. కానీ ఐక్యంగా నిలవడం స్ఫూర్తినిస్తున్నది. సరిహద్దులు, కాలాల పరంగా వేరైనా కలిసి కట్టుగా అందరి క్షేమం కోసం ప్రేమ పూర్వక హృదయంతో ప్రార్థిద్దాం. మన ప్రాణాల్ని కాపాడటానికి పనిచేస్తున్న వారికి, మనల్ని అనుక్షణం జాగ్రత్తగా కాపాడుతున్న వారికి, మనకు సహాయం చేస్తున్న వారికి కృతజ్ఞతలు చెప్పడానికి మాటలు సరిపోవు. ప్రతి వ్యక్తి అందరి క్షేమం కోసం పాటుపడే సందర్భమిది' అని తెలిపింది.



సాగర్, కేటీఆర్, మహేందర్‌రెడ్డి

## సినీ కార్మికుల కోసం

**క**రోనా విపత్తు కారణంగా ఉపాధిని కోల్పోయిన సినీ కార్మికులను ఆదుకునేందుకు చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటైన కరోనా క్రైసిస్ ఛారిటీ మనకోసంకు సినీ ప్రముఖులంతా విరాళాల్ని అందిస్తూ అండగా నిలుస్తున్నారు. సీసీసీకి అమరరాజా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ పది లక్షల్ని వితరణగా అందజేసింది. నిర్మాత పద్మావతి గల్లా మాట్లాడుతూ 'లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలంతా ఇళ్లల్లో సురక్షితంగా ఉండాలి. ప్రభుత్వాలు, వైద్యులు, పోలీసుల సూచనల్ని పాటిస్తూ కరోనా వైరస్ నిరోధంలో భాగస్వాములు కావాలి' అని పేర్కొన్నారు.



పద్మావతి

### సాయికుమార్ వితరణ

హీరో సాయికుమార్ తనయుడు ఆదితో కలిసి సీసీసీకి ఐదు లక్షల నాలుగు రూపాయల్ని విరాళంగా అందించారు. అందరూ ఇళ్లల్లోనే క్షేమంగా ఉండాలని సాయికుమార్ పేర్కొన్నారు. డబ్బింగ్ యూనియన్ అసోసియేషన్‌కు సాయికుమార్ లక్ష ఎనిమిది రూపాయల్ని, ఆయన సోదరుడు రవిశంకర్ లక్ష రూపాయల్ని విరాళంగా ఇచ్చారు.



సాయికుమార్

### సాగర్ ఐదు లక్షల విరాళం

నటుడు సాగర్ ('మొగలి రేకులు'ఫేం) తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ఐదు లక్షల్ని విరాళంగా అందించారు. బుధవారం కేటీఆర్‌కు సాగర్ చెక్‌ను అందజేశారు.

### అమీర్‌ఖాన్ విరాళం



అమీర్‌ఖాన్

బాలీవుడ్ అగ్ర నటుడు అమీర్‌ఖాన్ పీఎం కేర్స్‌తో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాన్ని అందించారు. 'లాల్ సింగ్‌చద్దా' సినిమా కోసం పనిచేస్తున్న కార్మికులకు ఆర్థిక సహాయం అందించబోతున్నట్లు ప్రకటించారు. ఎంత మొత్తం విరాళంగా అందించింది మాత్రం అమీర్‌ఖాన్ తెలుపలేదు. గృహవసతి, పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేదల్ని ఆదుకోబోతున్నట్లు బాలీవుడ్ నటుడు వరుణ్‌ధావన్ తెలిపారు.

## ఆకలితో ఉండకూడదు



హృతిక్‌రోషన్

**క**రోనా మహమ్మారి కారణంగా ఆకలితో అలమటిస్తున్న పేదవారిని ఆదుకునేందుకు బాలీవుడ్ హీరో హృతిక్‌రోషన్ ముందడుగు వేశారు . లాక్‌డౌన్ కొనసాగినన్నీ రోజులు ప్రతి దినం లక్ష ఇరవై వేల మంది నిరుపేదలకు ఆహారాన్ని అందించబోతున్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్‌తో కలిసి హృతిక్‌రోషన్ ఈ సహాయాన్ని అందించనున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించే పరిస్థితి ఉండకూడదని, పెద్ద, చిన్నా అనే భేదాలు ఎవరికి సాధ్యమైన రీతిలో వారు సాయం చేయడానికి ముందుకు రావాలని హృతిక్‌రోషన్ చెప్పారు.





# కరోనా అనుమానమా.. ఫోన్ చేయండి!

దగ్గు, జలుబు, జ్వర పీడితుల కోసం.. 8331865100
మానసిక రోగుల చికిత్స కోసం.. 18004254731

- ప్రజల భయాందోళనలు తొలగించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందుబాటులోకి 'టెలీమెడిసిన్', 'భరోసా చేయూత' కేంద్రాలు
- డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు
- ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు
- ఆడియో లేదా వీడియోకాల్ ద్వారా వైద్యనిపుణుల సలహాలు, సూచనలు
- మొదటి రోజు 27 మందికి వైద్య సాయం
- సేవలను వినియోగించుకోవాలి: కలెక్టర్ శశాంక


ఫోన్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

మీ ఇంట్లో ఎవరైనా దగ్గు, జ్వరం, జలుబు వంటి లక్షణాలతో బాధపడుతోంటే హైరానా పడకండి.. దవాఖానలు లేవని ఆందోళన చెందకండి.. కరోనా కావచ్చేమోనని అనవసరంగా భయపడకండి.. ఎందుకంటే, అది సీజన్ వల్ల వచ్చిన వ్యాధో లేక మరేంటిదో ఇంట్లోనే ఉండి తెలుసుకోండి. అందుకోసమే జిల్లా యంత్రాంగం తాజాగా టెలిమెడిసన్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఒక్క ఫోన్, వాట్సాప్ కాల్‌చేస్తే.. వైద్య నిపుణులతో మీ లక్షణాలను పరిశీలించి వైద్య సలహాలు, సూచనలను అందించనున్నది. ఇదే కాదు, మద్యం, సిగరెట్, గుట్కా, పాన్‌పరాగ్ లాంటివి దొరక్క విచిత్రంగా ప్రవర్తిస్తున్న వారికి సైతం బాసటగా నిలిచేందుకు చేయూత (సైక్రియాటిక్ హెల్ప్‌లైన్) కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. - కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ కరీంనగర్ హెల్త్


ఫోన్‌లో మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశం

ప్రస్తుతం కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ కొనసాగుతున్నది. దవాఖానలన్నీ బంద్ ఉన్నాయి. మెజార్టీ ప్రైవేట్ డాక్టర్లు ఓపీ కూడా చూడడం లేదు. మరోవైపు ప్రజలను కొవిడ్ భయం వెంటాడుతున్నది. ఏ ఇంట్లోనైనా దగ్గు, జలుబు, జ్వరం వంటివి వస్తే చాలు, కంగారు పడిపోయి హాస్పిటళ్లకు తీసుకెళ్లాలని హైరానా పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. కొంత మంది మెడికల్ షాపులకు వెళ్లి నేరుగా మందులు తెచ్చి వాడుతున్నారు. ఇటువంటి ఇబ్బందులను తొలగించి, నిపుణులైన వైద్యులతో సూచనలు, సలహాలు అందించేందుకు వీలుగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ శంశక టెలీమెడిసన్, చేయూత కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు.

### టెలీమెడిసిన్, భరోసా చేయూత కేంద్రాలు ప్రారంభం..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో టెలీ మెడిసిన్ సెంటర్, మానసిక రోగుల చికిత్స కోసం భరోసా చేయూత కేంద్రాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, కమిషనర్ క్రాంతి, వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాతతో కలిసి కలెక్టర్ శశాంక ప్రారంభించారు. మొదటి రోజు టెలీమెడిసిన్ ద్వారా 17 మంది, చేయూత కేంద్రం ద్వారా 10 మంది వైద్య సహాయం పొందినట్లు తెలిపారు. జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు వసంత్‌రావు, రాష్ట్ర ఈసీ సభ్యుడు జగన్‌మోహన్ రావు, బీఎన్ రావు, డీసీ తిరుపతి, సీనియర్ సైక్రియాటిస్ట్, డీటీసీవో కేవీ రవీందర్‌రెడ్డి, రమాదేవి, కల్యాణ్ సుమన్ ఉన్నారు.

### భరోసా చేయూత కేంద్రం.. (సైకియాట్రిక్ హెల్ప్‌లైన్)

**ఎక్కడ :** ఇది కూడా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలోనే ఏర్పాటు
**పనిచేసే సమయం :** ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలవరకు..
**ఎవరు వినియోగించుకోవచ్చు:** వ్యసనాలకు బానిసలై మానసిక రుగ్మతలకు లోనవుతున్నవారు. ఉదాహరణకు మద్యం, పాన్‌పరాగ్, గుట్కా వంటి మత్తు పదార్థాలు అలవాటున్న వారు, అవి దొరకని సమయంలో కొంత మంది విచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. కొంత మంది మానసిక ఒత్తిడికి లోనై ఇబ్బంది పడతారు. కొంత మంది కరోనా భయంతో తమకు ఏదో జరిగిపోతుందనే భయంతో ఆందోళన చెందుతుంటారు. ఇలాంటి వారంతా ఫోన్ చేయవచ్చు.
**ఎలా సంప్రదించాలి :** 18004254731 ఈ నెంబర్‌కు నేరుగా ఫోన్ చేస్తే, వైద్యులు తగు సూచలు, సలహాలు అందజేస్తారు. అవసరమైతే కేంద్రంలో ఉండే వైద్యులే కాకుండా ఇతర మానసిక వైద్య నిపుణులకు కాన్ఫరెన్స్ కలిపి ఫోన్ ద్వారానే కౌన్సెలింగ్ ఇస్తారు.
**అందుబాటులో ఉండే మానసిక వైద్య నిపుణులు:** ప్రవీణ్‌కుమార్, సంజయ్‌కుమార్, వర్షీ, పృథ్వీరెడ్డి, ప్రీతి, శివకుమార్ ఉంటారు. మున్ముందు మరికొంత మంది వైద్యులు సైతం సేవ లందించేందుకు ముందుకొచ్చే అవకాశం ఉంది.
**ప్రయోజనాలు :** లాక్‌డౌన్‌తో అన్నీ బంద్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే మత్తు పదార్థాలు ఎక్కడా దొరకడం లేదు. వాటికి బానిసైన చాలా మంది విచిత్రంగా ప్రవరిస్తున్నారు. వారిని ఏ దవాఖానకు తీసుకెళ్లాలో తెలియక కుటుంబసభ్యులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమయంలో భరోసా చేయూత కేంద్రానికి కాల్ చేస్తే, రోగి మానసిక ప్రవర్తనను బట్టి వైద్య సలహాలు, సూచనలు అందిస్తారు. అవసరమైతే ఏ దవాఖానకు తీసుకెళ్లాలో.. ఎవరిని కలువాలో.. వివరిస్తారు. ఇంకా అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు.


టెలీ మెడిసిన్ సెంటర్‌లో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

### సేవలు వినియోగించుకోవాలి..

కరోనా కట్టడితోపాటు ప్రజలకు వైద్య సలహాలు, సూచనలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఈ రెండు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఎటువంటి సమస్యకైనా ముందుగా సరైన వైద్య నిర్ధారణ సూచనలు అవసరం. రోగి, సదరు కుటుంబాలకు సకాలంలో సలహాలు అందితే.. వారు అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటారు. ప్రజలెవరూ ఆందోళన చెందకుండా ఈ సేవలను వినియోగించుకోవాలి. కేంద్రాల నిర్వహణకు సహకరిస్తున్న ప్రైవేట్ వైద్యులకు అభినందనలు తెలుపుతున్నాం. వైరస్ నియంత్రణకు కలిసికట్టుగా పోరాడడమే కాదు, సమష్టి సహకారం కూడా అవసరమే.
- కే శశాంక, కరీంనగర్ కలెక్టర్

### టెలీమెడిసన్ కేంద్రం..

**ఎక్కడ :** జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు
**పని వేళలు :** ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు..
**ఎవరు వినియోగించుకోవచ్చు :** దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, కరోనా లక్షణాలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు.
**ఎలా సంప్రదించాలి :** 8331865100ను ప్రత్యేకంగా కేటాయించారు. సంబంధిత కుటుంబ సభ్యులు లేదా బాధితులు ఈ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. వ్యాధి లక్షణాలను గమనించే విధంగా ఉండడానికి వాట్సాప్ కాల్ చేయవచ్చు. మీ వివరాలు పంపి, సలహాలు, సూచనలు తీసుకోవచ్చు.
**అందుబాటులో ఉండే ఫిజిషియన్లు :** రమాదేవి, కల్యాణ్ సుమన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి శేషశైలజ, సురేశ్, వెంకటరెడ్డి, అజయ్ ఖండల్, తిరుపతిరావు సేవలందిస్తారు. వీరితోపాటు మరికొంత మంది వైద్యులు సైతం సహాయం అందించడానికి ముందుకు వస్తున్నారు. ఆయా వైద్యులు వారికి కేటాయించిన సమయాన్ని బట్టి ఉంటారు. ఒక వేళ ఎవరైనా వైద్యులు కాల్ సెంటర్‌లో అందుబాటులో లేకపోతే.. కాన్ఫరెన్స్ కలిపి రోగికి సూచనలు, సలహాలు అందేలా చూస్తారు.
**ప్రయోజనాలు :** మీరు ఇంటి నుంచి బయటకు రాకుండానే వైద్య సూచనలు, సలహాలు పొందవచ్చు. మీరు వైద్యులకు ఇచ్చే సమాచారాన్ని బట్టి.. సదరు వ్యక్తికి కరోనా లక్షణాలున్నాయో? లేదో? తెలుసుకోవచ్చు. అంతేకాదు, రోగి వివరాలను బట్టి తక్షణం వైద్య సలహాలు తీసుకోవచ్చు. ఒక వేళ కొవిడ్ లక్షణాలుంటే.. సదరు వ్యక్తులు వెంటనే ఏ దవాఖానకు వెళ్లాలో.. ఎవరిని కలువాలో.. వివరిస్తారు. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు వంటివి అయితే ఏ మందులు వాడాలో సూచిస్తారు. అడ్మిట్ కావాల్సిన పరిస్థితి ఉంటే ఆ వివరాలు చెబుతారు.

## ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్


నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ అధ్యక్షురాలు

**జగిత్యాల, నమస్తే తెలంగాణ/ జగిత్యాల రూరల్ :** కరోనా వైరస్ ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత పేర్కొన్నారు. పెరకపల్లి భాగ్యరాజ ఫంక్షన్ హాల్‌లో తిప్పన్నపేట ఉప సర్పంచ్ బుచ్చన్న ఆధ్వర్యంలో 60మంది నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ రౌతు జయ ₹10వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే, జడ్పీ అధ్యక్షురాలికి అందజేశారు. 6వ వార్డులో 60 మంది వలస కూలీలకు ప్రభుత్వం తరపున 12 కిలోల బియ్యం, సత్యసాయి సేవా సమితి నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల వారు మాట్లాడుతూ, ప్రజలందరూ ఒకరికి ఒకరు దూరం పాటించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ములాసపు లక్ష్మి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులను అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

## ప్రతి ధాన్యం గింజనూ కొంటాం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**తిమ్మాపూర్ రూరల్ /మానకొండూర్ రూరల్ / మానకొండూర్:** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. తిమ్మాపూర్‌తోపాటు మహాత్మానగర్, మానకొండూర్ మండలం ఊటూర్, పచ్చునూర్, మద్దికుంట, దేవంపల్లి, అన్నారం, జగ్గయ్యపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. గోదారి జలాలతో తొలిసారి చేతికచ్చిన పంటను చూసి ఆనందపడాల్సిన సమయంలో కరోనా మహమ్మారి సంబురం లేకుండా చేసిందన్నారు. అయినా రైతులకు ఇబ్బందుల్లేకుండా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. మద్దికుంటలో కేంద్రం వద్ద శానిటేషన్ ఏర్పాటు చేసిన దాతలను అభినందించి, జీపీ ట్రాక్టర్‌ను ప్రారంభించారు. మానకొండూర్‌లో పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే రసమయి బియ్యంతోపాటు నిత్యావసరాలను అందించారు. అనంతరం పద్మావతి కల్యాణ మండపంలో ఆసరా పెన్షన్ కౌంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమాల్లో సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, ట్రైనీ ఐపీఎస్ నితికాపంత్, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, తాసిల్దార్లు ఎంపీపీ వనిత, ఎంపీటీసీలు కవిత, సులోచన, మమత, సర్పంచ్ నీలిమ, సొసైటీ చైర్మన్లు స్వామిరెడ్డి, గోవింద రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఇంటి స్థలం పత్రాలతో రచ్చపల్లి నిర్వాసితులు, జడ్పీ చైర్మన్ పుట్ట మధు

## సీఎం చొరవతోనే 'రచ్చపల్లి' కల సాకారం

- జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్
- 578 మందికి ₹43.98కోట్ల పరిహారం.. ఒక్కొక్కరికి రెండు గుంటల ఇంటి స్థలం పత్రాల పంపిణీ

**మంథని రూరల్:** ఓసీపీ-2 విస్తరణలో సర్వం కోల్పోయిన రచ్చపల్లి నిర్వాసితుల దశాబ్దాల కల సీఎం కేసీఆర్ చొరవతోనే సాకారమైందని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పేర్కొన్నారు. బుధవారం రచ్చపల్లిలో 578 మంది నిర్వాసితులకు ఒక్కొక్కరికి ₹7.61లక్షల చొప్పున ₹43కోట్ల 98లక్షల 58వేల పరిహారంతోపాటు రెండు గుంటల ఇంటి స్థల పత్రాలను పంపిణీ చేసి, మాట్లాడారు. 2004లో ప్రారంభమైన రచ్చపల్లి నిర్వాసితుల సమస్యను అప్పటి ప్రభుత్వం గాని, స్థానిక ఎమ్మెల్యే గాని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు సమస్య పరిష్కారం కావడంతో తానే ఇప్పించానని శ్రీధర్‌బాబు చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. నిర్వాసితులు నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఎమ్మెల్యేగా, విప్‌గా, మంత్రిగా ఉండి కూడా ఆయన ఏం చేయలేకపోయారని మండిపడ్డారు. తాను 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టానని, మంత్రుల సహకారం, సీఎం కేసీఆర్ చొరవతోనే నిర్వాసితులకు మెరుగైన పరిహారంతోపాటు 75గజాల ఇంటి స్థల స్కీంను రెండు గుంటలకు పెంచి ఇప్పించినట్లు వివరించారు. ఏళ్ల నాటి కల నెరవేర్చినందుకు ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్‌ను నిర్వాసితులు సన్మానించారు. ఇక్కడ సర్పంచ్ కనవేన శ్రీనివాస్, ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలత, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపీటీసీ మిరియాల ప్రసాద్‌రావు, ఉప సర్పంచ్ గుర్రం సదానందం, వార్డు సభ్యులు ఉన్నారు.

# నేతన్నకు యజమానుల భరోసా

- 1000మంది కార్మికులకు ₹1500 చొప్పున ₹15లక్షలు అందజేస్తామని హామీ
- టెక్స్‌టైల్‌పార్క్ యూనిట్ యజమానుల అసోసియేషన్ ప్రకటన


కలెక్టర్, చేనేత జౌళిశాఖ ఏడీ అశోక్‌రావుతో సమావేశమైన సభ్యులు

**సిరిసిల్ల రూరల్:** సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ యజమానులు పెద్దమనసును చాటుకున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఉపాధిలేక ఇంటికే పరిమితమైన నేతన్నలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్ పార్క్‌లో సుమారు 1000 మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. వారికి అండగా నిలవాలని కోరుతూ టెక్స్‌టైల్ పార్క్ యూనిట్ యాజమానుల అసోసియేషన్ సభ్యులతో కలెక్టర్ కృష్ణభాస్కర్, చేనేత జౌళిశాఖ ఏడీ అశోక్‌రావు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్మికులను ఆదుకోవాలని సూచించారు. యజమానులకు ఏవైనా ఇబ్బందులుంటే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించింది. కార్మికులకు అండగా ఉంటామని, పార్క్‌లోని 1000మంది కార్మికులకు ఒక్కొక్కరికి ₹1500ల చొప్పున ₹15లక్షలు అందిస్తామని ప్రకటించింది. ప్రతి మ్యాక్స్ సంఘం, ఎస్ఎస్ఐ యూనిట్ తరపున నిధులను సమీకరించి కార్మికులందరికీ నిత్యావసర సరుకులు అందజేస్తామని హామీ ఇచ్చింది. దీంతో అసోసియేషన్‌కు కలెక్టర్ కృష్ణభాస్కర్ కృతజ్ఞతలు తెలపడంతో పాటు అభినందించారు. సమావేశంలో టెక్స్‌టైల్ పార్క్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ అన్నల్‌దాస్ అనిల్, సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు దూస భూమయ్య, ఆడెపు భాస్కర్, చిమ్మని ప్రకాశ్, ఎల్లండి శంకర్, వేముల శ్రీనివాస్, అంకారపు కిరణ్, లక్ష్మీనారాయణ, బొద్దుల వేణు తదితరులు పాల్గొన్నారు.



## కాళ్లు కడిగి.. సన్మానం చేసి..

మల్లాపూర్‌లో టీఆర్ఎస్ నాయకుడు క్యాతం జీవన్‌రెడ్డి బుధవారం పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి, సన్మానం చేశారు. వైద్య సిబ్బంది, పోలీసులకు గ్లౌజులు, మాస్క్‌లు, శానిటైజర్లను అందించారు. అలాగే గ్రామంలోని సుమారు 300 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. - మల్లాపూర్







## సీఎం సహాయనిధికి విరాళాలు ఇచ్చిన వారి వివరాలు


మంత్రి గంగులకు చెక్కు అందజేస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్

| | |
|---|---|
| రాంమోహన్‌రావు (ప్రియా మిల్క్ యజమాని) | ₹5 లక్షలు |
| ఎం సాగర్ (టీవీ నటుడు) | ₹5 లక్షలు |
| అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి | ₹4,44,444 |
| డాక్టర్ నాగరమేష్ (వేములవాడలోని పద్మావతి వైద్యశాల) | ₹లక్ష |
| ఎంవీ శేఖర్ (అరోరా కళాశాల) | ₹50వేలు |
| డాక్టర్ సంజీవ్ (కరీంనగర్‌లోని లోటస్ హాస్పిటల్) | ₹30 వేలు |
| వెంగళ కాంతవ్వ (సిరిసిల్ల నెహ్రూనగర్) | ₹12వేలు |
| చిన్నారి వెంగళ అక్షర, సిరిసిల్ల | ₹వెయ్యి |


మంత్రి కేటీఆర్‌కు చెక్కు అందజేస్తున్న బుల్లితెర నటుడు సాగర్


₹లక్ష చెక్కును కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు అందజేస్తున్న డాక్టర్ నాగరమేశ్


కిడ్డీ బ్యాంకు నుంచి రూ. వెయ్యి ఇచ్చిన అక్షర


కలెక్టర్ శశాంకకు చెక్కు అందిస్తున్న ప్రియామిల్క్ ప్రతినిధులు


మేయర్ సునీల్‌రావుకు చెక్కును అందిస్తున్న లోటస్ దవాఖాన వైద్యుడు సంజీవ్



గర్భిణిని దవాఖానకు తరలిస్తున్న పోలీసులు, జన్మించిన బాబు

## ఖాకీల మానవత్వం..మహిళ ప్రసవం..

**కరీంనగర్ క్రైం/ కరీంనగర్ హెల్త్ :** కరోనా నేపథ్యంలో అలుపెరగకుండా శ్రమిస్తున్న పోలీసులు, విపత్కర పరిస్థితుల్లోనూ మానవత్వం చాటుతున్నారు. కరీంనగర్ కమిషనరేట్ వీఆర్‌లో ఉన్న ఎస్ఐ కరుణాకర్ లాక్‌డౌన్‌లో భాగంగా బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో నగరంలోని అజ్మత్‌పురలో సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఓ ముస్లిం మహిళ పురిటి నొప్పులతో తల్లడిల్లగా, ఆమెను దవాఖానకు తరలించే వాహనం కోసం బంధువులు రోడ్డుపైకి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ, వెంటనే తమ పెట్రోలింగ్ వాహనంలో ఎంసీహెచ్‌కు తరలించారు. సకాలంలో దవాఖానకు తీసుకెళ్లడంతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐ కరుణాకర్, కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డులు సత్తయ్య, ఖలీలను సీపీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

## అష్ట దిగ్బంధం

■ హుజూరాబాద్ కరోనా ప్రభావిత ప్రాంతాల్లో పకడ్బందీ చర్యలు ■ ఇంటింటికీ వైద్య పరీక్షలు



హుజూరాబాద్‌టౌన్: కరోనా ప్రభావిత ప్రాంతాల్లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

**హుజూరాబాద్, నమస్తే తెలంగాణ/హుజూరాబాద్ టౌన్:** హుజూరాబాద్‌లోని కరోనా ప్రభావిత ప్రాంతాలను అష్టదిగ్బంధం చేశారు. 3వ వార్డు కుమ్మరివాడ, ప్రతాప్‌వాడ, 14వ వార్డు సిద్దార్థనగర్, అహల్యనగర్, 16వ వార్డు మామిండ్లవాడ, ఎల్ఐసీ ఏరియా, గ్యాస్ గోదాం ఏరియా, 2వ వార్డు ఉర్దూభవన్ స్కూల్ ఏరియా,19వ వార్డు పోశమ్మవాడ, 20వ వార్డు సాయిబాబాగుడి, శివాలయం ఏరియా, 21వ వార్డు సీఎస్ఐ చర్చ్ ఏరియా, ఓల్డ్ టెలిఫోన్ ఏరియా, 23వ వార్డు బుడ్గజంగాలకాలనీ, పద్మనగర్, 22వ వార్డు కాకతీయకాలనీల్లో, 25వ వార్డు విద్యానగర్, సైదాపూర్‌రోడ్డు, వాటర్‌ట్యాంక్ ఏరియా, 29వ వార్డు గాంధీనగర్‌లో పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. సిబ్బంది ఇంటింటికీ సరుకులు అందజేస్తున్నారు. మంగళవారం కలెక్టర్ శాశంక, సీపీ కమలాసన్‌రెడ్డి పర్యటించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వేలెన్స్ బృందాలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశాయి. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని నమోదు చేస్తున్నాయి. అనుమాతులను గుర్తించి క్వారంటైన్‌కు తరలించారు. పారిశుద్ధ్య సిబ్బంది వాడవాడలా హైపోక్లోరైట్‌ను పిచికారీ చేశారు.

## వైద్యులూ.. జాగ్రత్త

- మనం ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలను కాపాడగలం
- కరోనా బాధితులకు చికిత్సలో అప్రమత్తంగా ఉండాలి
- డాక్టర్లు స్వీయ ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టిపెట్టాలి
- గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** 'వైద్యో నారాయణో హరి' అన్నారు పెద్దలు.. మరి అలాంటి దేవుడి ఆరోగ్యమే సంకటంలో పడితే జరిగే పరిణామాలను ఊహించగలమా? వైద్యులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రోగుల ప్రాణాలను కాపాడగలుగుతారు. ప్రస్తుతం స్లో పాయిజన్‌లా విస్తరిస్తూ ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ప్రాణాలను హరిస్తున్న కొవిడ్-19కు ఎవరూ అతీతులు కాదు. ప్రజల ప్రాణాలను కాపాడే క్రమంలో మృత్యువుకు ఎదురొడ్డి పోరాడుతున్న వైద్యులు సైతం కరోనా కాటుకు బలవుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన ఓ వైద్యుడు కరోనా బారినపడి మృత్యువాత పడ్డారు. అనేక దేశాల్లోనూ కరోనా బాధితులకు వైద్యం అందించిన ఎందరో డాక్టర్లు ఆ మహమ్మారికి బలయ్యారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వైద్యులు చాలా జాగ్రతగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ప్రాణాలు కాపాడే వైద్యుల ఆరోగ్యం ఆపాయంలో పడిపోతే జరిగే నష్టం ఊహించలేమని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. 'వైద్య వృత్తి అంటేనే కత్తిమీద సాములాంటిది. క్లిష్టమైన పరిస్థితుల్లో వృత్తిపరంగా పలురకాల ఒత్తిళ్లు, ఆందోళనలు సహజం. అలాంటి సమయంలో స్వీయ ఆరోగ్యంపై దృష్టి పెట్టే ఆలోచన రాకపోవడం సహజం. కానీ తప్పదు. మనం ఆరోగ్యంగా ఉంటేనే రోగుల ప్రాణాలను రక్షించగలుగుతాం. డాక్టర్ తన కోసం కాదు ప్రజల కోసం బతకాలి' అని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. వైద్యులు తమ ఆరోగ్యంపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు.

### పర్సనల్ ప్రొటెక్షన్ లేకుండా వార్డులోకి వెళ్లొద్దు

కరోనా బాధితులకు వైద్యమందిస్తున్న డాక్టర్లు జాగ్రత్తగా ఉండాలి. రక్షణ చర్యలు తప్పనిసరి. ప్రస్తుతం గాంధీ దవాఖానలో 350 మంది వైద్యులు కొవిడ్-19 బాధితులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఐసీయూ, పర్యవేక్షణ వార్డులో బాధితులకు, అనుమానితులకు వైద్యం అందిస్తున్నాం. డాక్టర్లందరికీ పీపీసీ (పర్సనల్ ప్రొటెక్షన్ కిట్స్)తోపాటు ఎన్- 95 మాస్కులు, గ్లౌజ్‌లు తదితర రక్షణ కవచాలను ప్రభుత్వం సమకూర్చింది. వీటిని ధరించకుండా ఏ ఒక్క డాక్టర్ కూడా కరోనా వార్డుల్లోకి ప్రవేశించకూడదు.

### గ్లౌజ్ ధరించి ముఖాన్ని తాకొద్దు

సాధారణంగా చికిత్స చేస్తున్న సమయంలో డాక్టర్లు కొంత టెన్షన్‌లో ఉంటారు. అలాంటి సమయంలో స్వీయ రక్షణ చర్యలపై సహజంగా ఆలోచన ఉండదు. కానీ అది మొదటికే మోసం. వైద్యులు గ్లౌజ్ ధరించిన చేతులతో తమ ముఖానిగానీ, ఏ శరీర భాగాన్ని తాకరాదు. ఎందుకంటే బాధితుడి నుంచి వైరస్ గ్లౌజ్‌లకు అంటుకొని ఉంటే అదే గ్లౌజ్ ధరించిన చేతులతో వైద్యులు తమ ముఖాన్ని తాకడం వల్ల వారికి కూడా వైరస్ సోకే ప్రమాదం ఉన్నది

### బాధితులతో దూరంగా ఉండి మాట్లాడాలి

వైరస్ సోకిన బాధితులతో దూరంగా ఉండాలి. వారితో మాట్లాడే సమయంలో నిర్ణీత దూరం పాటించాలి. చికిత్స సమయంలో చేతికి గ్లౌజ్‌లు, ముఖానికి మాస్కు, పర్సనల్ ప్రొటెక్షన్ కిట్, తలకు సర్జికల్ క్యాప్ ధరించాలి.

### ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

అత్యవసర సమయంలో వైద్యులు 24 గంటలు పనిచేస్తున్నారు. దీని వల్ల ఏర్పడే టెన్షన్ ఆరోగ్యంపై కొంత ప్రభావం చూపుతుంది. వీలు దొరికినప్పుడు తప్పకుండా విశ్రాంతి తీసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే పనిలోపడి నిర్లక్ష్యం చేయకూడదు. 'మనం వైద్యులం, మనకేమయితది' అనే ధీమా వద్దు. ఎంత పని ఒత్తిడి ఉన్నా మన ఆరోగ్యం కూడా ముఖ్యమే. డాక్టర్ అనేవాడు ప్రజల కోసం బతకాలి. ఎందుకంటే అతడు ఆరోగ్యంగా ఉంటేనే వంద మందిని బతికిస్తాడు.

## సహృదయులు.. ఎనలేని సేవలు

■ పేదలకు అండగా దాతలు

లాక్‌డౌన్ నేపథ్యంలోనే అభాగ్యులు.. వలస కార్మికులు.. యాచకులను సహృదయులు అక్కున చేర్చకుంటున్నారు. వారికి తమశక్తి కొలది ఇతోధికంగా సాయం చేస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. పలువురు నిత్యావసర సరుకులను, బియ్యాన్ని, కూరగాయలను అందజేస్తూ అండగా నిలబడుతున్నారు.



మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప హరిశంకర్



56వ డివిజన్‌లో మున్సిపల్ కార్మికులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజేందర్‌రావు



ఇల్లంతకుంట: వెల్జీపూర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

### కరీంనగర్ జిల్లా..

**కార్పొరేషన్, నమస్తేతెలంగాణ/ కరీంనగర్‌హెల్త్/జమ్మికుంట/ జమ్మికుంట రూరల్/ సైదాపూర్/తిమ్మాపూర్ రూరల్/శంకరపట్నం/ గన్నేరువరం/ కరీంనగర్ రూరల్/చిగురుమామిడి:** జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లోని సిద్దార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో 20 మంది పారిశుధ్య కార్మికులకు డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి చేతుల మీదుగా నిత్యావసరాలను పంపిణీ చేశారు. డైరెక్టర్లు శ్రీపాల్‌రెడ్డి, జగత్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే పెయింటింగ్ అసోసియేషన్ సహకారంతో కార్మికులకు సరుకులు అందజేశారు. పోలీసులకు కెనరా బ్యాంకు (మంకమ్మతోట) ఉద్యోగులు భోజనం అందించారు. 'మేమున్నాం.. మీకోసం' సంస్థ అధ్యక్షుడు నగునూరి రాజేందర్ వరుసగా 16 రోజు మున్సిపల్, వైద్య సిబ్బందికి నిత్యావసరాలు, ఆహారం అందజేశారు. సంస్థ సభ్యుడు చిట్టిమల్ల ప్రశాంత్ ఉన్నారు. కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి అనాథాశ్రమం, స్వధార్ హోంకు ఎమ్మెస్సో కొత్త జయపాల్‌రెడ్డి నిత్యావసరాలను అందజేశారు. మైత్రి చానల్ డైరెక్టర్ సుజన్‌రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం జమ్మికుంట మండలాధ్యక్షుడు గర్రెపల్లి రాజమౌళి హమాలీలు, కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆరెపల్లిలో సర్పంచ్ పాపయ్య గ్రామస్తులకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. కొత్తపల్లి, రామన్నపల్లి, శాయంపేటలోని 210 మంది వలస కూలీలకు గరుడ యూత్ సభ్యులు వంట సామగ్రి అందజేశారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు తన సొంత డబ్బు (₹2.5లక్షలు)తో సుమారు 650 కుటుంబాలకు నూనె, గోధుమ పిండి, పప్పుతో పాటు కూరగాయలను ఇంటింటికీ తిరిగి అందజేశారు. సర్పంచ్ రావుల రమేశ్ సైతం సొంత ఖర్చులతో 250 మందికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కేశవపట్నంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు కూరగాయలు పంచారు. అలాగే గద్దపాకలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు సమ్మిరెడ్డి, మొలంగూర్ శివారులోని రైస్‌మిల్లుల్లో బీజేపీ నాయకుడు బాల్‌రెడ్డి వలస కార్మికులకు నిత్యావసరాలు అందించారు. గన్నేరువరంతోపాటు పలు గ్రామాల్లో 50మంది నిరుపేద ఆటో డ్రైవర్లకు గంగుల కమలాకర్ యువసేన జిల్లా అధ్యక్షుడు తోట కోటేశ్వర్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను తిమ్మాపూర్ సీఐ మహేశ్‌గౌడ్, తాసిల్దార్ రమేశ్, ఎస్ఐ తిరుపతి చేతులమీదుగా అందించారు. స్నేహ బంధం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు పుష్పాభిషేకం చేసి సన్మానించారు. అనంతరం కార్మికులకు నిత్యావసరాలను రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్ఐ ఎల్లాగౌడ్, మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు అందించారు. వలస కూలీలకు మున్సిపల్ ఉపాధ్యక్షురాలు బండ రాధ బియ్యం పంపిణీ చేశారు. తీగలగుట్టపల్లిలో పారిశుధ్య కార్మికులకు మాజీ సర్పంచ్ కిష్టయ్య, దాసరి సాగర్ నిత్యావసరాలు అందించారు. రామంచలో వలస కార్మికులకు పీఏసీఎస్ డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి నగదు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఇందుర్తిలో మీసేవ నిర్వాహకుడు గాదె రఘునాథరెడ్డి పేదలకు జడ్పీటీసీ రవీందర్, ఎస్ఐ మధుకర్‌రెడ్డి చేతులమీదుగా సరుకులు అందజేశారు. ముదిమాణిక్యంలో దళితశక్తి ప్రోగ్రాం బాధ్యులు పేదలకు బియ్యం పంపిణీ చేశారు.

### రాజన్న సిరిసిల్ల జిల్లా..

**వేములవాడ, నమస్తేతెలంగాణ/సిరిసిల్ల రూరల్ / సిరిసిల్ల టౌన్/ ఎల్లారెడ్డిపేట/ కోనరావుపేట/ ఇల్లంతకుంట/చందుర్తి :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు శివారులో అపెరల్‌పార్క్‌లోని వలస కార్మికులకు ₹500 నగదును సిరిసిల్ల తాసిల్దార్ అంజన్న, సీఐ వెంకటనర్సయ్య, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ అందజేశారు. చంద్రంపేటలో 50 నిరుపేద కుటుంబాలకు దాత గంప వెంకటేశం సహకారంతో కౌన్సిలర్ రాజిరెడ్డి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరుకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి గడ్డం వెంకటరెడ్డి 500 కుటుంబాలకు అందించిన కూరగాయలను కౌన్సిలర్లు సత్యనారాయణ, ఆకుల చిన్న అందజేశారు. సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దూడం శంకర్ తన వస్త్ర పరిశ్రమలో పని చేసే 21మంది కార్మికులకు తలా ₹500తో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సిరిసిల్ల ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలోఅంబేద్కర్‌నగర్‌లో కూలీలకు, సాహితీ స్కూల్ పూర్వ విద్యార్థులు చీకోటి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో 30మందికి, చేయూత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేశారు. చిన్నలింగాపూర్‌లో ఎంపీటీసీ బైరినేని రాము 20 కుటుంబాలకు బియ్యం, సరుకులు అందిస్తున్నారు. తంగళ్లపల్లి జీపీ సిబ్బందికి సర్పంచ్ అనిత, ఉపసర్పంచ్ తిరుపతి మాస్కులను అందజేశారు. వేములవాడలో 330మంది ఆటో కార్మికులకు వేములవాడ ఆటో యూనియన్ నాయకులు అండగా నిలిచారు. దాతలు అందించిన విరాళాలతో సరుకులను కొనుగోలు చేసి వేములవాడ మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవిరాజు చేతుల మీదుగా అందించారు. సెస్ డైరెక్టర్ రాజు తనవంతు సాయంగా ₹5వేల విరాళం అందజేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు శేఖర్, శంకర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆదేశాల మేరకు చందుర్తి మండలం టీఆర్ఎస్ నాయకులు లింగంపేట, తిమ్మాపూర్, జోగాపూర్ గ్రామాల్లోని ఒడ్డెర కాలనీ, గంగిరెద్దుల కాలనీల్లో నిరుపేదలకు బియ్యం, నిత్యావసరాలు అందించారు. ఇక్కడ కేడీసీసీ డైరెక్టర్ కిషన్‌రావు, చార్వాక ట్రస్ట్ చైర్మన్ అశోక్, మ్యాకల ఎల్లయ్య పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేటలో వలస కూలీలకు విక్టరీ యూత్ సభ్యులు అన్నదానం చేశారు. బొప్పాపూర్‌లో చెలిమి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు 11 పేద కుటుంబాలకు, గొల్లపల్లికి చెందిన చేయూత యూత్ అసోషియేషన్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, మనోహర్, తిరుపతిరెడ్డి, అతని మిత్రబృందం 20 నిరుపేద కుటుంబాలకు, అల్మాస్‌పూర్‌కు పేదలకు 20మంది యువకులు నిత్యావసర సరుకులను దానం చేశారు. రాజన్నపేటలో అంగన్‌వాడీ టీచర్ బత్తుల రేణుక రెండు పేద కుటుంబాలకు నిత్యావసర సరకులు, 25 కిలోల బియ్యం, ఒక్కొక్కరికి ₹500 చొప్పున. ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్‌లోని నిరుపేదలకు, వలస కూలీలకు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యంతోపాటు ₹500లను జడ్పీ ఉపాధ్యక్షుడు సిద్ధం వేణు అందజేశారు. తాళ్లపెల్లిలో వలస కూలీలకు రెడ్డి సంఘం సభ్యులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కోనరావుపేటలో ఉపసర్పంచ్ దండు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ సూర్య ట్రేడర్స్ యాజమాని మధుకర్‌రెడ్డి దివ్యాంగుడైన ముత్తయ్యకు 25కిలోల బియ్యంతో పాటు ₹వెయ్యి నగదును అందజేశారు. బావుసాయిపేటలోని 150 వలస కార్మికులకు ఎంపీటీసీ యాస్మిన్‌పాషా అన్నదానం చేయగా, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్, తాసిల్దార్ రమేశ్‌బాబు నిత్యావసరాలను అందజేశారు. నిజామాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గోపి 60మంది వలస కార్మికులకు వైస్ఎంపీపీ వంగపల్లి సుమలత, సర్పంచ్ అరుణ నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.



తిమ్మాపూర్ రూరల్: యువతికి కూరగాయలు అందజేస్తున్న శ్రీనివాస్‌రావు



వేములవాడ: ఆటో కార్మికులకు సరుకులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవి



చిగురుమామిడి: ముదిమాణిక్యంలో సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు



కార్మికుడికి చల్ల ప్యాకెట్‌ను అందిస్తున్న మేయర్

## సేవలు ప్రశంసనీయం: మేయర్

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కనిపించని శత్రువు కరోనాతో అలుపెరగని పోరాటం చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని మేయర్ సునీల్‌రావు పేర్కొన్నారు. నగరంలోని 33వ డివిజన్‌లో కరీంనగర్ డెయిరీ సహకారంతో పారిశుధ్య కార్మికులకు చల్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. 25వ డివిజన్‌లో పేదలకు కూరగాయలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బందికి ₹10లక్షల విలువైన చల్ల ప్యాకెట్లను అందించేందుకు కరీంనగర్ డైయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఇక్కడ కార్పొరేటర్ ఎడ్ల సరిత అశోక్ ఉన్నారు.

## డీర్ పార్కులో శానిటేషన్..



డీర్ పార్క్‌లో శానిటేషన్ చేస్తున్న సిబ్బంది

కరోనా మహమ్మారి మనుషులనే కాదు జంతుజాలాన్ని సైతం వెంటాడుతున్నది. అమెరికాలోని ఓ పులి ఈ వైరస్ బారిన పడిందని వార్తలు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మూగజీవాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు బల్దియా యంత్రాంగం నగర శివారులోని డీర్ పార్క్‌లో శానిటేషన్ చేపట్టింది. పార్కు ఆవరణలో రసాయనాలను పిచికారీ చేయించింది. డీఎఫ్‌వో ఎస్‌జే ఆశా, కరీంనగర్ రేంజ్ ఆఫీసర్ టీ శ్రీనివాస్, డీర్‌పార్క్ డీఆర్‌వోలు పీ చంద్రమౌళి, మౌనిక, ఎఫ్‌బీవో స్వాతి పర్యవేక్షించారు.

- కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ



కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## పారిశుధ్య కార్మికులకు సర్కారు అండ

■ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**చొప్పదండి, నమస్తే తెలంగాణ:** పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. చొప్పదండికి చెందిన వ్యాపారి మంద అంజయ్య 30మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు తలా ₹300 చొప్పున దండను మెడలో వేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి, ప్రోత్సాహకం అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఇక్కడ మున్సిపల్ అధ్యక్షురాలు గుర్రం నీరజ, ఉపాధ్యక్షురాలు ఇప్పనపల్లి విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, కమిషనర్ స్వాతి ఉన్నారు.

## సౌకర్యాలు కల్పించాలి : అదనపు కలెక్టర్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం యాసంగిలో పంట ఉత్పత్తుల కొనుగోలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పంట ఉత్పత్తులను తీసుకువచ్చేటపుడు సామాజిక దూరం పాటించాలని కోరారు. జేడీఏ శ్రీధర్, జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, డీఆర్డీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పద్మావతి పాల్గొన్నారు.

## ₹ కోట్ల ఆస్తిపై నజర్

- మాదంటే మాదంటూ ఇరువర్గాల ఫిర్యాదులు
- భూ అక్రమణ చట్టం కింద కేసు నమోదు ■ పోలీసుల సీరియస్

**(కరీంనగర్ ప్రధానప్రతినిధి,నమస్తే తెలంగాణ)**

బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కరీంనగర్ బైపాస్ రోడ్డును అనుకొని ఉన్న రూ. కోట్లు విలువజేసే అస్తి ప్రస్తుతం వివాదానికి కేంద్రబిందువుగా మారుతున్నది. ఆ భూమి మాదంటే మా దంటూ ఇరువర్గాలు కరీంనగర రూరల్ పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ మేరకు ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. ఈ విషయాన్ని మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. అంతేకాదు, లాక్‌డౌన్ ఉన్న నేపథ్యంలో సదరు స్థలం వద్ద కార్మికులతో పనులు చేయించిన విషయంతో పాటు గా.. ఆ భూమి వివాదం తెరవెనక పలువురి మాఫియా హస్తం ఉందన్న ఫిర్యాదులు వెల్లువెత్తుండడంతో పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

### పరస్పర ఫిర్యాదులు..

బొమ్మకల్ శివారులోని సర్వే నంబర్ 724/డీలోని 4.20ఎకరాల భూమిని కొంతమంది దౌర్జన్యంగా అక్రమిస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 3న మాజీ ఎమ్మెల్యే నలుమాచు కొండయ్య కూతురు అంజని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే నలుమాచు కొండయ్యకు బొమ్మకల్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 724/డిలో 4.20 ఎకరాల భూమి ఉందని, 2009లో తమ తండ్రి కొండయ్య మరణించిన తదుపరి కూతుళ్లమైన తాను, తన చెల్లి జ్యోతి కబ్జాలో భూమి ఉన్నదని వివరించింది. అయితే ఆ సర్వే నంబర్‌కు అనుకొని ఉన్న మరో సర్వే నంబర్‌కు చెందిన కొందరు తమ భూమిని ఆక్రమించుకుంటున్నారంటూ ఫిర్యాదు చేశారు. సదరు భూ కబ్జాదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు పోలీసులు కొంత మందిపై కేసు నమోదు చేశారు. ఆ తదుపరి సదరు ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కూతురు ఇచ్చిన ఫిర్యాదు పూర్తిగా అవాస్తవమని, సదరు వ్యక్తులు కొంత మందితో కలిసి తమ భూమినే అక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ మహ్మద్ అబ్దుల్ ఫజల్ జుల్ఫుకర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని 723 సర్వే నంబర్‌లోని ఆరెకరాలు, 724-సీ సర్వే నంబర్‌లోని ఎకరం భూమి మొత్తం ఏడెకరాల భూమి 1975 నుంచి తమ కుటుంబం ఆధీనంలో ఉందని జుల్ఫుకర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ప్రస్తుతం యాకుబ్ ఖాన్, దావూద్ ఖాన్, మహబూబ్‌ఖాన్‌ల పేరిట ఉన్న ఆ ఏడెకరాల భూమికి సంబంధించి పంటలు పండించుకోవడంతోపాటు రైతుబంధు, ప్రధాని కిసాన్ యోజన కింద ఆర్థిక సహాయం పొందుతున్నట్లుగా వివరించాడు. ఆ స్థలానికి సంబంధించి 1975లోనే కోర్టు డిక్రీ ఇచ్చిందని అప్పటి నుంచి 45 ఏళ్లుగా తామే ఆ భూమి కబ్జాలో ఉన్నామని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే లాక్‌డౌన్ ఉన్న నేపథ్యంలో కొంత మంది వ్యక్తులు ఆ భూమిని అక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. ఈ వ్యవహారం వెనుక భూమాఫియా దాగి ఉంటూ ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేశారు. జుల్ఫుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కరీంనగర్ రూరల్ సీఐ తుల శ్రీనివాసరావు ఐదుగురిపై భూ అక్రమణ చట్టం 1982 సెక్షన్ 5 (ఎ)తో పాటుగా ఐపీసీ 447, 427, 506, రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అంతకు ముందు సోమవారం మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఈనెల 3న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిదిపై కేసు నమోదు చేసినట్లుగా సీఐ తెలిపారు. ఈ వ్యవహారంలో లోతుగా విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఆ భూమి విషయంలో తేలాల్సింది మాఫియా ఎవరన్నది.. గత కొంత కాలంగా భూ మాఫియాపై సీపీ కమలాసన్‌రెడ్డి ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసు లోతుగా విచారణ చేస్తే వాస్తవాలు బయట పడే అవకాశాలున్నాయి.

## సర్వేపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్ శశాంక

**కరీంనగర్ హెల్త్:** నగరంలోని కరోనా ప్రభావిత ప్రాంతం ఉస్మాన్‌పురలో చేపట్టిన డోర్ టూ డోర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వైద్యబృందాలకు కలెక్టర్ శశాంక సూచించారు. బుధవారం ఐఎంఏ సహకారంతో వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలతో కూడిన 30 వైద్య బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఉస్మాన్‌పురలో పర్యటించి సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానితులను గుర్తించి క్వారంటైన్ సెంటర్లకు తరలిస్తామని చెప్పారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు.

## 68మంది హోం క్వారంటైన్‌కు..

**కరీంనగర్‌హెల్త్:** చల్మెడ క్వారంటైన్ సెంటర్‌లో ఉన్న 32 మంది, ఎస్‌యూ క్వారంటైన్ సెంటర్‌లో ఉన్న 36 మంది మొత్తం 68మందికి 14 రోజుల క్వారంటైన్ బుధవారంతో ముగిసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత తెలిపారు. వీరిని పరీక్షల అనంతరం కరోనా లక్షణాలు లేకపోవడంతో మరో 14రోజుల పాటు హోం క్వారంటైన్‌లో ఉంచుతామన్నారు. అలాగే ఈనెల 9న ముకరంపురలో వైద్యులు, ఏఎన్ఎం, ఆశాలతో కూడిన 19 వైద్య బృందాలు నిర్వహించే ఫీవర్ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

## నిరాడంబరంగా హనుమాన్ చిన్న జయంతి

**మల్యాల:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలను నిరాడంబరంగా నిర్వహించారు. ప్రధానంగా కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆలయ స్థానాచార్యులు జితేంద్రప్రసాద్, ఉప ప్రధానార్చకులు చిరంజీవి నేతృత్వంలో అభిషేకాలు నిర్వహించారు. వేములవాడ మండలం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయంలోనూ జయంతి పూజలు చేశారు. రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీభీమేశ్వరాలయంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు హనుమంతునికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED
BUSINESS OPPRTUNITY

★ఇంట్లోనే ఉండి తక్కువ పెట్టుబడితో డబ్బులు సంపాదించుకునే సౌకర్యము ఈ సదావకాశాన్ని వినియోగించుకోండి.
Ph: 9381157359
NT-252880

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం.
4 లైన్ల ప్రకటన కేవలం 150/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 40/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
ప్రకటనల విభాగం
9182 777 571
9182 777 194

| సెన్సెక్ | నిఫ్టీ |
|---|---|
| 29,894 ▼ 173 | 8,749 ▼ 43 |

# వాణిజ్య

**వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

**గుడ్ల ధరలు (వందకు)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 360.00 | వరంగల్ | 363.00 |
| మెదక్ | 360.00 | కరీంనగర్ | 363.00 |
| రంగారెడ్డి | 360.00 | డజన్ ధర | 54.00 |

# రాష్ట్రాలకు రూ.14 వేల కోట్లు

## జీఎస్టీ పరిహారం విడుదల చేసిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కరోనా వైరస్‌తో నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్ల వల్ల ఆదాయాన్ని కోల్పోతున్న రాష్ట్రాలకు రెండు విడుతలుగా రూ.34 వేల కోట్లను నిధులను విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ..రెండో విడుతలో భాగంగా మరో రూ.14,103 కోట్లను విడుదల చేసింది. దీంతో మొత్తం రూ.34,053 కోట్లు విడుదల చేసినట్లు అయింది. అక్టోబర్-నవంబర్ మధ్యకాలానికిగాను జీఎస్టీ పరిహారం సెస్ పెండింగ్‌లో ఉన్నది. తొలి విడుత ఫిబ్రవరి 17న రూ.19,950 కోట్లను విడుదల చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. అలాగే డిసెంబర్, జనవరి నెలకుగాను పెండింగ్‌లో ఉన్న బకాయిలను కూడా త్వరలో విడుదల చేయనున్నట్లు ఆ వర్గాలు సూచనప్రాయంగా తెలిపాయి. ఇప్పటి వరకు రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జీఎస్టీ పరిహారం సెస్ కింద కేంద్రం రూ.1.35 లక్షల కోట్లను విడుదల చేసింది. జీఎస్టీ చట్టం ప్రకారం జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 1, 2017 నుంచి తొలి ఐదేండ్లపాటు రాష్ట్రాలకు పరిహారం చెల్లించడానికి అంగీకరించింది.

# ట్యాక్స్ పేయర్స్‌కు ఊరట

## రూ.5 లక్షల వరకున్న ట్యాక్స్ రిఫండ్స్ విడుదల

### ఐటీ శాఖ నిర్ణయం • 14 లక్షల మందికి లబ్ధి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కష్ట కాలంలో పన్ను చెల్లింపుదారులకు ఆదాయం పన్ను (ఐటీ) శాఖ గొప్ప ఊరటనిచ్చింది. రూ.5 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్న అన్ని ట్యాక్స్ రిఫండ్స్‌ను తక్షణమే విడుదల చేస్తామని బుధవారం ప్రకటించింది. దీంతో సుమారు 14 లక్షల ట్యాక్స్‌పేయర్స్‌కు ఉపశమనం లభించనున్నది. కరోనా వైరస్ విజృంభణ, లాక్‌డౌన్‌ల మధ్య ఐటీ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నది. అలాగే వివిధ వ్యాపార సంస్థలకు సంబంధించిన రూ.18 వేల కోట్ల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), కస్టమ్స్ రిఫండ్స్ బకాయిలనూ క్లియర్ చేస్తామని ఓ అధికారిక ప్రకటనలో పేర్కొన్నది. దీనివల్ల దాదాపు లక్ష వ్యాపార సంస్థలకు ప్రయోజనం చేకూరనున్నది. ఇందులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలూ ఉన్నాయి. కరోనా కట్టడికి లాక్‌డౌన్ అమలవుతుండటంతో వ్యాపార కార్యకలాపాలు, ఉత్పత్తి స్తంభించిపోయాయి. దీంతో అటు వ్యక్తిగత, ఇటు సంస్థాగతంగా అందరికీ ఆదాయం గుబులు పట్టుకున్నది. ఈ క్రమంలో ఐటీ శాఖ పెండింగ్ రిఫండ్స్ విడుదల చేస్తామని ప్రకటించి పన్ను చెల్లింపుదారులకు కొంతలోకొంత మేలు చేసింది.

## గ్రోఫర్స్‌లో 5 వేల ఉద్యోగాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఆన్‌లైన్ ద్వారా ఆహార పదార్థాలు అందించే గ్రోఫర్స్.. మరో 5 వేల మంది సిబ్బందిని నియమించుకోవడానికి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నేపథ్యంలో సరుకు రవాణాకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. గడిచిన మూడు వారాల్లో ఆర్డర్ల సంఖ్య విపరీతంగా పెరిగిందని, రోజుకు 15 లక్షల మంది యాప్‌ను తిలకిస్తుండటంతో సిబ్బంది సంఖ్యను పెంచుకోవాలని నిర్ణయించినట్లు కంపెనీ కో-ఫౌండర్ అల్బీందర్ ధిండ్సా తెలిపారు.

# దేశ జీడీపీ 1.6 శాతమే

## ఈ ఆర్థిక సంవత్సరంపై గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా



**ముంబై, ఏప్రిల్ 8:** ఈ ఆర్థిక సంవత్సరం (2020-21)లో భారత జీడీపీ దశాబ్దాల కనిష్ఠానికి పతనం కావచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరించింది. ఈసారి వృద్ధిరేటు 1.6 శాతానికే పరిమితం కాగలదని అంచనా వేసింది. దేశంలో కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో బుధవారం ఈ అమెరికా బ్రోకరేజీ దిగ్గజం తమ జీడీపీ అంచనాలను వెల్లడించింది. ప్రస్తుత ఈ సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించడం లేదన్న గోల్డ్‌మన్.. ఆర్థిక వ్యవస్థ పురోగతికి ప్రభావవంతమైన చర్యలను తీసుకోవాలన్నది. ఇప్పటికే ఆర్థిక మందగమనంతో బాధపడుతున్న భారత్‌ను కోవిడ్-19 కోలుకోలేని దెబ్బ తీసిందని అభిప్రాయపడింది. చాలా రేటింగ్ ఏజెన్సీలు, అంతర్జాతీయ బ్రోకరేజీలు సైతం ప్రపంచ జీడీపీ, భారత జీడీపీ అంచనాలను గణనీయంగా తగ్గిస్తున్న విషయం తెలిసిందే. లాక్‌డౌన్ నేపథ్యంలో వైరస్‌పట్ల ప్రజల్లో ఉత్సుకత పెరిగిందని, భయంతో బయటకు రాలేక వ్యాపార కార్యకలాపాలు దారుణంగా పడిపోయాయని, ఈ ప్రభావం ఒక్క మార్చిలోనేగాక ఈ త్రైమాసికం మొత్తం ఉంటుందని గోల్డ్‌మన్ పేర్కొన్నది. అన్ని రంగాల్లో నిస్తేజం నెలకొన్నట్లు చెప్పింది.

# దమానీ ధమాకా

## లాక్‌డౌన్‌లోనూ 5 శాతం పెరిగిన సంపద



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఆర్థిక మాంద్యం ఒకవైపు బుసలు కొడుతుంటే.. మరోవైపు కరోనా వైరస్ రక్కసి కోరలు చాస్తున్న ప్రస్తుత తరుణంలో ఆయన సంపాదన మాత్రం అమాంతం పెరుగుతూనే ఉన్నది. దేశీయ కుబేరుల సంపాదన లక్షల కోట్లు ఆవిరైపోతున్న సమయంలో ఆయన ఆస్తి మాత్రం రోజు రోజుకూ పెరుగుతున్నది. ఆయనే రాధాకృష్ణ దమానీ. దేశీయ రిటైల్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి డీ-మార్ట్ పేరుతో ప్రారంభించిన వ్యాపారం అనతికాలంలోనే అగ్రగామి సంస్థలకు గట్టి పోటీనిచ్చే స్థాయికి ఎదిగింది. ముంబైలో ఒక చిన్న గదిలో ప్రారంభమైన ఆయన వ్యాపారం అంచెలంచెలుగా ఎదుగుతూ.. దేశంలోని పది రాష్ట్రాలకు విస్తరించింది. సామాన్యుడికి అత్యంత చవకకే అన్ని రకాల గృహోపకరణాలు అందించడంలో విజయవంతం కావడం ఆయన ఆస్తి పెరగడానికి ప్రధాన కారణం. తాజాగా బ్లూంబర్గ్ దేశీయ కుబేరుల జాబితాల్లో భారత్ నుంచి సంపాదన పెరిగిన వారిలో ఒకే ఒక్కడు దమానీ ఉండటం విశేషం. ప్రస్తుత సంవత్సరంలో ఆయన సంపాదన 5 శాతం పెరిగి 10.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఆయన నాయకత్వం వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్ట్స్ లిమిటెడ్ షేరు ధర 18 శాతం లాభపడటం ఇందుకు దోహదం చేసింది.




జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు సంయుక్త ఆధ్వర్యంలో పేదలకు ఆహారపు ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## దేశ ఆర్థిక వ్యవస్థ బతకాలంటే భారీ ప్యాకేజీ అవసరం

కనీసం రూ. 15 లక్షల కోట్లు కావాలి

అసోచామ్ 16 డిమాండ్ల అజెండా

# ఉద్దీపనలే ఊపిరి

చంద్ర మండలానికే నిచ్చెనలేసిన మానవుడిని ఓ వైరస్ చావుదెబ్బ తీస్తున్నదిప్పుడు. దాదాపు మూడున్నర నెలల కింద పుట్టిన కరోనా వైరస్ ధాటికి.. ప్రపంచంలోని సుమారు 800 కోట్ల మందికి దడ పుడుతున్నది. మానవ మేధస్సుకే సవాల్ విసురుతున్న ఈ మహమ్మారి కారణంగా అగ్రదేశాలు సైతం భయంతో నిర్మానుష్యంగా మారిపోయాయి. అయితే కరోనా రక్కసి మోగిస్తున్న మృత్యు ఘంటికల మాటున ఆర్థిక వ్యవస్థలు ఉసూరుమంటున్నాయి. ఇందుకు భారత్ కూడా మినహాయింపు కాదు. లాక్‌డౌన్‌తో పరిస్థితుల్ని చేజారిపోకుండా జాగ్రత్త పడుతున్నా.. దేశ ఆర్థిక వ్యవస్థకు మాత్రం జరుగాల్సిన నష్టం జరుగుతున్నది. దీంతో భారీ స్థాయిలో ఉద్దీపనలు వస్తేగానీ భారత్‌కు భవిష్యత్తు ఉండబోదని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



**ముంబై, ఏప్రిల్ 8:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్.. భారత్‌లోనూ విజృంభిస్తున్న నేపథ్యంలో అపార ఆర్థిక నష్టం వాటిల్లుతున్నది. మునుపెన్నడూ లేని భయానక పరిస్థితులు నెలకొనగా.. పెద్ద ఎత్తున ఉద్దీపనల అవసరం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లేనిపక్షంలో కోలుకోలేని దెబ్బ తప్పదని హెచ్చరిస్తున్నారు. నివారణ తప్ప మందేలేని ఈ అంటు వ్యాధిని అరికట్టేందుకు లాక్‌డౌన్ ఒక్కటే పరిష్కారంగా కనిపిస్తున్నది. అయితే పారిశ్రామికోత్పత్తి, వ్యాపార కార్యకలాపాలు స్తంభించి ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థే బలహీనపడుతున్నది. వ్యాపార, పారిశ్రామిక సంఘం అసోచామ్.. ఈ గండం నుంచి గట్టెక్కాలంటే కనీసం రూ.15.25 లక్షల కోట్ల ఉద్దీపనలు అవసరమని చెప్తున్నది. కనిష్ఠంగా రూ.15.25 లక్షల కోట్లు (200 బిలియన్ డాలర్లు), గరిష్ఠంగా రూ.22.86 లక్షల కోట్ల (300 బిలియన్ డాలర్లు) ఉద్దీపనలు ప్రకటించాలని అసోచామ్ ప్రధాన కార్యదర్శి దీపక్ సూద్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజల ఆదాయంపై కరోనా వైరస్ ప్రభావం దృష్ట్యా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాసిన సిఫార్సు లేఖలో 16 పాయింట్ల అజెండాను అసోచామ్ అధ్యక్షుడు నిరంజన్ హీరానందని ప్రతిపాదించారు.

### అజెండాలోని ముఖ్యాంశాలు

1. అన్ని రుణాల చెల్లింపులను 6 నెలలపాటు వాయిదా వేయాలని ఆర్బీఐ ఆదేశించాలి. కిస్తీలపై, రుణ వ్యవధిపై ప్రభావం పడకుండా ఈ 6 నెలల ఈఎంఐలను రద్దు చేయాలి.
2. దేశీయ కార్పొరేట్లకు వచ్చే ఏడాది మార్చి 31దాకా పన్ను మినహాయింపులు ఇవ్వాలి.
3. హోటల్, విమానయానం, పర్యాటక, రవాణా, హాలిడే ఆపరేటర్స్, మాల్, సినిమా యాజమాన్యాలకు ఏడాది వడ్డీ రాయితీ, రుణాల అసలు చెల్లింపులపై సంవత్సరం మారటోరియం అందించాలి.
4. విద్యుత్, ఇంధన ఉత్పత్తులను తక్షణమే జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి.
5. ఆటో, కన్జ్యూమర్ గూడ్స్, రవాణా, హోటల్ బస రంగాల్లో కొనుగోళ్లు, సేవలపై 60 నెలల ఈఎంఐ ప్లాన్‌ను అనుమతించాలి. వచ్చే ఏడాది మార్చి ఆఖరుదాకా వడ్డీలను వేయరాదు.
6. గృహ, వాహన కొనుగోళ్లపై 10 శాతం వ్యక్తిగత పన్ను రిబేటు ఇవ్వాలి.
7. దేశంలోని అన్ని సంస్థలకు కార్పొరేట్ పన్నును 20 శాతానికి తగ్గించాలి. విదేశీ సంస్థలకూ పన్ను రేటును 30 శాతానికి తగ్గించాలి. సర్‌చార్జీలు, సెస్సులను ఎత్తివేయాలి.
8. ప్రత్యక్ష పన్నులు, వ్యక్తిగత ఆదాయం పన్ను పరిమితిపై అఖిలేష్ రంజన్ కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలి.
9. మొండి బకాయిలు, అనుమానిత రుణగ్రహీతలపై కఠిన చర్యలు తీసుకోరాదు. ఈ రకమైన చర్యలతో సంస్థలు మూతబడి నిరుద్యోగం పెరిగే వీలున్నది.
10. బ్యాంకింగ్ వ్యవస్థకు మరిన్ని నిధులు అందించి, రుణాల మంజూరును పెంచాలి.

### ఫిక్కీ, సీఐఐ కూడా..

ఫిక్కీ, సీఐఐలు కూడా ఆర్థిక ప్యాకేజీలను ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. కరోనా ప్రభావం నేపథ్యంలో చితికిపోయిన సంస్థలకు చేయూతనివ్వాలని, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల రుణాలను పునర్వ్యవస్థీకరించాలని సీఐఐ కోరింది. పేద, అసంఘటిత కార్మికుల రక్షణార్థం లక్ష కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్యాకేజీని తేవాలని ఫిక్కీ సూచించింది. ఎస్బీఐకి చెందిన నిపుణులు కూడా దేశ ఆర్థిక వ్యవస్థకు తక్షణమే రూ.3 లక్షల కోట్ల అదనపు ప్యాకేజీ అవసరమని అభిప్రాయపడ్డారు.

## మారుతి ప్రొడక్షన్ కట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ.. మార్చి నెలలోనూ ఉత్పత్తిని భారీగా తగ్గించుకున్నది. గత నెలలో సంస్థ కేవలం 92,540 యూనిట్ల వాహనాలను మాత్ర మే ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తి చేసిన 1,36,201 యూనిట్లతో పోలిస్తే 32 శాతం తక్కువ. వీటిలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి 1,35,236 ల నుంచి 91,602లకు పడిపోయాయి.

## ఉత్పత్తికి అవకాశమివ్వండి

### సీఎంకు టీఐఎఫ్ వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** కరోనా నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల్లో ఒకటి రెండు పారిశ్రామికవాడలు ప్రయోగాత్మకంగా ఉత్పత్తికి అనుమతి ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను టీఐఎఫ్ కోరింది. ఈ మేరకు బుధవారం సీఎం కేసీఆర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు లేఖ ద్వారా విన్నవించారు. పారిశ్రామికవాడల్లో ప్రయోగాత్మకంగా చిన్న పరిశ్రమలకు వాణిజ్య ఉత్పత్తికి అనుమతి ఇవ్వాలని, ఒకే సారి ఉత్పత్తి నిలిచిపోవడంతో ప్రజల అవసరాలు, కార్మికులకు ఉపాధి, యంత్రాలకు సంబంధించిన సమస్యలు సహా ఇతరత్రా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని తమ లేఖలో పేర్కొన్నారు.

## జైపీ 3 కోట్ల విరాళం

### సైకిల్ అగర్‌బత్తీస్ రూ. కోటి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కరోనా వైరస్‌పై పోరులో ప్రభుత్వాలకు కార్పొరేట్లు విరాళాలతో అండగా నిలుస్తున్నారు. జైపీ గ్రూప్ పీఎం-కేర్స్ ఫండ్‌కు రూ.3 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఎంపీ, యూపీ ఉత్తరాఖండ్ సీఎంఆర్‌ఎఫ్‌లకు రూ. 1.22 కోట్లను అందజేసింది. సైకిల్ ప్యూర్ అగర్‌బత్తీస్ పీఎం-కేర్స్‌కు రూ. 1.08 కోట్ల విరాళాన్ని ప్రకటించింది.

# ఆట




## బట్లర్ జెర్సీకి రూ.61లక్షలు

**లండన్:** గతేడాది ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ ధరించిన జెర్సీ.. వేలంలో 80వేల డాలర్లు(దాదాపు రూ.61లక్షలు) పలికింది. కరోనా వైరస్‌పై పోరాటానికి సహకరించేందుకు లార్డ్స్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన తుదిపోరులో ధరించిన తనకు ఎంతో ఇష్టమైన షర్టును ఇటీవలే బట్లర్ వేలానికి పెట్టాడు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని లండన్‌లోని లాయల్ బ్రాంప్టన్, హేర్‌ఫీల్డ్ ఆసుపత్రులకు జోస్ అందించనున్నాడు.

## అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ షెడ్యూల్ ఖరారు

**పారిస్:** అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్ కొత్త షెడ్యూల్ విడుదలైంది. 2022 జూలై 15 నుంచి 24 వరకు టోర్నీని నిర్వహించనున్నట్టు ప్రపంచ అథ్లెటిక్స్ బుధవారం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది ఒరెగాన్ వేదికగా జరగాల్సిన ప్రపంచ చాంపియన్‌షిప్.. కరోనా వైరస్ కారణంగా టోక్యో ఒలింపిక్స్ వచ్చే యేడుకు వాయిదా పడడంతో 2022కి మారింది.

# రోజుకు 7 గంటలు ప్రాక్టీస్

కరోనా వైరస్ కారణంగా లాక్‌డౌన్ ఉన్నా.. ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందుతూ.. ప్రతిరోజూ శ్రమిస్తున్నానని తెలంగాణ జిమ్నాస్ట్ బుద్దా అరుణా రెడ్డి చెప్పింది. గాయం నుంచి కోలుకుంటున్నందున ఫిట్‌నెస్‌పై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్టు తెలిపింది. కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో గొప్పగా ఉన్నాయంటూ కీర్తించింది. ప్రజలందరూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని, కుటుంబం కోసమైనా బయటకు రాకుండా ఉండాలని అరుణా రెడ్డి సూచించింది. దీంతోపాటు తన భవిష్యత్ ప్రణాళికను వివరించింది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

- **ఆన్‌లైన్ ద్వారా రోజూ శిక్షణ**
- **కరోనాపై పోరాడుతున్న అందరికీ హ్యాట్సాఫ్**
- **నమస్తే తెలంగాణతో జిమ్నాస్ట్ బుద్దా అరుణా రెడ్డి**





ఆన్‌లైన్ శిక్షణ ద్వారా ఇంట్లో ప్రాక్టీస్ చేస్తున్న అరుణా రెడ్డి

**రోజూ శ్రమిస్తున్నా..**

భారత క్రీడాప్రాధికార సంస్థ(సాయ్) వీడియో కాన్ఫరెన్స్ యాప్ ద్వారా ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నది. ఉదయం 4గంటలు, సాయంత్రం 3గంటలు శ్రమిస్తున్నా. ఉదయం ఫిట్‌నెస్ కోసం కష్టపడుతున్నా. సాయంత్రం జిమ్నాస్టిక్స్ సాధన చేస్తున్నా. మనోజ్ రానా నాకు కోచ్‌గా ఉన్నారు. గాయం నుంచి కోలుకుంటున్నందున ఫిట్‌నెస్‌పై ఎక్కువ దృష్టిసారిస్తున్నా. ఆన్‌లైన్ శిక్షణలో రోజుకు 100 మంది అథ్లెట్ల వరకు వారివారి ఇండ్ల నుంచే పాల్గొంటున్నారు. అంతర్జాతీయ స్థాయి నుంచి కెరీర్ ప్రారంభంలో ఉన్న అథెట్లు ఇందులో ఉన్నారు. సాయం త్రం వేళల్లో విదేశీ కోచ్‌లు సైతం సూచనలు ఇస్తున్నారు.

**మళ్లీ వచ్చే ఏడాది పోటీకి దిగుతా..**

శస్త్ర చికిత్స జరుగడంతో ప్రస్తుతం కోలుకునేందుకు ప్రయత్నిస్తున్నా. ఈ ఏడాది ఏ టోర్నీలోనూ బరిలోకి దిగకూడదని ముందే అనుకున్నా. పూర్తిగా గాయం నుంచి కోలుకున్నాక మళ్లీ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి టోర్నీల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నా. అయినా కరోనా వైరస్ కారణంగా ఈ ఏడాది ఏ టోర్నీ జరిగేలా కనిపించడం లేదు. ప్రస్తుతం ఇంటికే పరిమితమైనా.. ఏడు గంటలు ప్రాక్టీస్ చేస్తుండడంతో తీరిక దొరకడం లేదు. జిమ్నాస్ట్‌గా మారాక ఒకేసారి ఇంట్లో ఇన్ని రోజులు ఎప్పుడూ ఉండలేదు. మార్చి వరకు ముంబైలో నెలలో కొన్ని రోజులు ఫిట్‌నెస్ శిక్షణ తీసుకునేదాన్ని. ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యా.

**తెలంగాణ ప్రభుత్వ చర్యలు భేష్**

కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నది. చాలా బాగా పనిచేస్తున్నది. ప్రజలందరూ ప్రభుత్వ సూచనలు పాటించాలి. లాక్‌డౌన్‌ను అనుసరించాలి. సమాజం కోసం కాకపోయినా తమ కుటుంబం కోసమైనా జాగ్రత్తగా ఉండాలి. ఎవరూ బయట తిరగకండి.

**వారికి సలాం..**

కరోనాపై యుద్ధంలో వైద్య సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారు. వారందరికీ కృతజ్ఞతలు. ప్రభుత్వ, వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తూ ప్రజలందరూ సహకరించాలి. కరోనా వైరస్‌ను రూపుమాపేందుకు కృషి చేయాలని అందరినీ కోరుతున్నా.

## భారత్ X పాక్.. సిరీస్ నిర్వహించాలి



షోయబ్ అక్తర్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్(కొవిడ్-19)పై యుద్ధం కోసం నిధులను సేకరించేందుకు పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ కొత్త ప్రదిపాదన తీసుకొచ్చాడు. నిధులను సమీకరించేందుకు చిరకాల ప్రత్యర్థులు భారత్ - పాకిస్థాన్ మధ్య మూడు వన్డేల సిరీస్ నిర్వహించాలని బుధవారం ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. ఖాళీ స్టేడియాల్లో ఈ మ్యాచ్ నిర్వహించినా, టీవీల్లో వీక్షణల ద్వారా భారీగా డబ్బులు వస్తాయని చెప్పాడు. 'ఈ మ్యాచ్ టీవీలకే పరిమితమవ్వాలి. ప్రతి ఒక్కరూ ఇండ్లలో ఉండి మ్యాచ్ చూస్తారు. చాలా కాలం తర్వాత ఇరు జట్లు పోటీ పడడంతో భారీగా వీక్షణలు వస్తాయి. ప్రకటనల ద్వారా వచ్చిన డబ్బును కరోనా నివారణ కోసం ఇరు దేశాల ప్రభుత్వాలకు సమానంగా పంచాలి' అంటూ అక్తర్ అభిప్రాయపడ్డాడు. ఇలా చేస్తే మైదానంలో ఎవరు గెలిచినా.. బయట మాత్రం అందరూ విజేతలే అవుతారని చెప్పాడు

## సాయిప్రణీత్ రూ. 4లక్షల విరాళం



**న్యూఢిల్లీ:** కరోనాపై యుద్ధానికి తన వంతు సాయం చేసేందుకు తెలుగు షట్లర్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయిప్రణీత్ రూ.4లక్షలను విరాళంగా ప్రకటించాడు. పీఎం సహాయ నిధికి రూ.3లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.లక్షను విరాళంగా అందించినట్టు బుధవారం ట్వీట్ చేశాడు.

**హాకీ ఇండియా రూ.21లక్షలు**

ఒడిశా సీఎం సహాయ నిధికి హాకీ ఇండియా(హెచ్ఐ) రూ.21లక్షలను విరాళంగా ఇస్తున్నట్టు బుధవారం ప్రకటించింది. ఇప్పటికే రూ.కోటిని పీఎం-కేర్స్ నిధికి హెచ్ఐ అందించిన సంగతి తెలిసిందే.

## విజ్డెన్ లీడింగ్ క్రికెటర్‌గా స్టోక్స్

**లండన్:** 2019కు గాను ప్రతిష్ఠాత్మక విజ్డెన్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ దక్కించుకున్నాడు. మూడేండ్లుగా ఈ గౌరవాన్ని అందుకుంటున్న టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ జోరుకు అతడు బ్రేకులేశాడు. 2020 విజ్డెన్ క్రికెటర్స్ అల్మానాక్‌లో స్టోక్స్ చోటు దక్కించుకున్నాడు. కాగా, 2005లో మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రూ ఫ్లింటాఫ్ తర్వాత ఈ ఘనత సాధించిన ఇంగ్లండ్ ఆటగాడిగానూ అతడు ఘనత సాధించాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
గురువారం 9 ఏప్రిల్ 2020

# నీతి ఆయోగ్ ఇంటర్న్‌షిప్

**యూజీ, పీజీ, రిసెర్చ్ స్కాలర్స్‌కు ఇండస్ట్రీస్ రిలేటెడ్ ఎక్స్‌పోజర్ అందించడానికి నీతి ఆయోగ్ ఇంటర్న్‌షిప్ అందిస్తుంది. దీనికి ఎంపికైనవారు ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి పనులపై పరిశోధనలు చేయాలి. అంతేకాకుండా వివిధ భాగాలు, యూనిట్లలో అనుభవం ఉన్నవారితో కలిపి పనిచేసేందుకు అవకాశం కలుగుతుంది. అయితే ఈ స్కీంలో ఎంపికైన వారికి స్టయిపెండ్ ఇవ్వరు. దీని నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో వివరాలు..**




- ప్రభుత్వ థింక్ ట్యాంక్, విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తున్నది నీతి ఆయోగ్. నీతి ఆయోగ్ ఇంటర్న్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రారంభించింది. ప్రభుత్వ రంగంలో కెరీర్‌ను ప్రారంభించాలనుకునేవారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. ఇంటర్న్స్‌కు పరస్పర లబ్ధి అనే కాన్సెప్ట్‌తో ప్రారంభించిన ఈ పథకం ద్వారా 25 సబ్జెక్టుల్లో ఇంటర్న్‌షిప్ చేయవచ్చు. దీనిలో విద్యార్థులు ప్రభుత్వ విధాన పరమైన నివేదికలు, పరిపాలన విధానాలు, గవర్నెన్స్, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రిపోర్టులను అధ్యయనం చేయాలి. దీనివల్ల జ్ఞానం పెరుగుతుంది. ఇది కెరీర్‌కు ఉపయోగపడుతుంది. ఇంటర్న్‌షిప్ కోసం ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

### అర్హత

- ఇంటర్, 10+2లో 85 శాతం, డిగ్రీలో 70 శాతం మార్కులతో పాసైనవారు అర్హులు. డిగ్రీ రెండో సంవత్సరం లేదా నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా దదఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో 70 శాతం మార్కులతో పాసైనవారు, పీజీ ఫస్టియర్ పరీక్షలు రాసినవారు, పీహెచ్‌డీ చేస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఇంటర్న్‌షిప్ కనీసం ఆరు వారాల నుంచి ఆరు నెలల వరకు ఉంటుంది. ఇంటర్న్‌షిప్ పూర్తయిన విద్యార్థులకు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ అందజేస్తారు. మధ్యలో మానేసినవారికి సర్టిఫికెట్ ఇవ్వరు.
- ఒక అభ్యర్థిని ఏడాదికి ఒకసారి మాత్రమే అనుమతిస్తారు.
- ప్రతి డిపార్ట్‌మెంట్ ఒక్కో టర్మ్‌లో ముగ్గురినే సెలెక్ట్ చేసుకుంటుంది.
- సర్టిఫికెట్ పొందాలంటే 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలి.
- అభ్యర్థులకు సొంత ల్యాప్‌టాప్ ఉండాలి.

### సబ్జెక్టులు

- అగ్రికల్చర్
- డాటా మేనేజ్‌మెంట్ & అనాలసిస్
- ఎకనామిక్
- ఎడ్యుకేషన్/హ్యూమన్ రిసోర్స్‌డెవలప్‌మెంట్
- ఎనర్జీ సెక్టార్
- ఫారెన్ ట్రేడ్/కామర్స్
- గవర్నెన్స్
- హెల్త్, న్యూట్రిషన్, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్
- ఇండస్ట్రీ
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కనెక్టివిటీ
- మాస్ కమ్యూనికేషన్ & సోషల్ మీడియా
- మైనింగ్ సెక్టార్
- నేచురల్ రిసోర్సెస్, ఎన్విరాన్‌మెంట్ & ఫారెస్ట్స్
- ప్రోగ్రామ్ మానిటరింగ్ & ఎవాల్యూషన్
- ప్రాజెక్ట్ అప్రైజల్ & మేనేజ్‌మెంట్
- పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్
- పబ్లిక్ ఫైనాన్స్ & బడ్జెట్
- రూరల్ డెవలప్‌మెంట్ & ఎస్‌డీజీ
- సైన్స్ & టెక్నాలజీ
- స్కిల్ డెవలప్‌మెంట్ & ఎంప్లాయ్‌మెంట్
- సోషల్ జస్టిస్ & ఎంపవర్‌మెంట్
- స్పోర్ట్స్ & యూత్ డెవలప్‌మెంట్
- టూరిజం & కల్చర్
- అర్బనైజేషన్/స్మార్ట్ సిటీస్
- వాటర్ రిసోర్సెస్
- **వెబ్‌సైట్:** www.niti.gov.in

**పరిశ్రమల్లో అవసరమైన సిబ్బందితోపాటు వాటిని మేనేజ్ చేయగల మానవ వనరులు కూడా అవసరం. ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలకు నైపుణ్యం ఉన్న మేనేజ్‌మెంట్ చదివినవారు అవసరం. వీటికి అవసరమైన నిపుణులను అందించేందుకు ఏర్పడిందే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ). 2020-22కు గాను ఐపీఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు..**



# మేనేజ్‌మెంట్ స్టడీస్

## @ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్

- మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో పరిశోధన, అభివృద్ధి కోసం ఏర్పాటైన సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ). ఇది ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్నది. మేనేజ్‌మెంట్, సోషల్ సైన్సెస్‌లలో ఉన్నత విద్యా కోర్సులైన డిగ్రీ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీలను ఐపీఈ అందిస్తుంది. దీనికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) గుర్తింపు ఉంది. ఐపీఈ అందించే ఎంబీఏ, తత్సమాన కోర్సులను ఏఐయూ (అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) గుర్తించింది. ఈ కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ గుర్తింపు కూడా ఉంది.
- ఓయూకు అనుబంధంగా, విద్య, శిక్షణ, పరిశోధనే లక్ష్యంగా ఐపీఈని నాన్ ప్రాఫిట్ ఎడ్యుకేషన్ సొసైటీగా 1964లో స్థాపించారు. ఈ సంస్థ పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందిస్తుంది. ఐపీఈ రెండేండ్ల పీజీ కోర్సులతోపాటు ఎంబీఏ, డాక్టోరల్ కోర్సులను నిర్వహిస్తుంది. వివిధ పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది.

### కోర్సులు

- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (జనరల్)
- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఇంటర్నేషనల్ బిజినెస్)
- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్)
- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (మార్కెటింగ్)
- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ అండ్ ఫైనాన్షియల్ సర్వీస్)
- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఎగ్జిక్యూటివ్)

### ఆధునిక బిల్డింగ్‌లు

- ఒకప్పుడు ఓయూలో ఉన్న ఐపీఈని ఆధునిక మౌలిక వసతులతో హైదరాబాద్ నగర శివారులోని శామీర్‌పేట్‌లో ఏర్పాటు చేశారు. క్లాసులు, హాస్టళ్లలో సెంట్రలైజ్డ్ ఏసీ సౌకర్యం కల్పించారు. ఐపీఈ బిల్డింగులను చూస్తే త్రీ స్టార్ హోటళ్లలాగా కనిపిస్తాయి. దీనిలో చదువుతోపాటు ఆటలకు కూడా సమప్రాధాన్యం ఇస్తున్నారు. క్రికెట్ నెట్స్, షటిల్ కోర్టులు, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ గ్రౌండులు ఉన్నాయి.

### అపార అనుభమున్న ప్రొఫెసర్లు

- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కరికులమ్‌ను ఐపీఈ అనుసరిస్తుంది. ఇండస్ట్రీలో అపార అనుభమున్న ప్రొఫెసర్లు ఉండటం దీని ప్రత్యేకత. ఫ్యాకల్టీలు విద్యార్థులతో ఫ్రెండ్లీగా మెలుగుతూ వారిలో నైపుణ్యాన్ని పెంచుతారు. 10 మంది స్టూడెంట్లకు ఒక మెంటార్ ఉంటారు. వీరు కోర్సు ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకు విద్యార్థులను గైడ్ చేస్తుంటారు.
- ఐపీఈ వివిధ అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు కన్సల్టెన్సీ సేవలు అందిస్తుంది. ఇందులో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ), ఐక్యరాజ్యసమితి పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (యూఎన్ఐడీపీ), ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), కామన్వెల్త్ సెక్రటేరియట్, డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (డీఎఫ్ఐడీ), గవర్నమెంట్ ఆఫ్ యూకే, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రమోషన్ (ఐసీపీఈ), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్, ప్రైవేట్ రంగ వాణిజ్య బ్యాంకులు ఉన్నాయి. దీంతోపాటు ప్రభుత్వాలు వివిధ విభాగాలు, మున్సిపల్ సేవలు, పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాల్లో చేపట్టవలసిన సంస్కరణలను గురించి అధ్యయనం చేస్తుంది. ఐపీఈ భారత ప్రభుత్వం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కొత్తగా తీసుకురావాల్సిన సంస్కరణలకు సంబంధించి కన్సల్టెన్సీగా కొనసాగుతున్నది.

### అర్హతలు

ఈ కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జీమ్యాట్, క్యాట్, మ్యాట్, గ్జాట్, ఏటీఎంఏ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) ఏదో ఒక దాని స్కోర్ తప్పనిసరిగా ఉండాలి. టాప్ స్కోర్ ఉన్నవారికి రూ.2 లక్షల వరకు మెరిట్ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది.

### 90 శాతం ప్లేస్‌మెంట్స్



- ఈ ఐపీఈ ఏటా 90 శాతం ప్లేస్‌మెంట్స్ సాధిస్తుంది. టీసీఎస్, ఐసీఐసీఐ, డెలాయిట్, ట్రినిటీ, నౌకరీ, క్యాపిటల్ ఫస్ట్ వంటి సంస్థలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సెలక్షన్‌లో ఐపీఈ విద్యార్థులను రిక్రూట్ చేసుకుంటున్నాయి. సుమారు రూ.5.5 లక్షల నుంచి 10 లక్షల వరకు వార్షిక వేతనంతో ఇక్కడ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. డెలాయిట్ కంపెనీ ట్యాక్సేషన్ రిస్క్‌మేనేజ్‌మెంట్ అండ్ బ్రాండ్ ప్రొటెక్షన్, ఎంగేజ్‌మెంట్ కంట్రోలర్స్ అండ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ విభాగాల్లోని అభ్యర్థులకు వందకు వంద శాతం అవకాశాలు కల్పిస్తుంది.

- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 15
- **పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్:** http:www.ipeindia.orgను సందర్శించండి.

...✍ **సత్యం చాపల**

# Dual economy is a mixture of?

**1. Match the following persons and reasons for being in news?**
1. Dilip Kumar Patel
   a. NTPC Human Resources Director
2. Naveen Patnaik
   b. Hero to Animals Award (Given by PETA)
3. UB Pravin Rao
   c. New Chairman of NASSCOM

A) 1-b, 2-a, 3-c B) 1-b, 2-c, 3-a
C) 1-a, 2-b, 3-c D) 1-c, 2-b, 3-a

**2. Match the following states and reasons for being in news?**
**State** — **In news because**
1. Maharashtra
   a. Indian Railways set up a fumigation tunnel
2. Tamilnadu
   b.'BMC-Mpower 1on1' has been launched
3. Haryana
   c. Topped at all-India level for micro-irrigation coverage

A) 1-b, 2-a, 3-c B) 1-b, 2-c, 3-a
C) 1-a, 2-b, 3-c D) 1-c, 2-b, 3-a

**3. Observe the following?**
1. The present Foreign trade policy which is valid till 31 March 2020 has been extended till 31 March 2021.
2. The Reserve Bank of India (RBI) hiked the limit for foreign portfolio investors' (FPI) investment in corporate bonds to 15 per cent of outstanding stock for FY2020-21
3. S&P Global Ratings has further slashed India's growth forecast to 3.5% for the coming fiscal from a previous downgrade to 5.2% as it expects the damages to the economy from the covid-19 pandemic

**Which of the above are true**
A) 1,2 B) 1,3 C) 1,2,3 D) 2, 3

**4. Assertion:** The Government has extended the benefit of two per cent Interest Subvention to Banks and three per cent Prompt Repayment Incentive to all farmers upto 31st of May this year
**Reason:** The nation is in lockdown due to Covid-19
A) Both A and R are true and R is the correct explanation of A
B) Both A and R are true but R is not the correct explanation of A
C) A is true but R is false
D) A is false but R is true

**5. Observe the following?**
1. The 2020 Olympics were postponed to 2021
2. Asian Youth Games will be held in 2021 November in China
3. Asian Youth Games will be held in 2021 November in Malaysia

**Which of the above are correct**
A) 1 B) 1,3 C) 2,3 D) 1,2

**6. Match the following?**
1. World Autismday — a. April 2nd
2. World Health Day — b. April 7th
3. International day of Conscience — c. April 5th

A) 1-b, 2-a, 3-c B) 1-b, 2-c, 3-a
C) 1-a, 2-b, 3-c D) 1-c, 2-b, 3-a

**7. Assertion:** According to Fitch Solutions, India's fiscal deficit in 2020-21 may shoot up to 6.2 per cent of the GDP from 3.5 per cent government estimate
**Reason:** NK Singh committee has recommended to reduce fiscal deficit
A) Both A and R are true and R is the correct explanation of A
B) Both A and R are true but R is not the correct explanation of A
C) A is true but R is false
D) A is false but R is true

**GENERAL STUDIES**




## Foreign Trade Policy 2015-2020 extended

- ✔ The Government of India has extended the Foreign Trade Policy (FTP) by another one year i.e. up to 31st March, 2021 in view of the unprecedented current situation arising out of the pandemic Novel COVID- 19. The policy was implemented on 1st April, 2015 for 5 years and was valid upto 31st March, 2020.
- ✔ Along with extension, the Union Commerce and Industry Ministry has also announced some changes in the Foreign Trade Policy (FTP).

**8. Observe the following?**
1. Indian Railways' manufacturing unit, Chittaranjan Locomotive Works (CLW) has earned the unique distinction of manufacturing most locomotives in a year
2. The Chittaranjan Locomotive Works located in West Bengal
3. The Chittaranjan Locomotive Works located in Tamilnadu
4. Chittaranjan Locomotive was founded in 1950

**Which of the above are true**
A) 1,2 B) 1,3 C) 1,3,4 D) 1,2,4

**9. Tony Lewis passed away recently, he is associated with?**
A) Introducing 20-20 world cup matches
B) Introducing of the system of third empire in cricket matches
C) The Duckworth-Lewis-Stern method
D) None

**10. Observe the following?**
1. The government notified the empowered group set up for COVID-19 related response activities
2. The Empowered Group will be led by Rajeev Kumar, Vice Chairman of NITI Aayog
3. The Empowered Group will be led by NITI Aayog, CEO of NITI Aayog
4. The Empowered Group will coordinate with private sector, NGOs and international organisations in various services for COVID-19

**Which of the above are true**
A) 1,2,4 B) 1,3,4 C) 1,4 D) 2,4

**11. Which year has been declared as the International Year of the Period Table of Chemical Elements, by the United Nations General Assembly?**
A) 2021 B) 2020 C) 2019 D) 2023

**12. The dual economy is a mixture of ?**
A) Being State and Private Sector in the system
B) Industrial sector and manufacturing sector
C) State ownership of the means of production in corporation of foreign organisation
D) Industrial sector and trading of goods obtained through imports

**13. Which one of the following is NOT a method of measurement of National Income?**
A) Value added method
B) Income method
C) Expenditure method
D) Investment method

**14. Match the following**

| Dams | State |
|---|---|
| 1. Hirakud | a. Chhattisgarh |
| 2. Mettur | b. Orissa |
| 3. Mahanadi | c. Karnataka |
| 4. Almatti | d. Tamilnadu |

A) 1-c,2-b,3-d.4-a B) 1-b,2-d,3-a,4-c
C) 1-a,2-b,3-c,4-d D) 1-d,2-c,3-a,4-b

**15. The instrument of instructions contained in the govt of India Act 1935 has been incorporated in the Constitution of India in the year 1950 as ?**
A) Fundamental rights
B) Fundamental duties
C) Directive Principles of State Policy
D) Emergency provisions

**16. Members of Constitution Assembly were?**
A) Elected by provincial assemblies
B) Elected directly by the people
C) Nominated by the government
D) Represented only by the Princely state

**17. Match the following?**
**Forms of Govt** — **Principles**
1. Presidential system
   a. Separation of Powers
2. Parliamentary system
   b. Close relationship between executive and legislature
3. Federal system
   c. Division of power
4. Unitary system
   d. Concentration of Power

A) 1-a,2-b.3-c,4-d B) 1-b,2-c,3-a,4-d
C) 1-d,2-c,3-a,4-b D) 1-a,2-d,3-c,4-b

**18. At which of its session, did the congress officially accept the 'socialistic pattern of society'?**
A) Bombay session of 1953
B) Avadi session of 1955
C) Calcutta session of 1957
D) Nagpur session of 1959

**19. Article 340 of the constitution of India provides for the appointment of a commission to investigate the conditions for the improvement of ...**
A) Socially and educationally backward classes
B) Socially and economically backward classes
C) Educationally and economically backward classes
D) Scheduled castes and scheduled tribes

## ANSWERS

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1-c | 2-b | 3-c | 4-a | 5-d | 6-c |
| 7-b | 8-d | 9-c | 10-b | 11-c | 12-a |
| 13-d | 14-b | 15-C | 16-a | 17-a | 18-b |
| 19-a | | | | | |



వి.రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411

## Mal & Thai weightlifters banned from Tokyo Olympics

- ✔ The Independent Member Federation Sanctions Panel of the International Weightlifting Federation has
- ✔ suspended the Malaysia & Thailand weightlifters from competing in Tokyo Olympics 2020. The disci
- ✔ plinary sanctions have been imposed by IMSP on both the countries from participating in weightlifting
- ✔ events at the Tokyo Olympics for doping violations.




epaper.ntnews.com